సోమవారం 21-10-2019




సత్యమేవ జయతే


# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 210

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



212
28 ఫోర్లు
6 సిక్సలు

## రోహిత్ 'డబుల్'... సఫారీ 'ట్రబుల్'

భారత ఓపెనర్ రోహిత్ శర్మ టెస్టు కెరీర్‌లో తొలి డబుల్ సెంచరీ సాధించగా... దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడో టెస్టులో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌ను 9 వికెట్లకు 497 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా 9 పరుగులకు 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

- వివరాలు స్పోర్ట్స్‌లో







## నేడే ఎన్నికలు

**మహారాష్ట్ర, హరియాణాలో పోలింగ్**

- మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీల తోపాటు వివిధ రాష్ట్రాల్లో ఉప ఎన్నికలు నేడు జరగనున్నాయి. మహారాష్ట్రలోని మొత్తం 288 సీట్లు, హరియాణాలోని 90 స్థానాలతోపాటు 18 రాష్ట్రాల్లో 51 అసెంబ్లీ సీట్లకు, 2 ఎంపీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి.

- వివరాలు 4లో

## నేడే హుజూర్‌నగర్ ఉప ఎన్నిక



- హుజూర్‌నగర్ శాసనసభ స్థానానికి సోమవారం ఉప ఎన్నిక జరగనుంది. నియోజకవర్గ పరిధిలోని 302 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. 24న ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు.

- వివరాలు 5లో

## పీఓకేలోని ఉగ్ర స్థావరాలపై

# భారత్ దాడులు

### పాక్‌కు మరో చావుదెబ్బ




పఠాన్‌కోట్.. ఉడీ.. పుల్వామా!

ఎన్నికలొస్తే సర్జికల్ స్ట్రైకులొస్తాయ్: కాంగ్రెస్

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సమీక్ష

**35** మంది ఉగ్రవాదులు హతం!

**6-10** పాక్ జవాన్ల మృతి

**3** ఉగ్ర స్థావరాలు ధ్వంసం

4లో

" భారత్‌లోకి ఉగ్రవాదులను పంపించే ప్రయత్నాలను పాక్ నిలిపేయకపోతే మా స్పందన మరింత తీవ్రంగా ఉంటుంది. కశ్మీర్లో సాధారణ స్థితి తీసుకొచ్చేందుకు మేం కృషి చేస్తుంటే పాక్, పీఓకేలోని కొన్ని శక్తులు కావాలని కశ్మీర్లో హింసను ప్రేరేపించేందుకు కుట్ర పన్నుతున్నాయి.

– బిపిన్ రావత్, ఆర్మీ చీఫ్

" భారత్ అబద్ధాలను ప్రచారం చేస్తోంది. ఐక్యరాజ్య సమితి భద్రతామండలిలోని 5 శాశ్వత సభ్య దేశాల ప్రతినిధులను ఉగ్రస్థావరాలున్నాయని భారత్ ఆరోపిస్తున్న నీలం లోయ ప్రాంతానికి తీసుకువెళ్లేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. వారే నిజానిజాలను నిర్ధారిస్తారు.

– మొహమ్మద్ ఫైజల్, పాక్ విదేశాంగ ప్రతినిధి

## మండలానికో 108



### ప్రతి 70 వేల జనాభాకు ఓ వాహనం

- సమకూర్చాలని రాష్ట్ర ప్రభుత్వ సూత్రప్రాయ నిర్ణయం
- ప్రస్తుతం ప్రతి లక్ష జనాభాకు అందుబాటులో ఒక '108'
- రాష్ట్రవ్యాప్తంగా సేవలందిస్తున్న 358 వాహనాలు
- తెలంగాణలో 589 మండలాలు.. ఆ మేరకు పెరగనున్న వాహనాల సంఖ్య
- అత్యవసర సర్వీసు నిర్వహణకు ముందుకొచ్చిన అరబిందో ఫార్మా.. సామాజిక బాధ్యతగా ఏటా రూ. 30 కోట్ల ఖర్చుకు సంసిద్ధత

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రతి మండలానికి ఒక '108' అత్యవసర వైద్య సేవల వాహనాన్ని సమకూర్చాలని సర్కారు సూత్రప్రాయంగా నిర్ణయించింది. అందుకు సంబంధించి సమాలోచనలు జరుపుతోంది. ప్రతి మండలానికి '108' సర్వీసును అందుబాటులోకి తీసుకొస్తే దాని పరిధిలోని సమీప గ్రామాలకు తక్కువ సమయంలో చేరుకోవడానికి వీలు కలుగుతుందని, ప్రాణాపాయం నుంచి అనేక మందిని రక్షించవచ్చనేది ప్రభుత్వ ఆలోచన. ప్రస్తుతం 358 వాహనాలు '108' వైద్య సేవలు అందిస్తున్నాయి. వాటిల్లో 333 వాహనాలు రోడ్లపై అందుబాటులో ఉండగా

మిగతా 5వ పేజీలో ▶

ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మార్కెట్‌లో భారీ వర్షానికి తడిసిన ధాన్యం..



## చేతికొచ్చే వేళ.. చితక్కొడుతున్న వానలు

- వర్షాలతో తడిసిపోతున్న పంటలు
- పత్తి, వరి, సోయాబీన్ రైతుల ఆవేదన
- పలుచోట్ల రంగుమారుతున్న పత్తి

సాక్షి, హైదరాబాద్/మహబూబ్‌నగర్ రూరల్/కొల్లాపూర్/కరీంనగర్/మంచిర్యాల అగ్రికల్చర్: రాష్ట్రంలో నిత్యం కురుస్తున్న వర్షాలు పలు జిల్లాల్లోని ఖరీఫ్ పంటలకు నష్టం చేకూర్చుతున్నాయి. వారం పది రోజుల వరకు కురిసిన వాటితో ఎటువంటి ఇబ్బంది తలెత్తలేదు. తాజా వానలకు మాత్రం రైతన్నలు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో వానలు పడుతుండటంతో పడిన కష్టమంతా నీటిపాలవుతుందని ఆందోళన చెందుతున్నారు. పైగా వచ్చే నాలుగు రోజులు పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో బిక్కుబిక్కుమంటున్నారు. ఇప్పటికే కొన్ని పంట ఉత్పత్తులు మార్కెట్‌కు వస్తున్నాయి. మొక్కజొన్న, పెసర, సోయాబీన్ వంటి ఉత్పత్తులు మార్కెట్‌కి రైతులు తీసుకువస్తున్నారు. మరో వారం రోజుల్లో ధాన్యం కూడా రానుంది. నిజామాబాద్ మార్కెట్ యార్డులోకి

మిగతా 2వ పేజీలో ▶

**మరో నాలుగు రోజులు భారీ వర్షాలు** 2లో

## 4 లక్షల మందితో సకల జనుల

# సమర భేరి

### 30న భారీ బహిరంగ సభ యోచనలో ఆర్టీసీ జేఏసీ

- సంపూర్ణ మద్దతు ప్రకటించిన రాజకీయ అఖిలపక్షం
- మలి దశ సమ్మె కార్యాచరణపై తీర్మానం.. నేటి నుంచి రోజుకో నిరసన కార్యక్రమం
- దీపావళి జరుపుకోవద్దని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బంద్‌కు అన్ని వర్గాల నుంచి సంపూర్ణ మద్దతు లభించిన నేపథ్యంలో సమ్మె మలిదశ కార్యాచరణ పటిష్టంగా ఉండేలా చూడాలని ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ తీర్మానించింది. సమ్మెపై హైకోర్టులో జరిగే తదుపరి విచారణ వరకు ఉధృతంగా నిరసనలు కొనసాగించాలని ఆదివారం జరిగిన రాజకీయ అఖిలపక్ష నేతల సమావేశంలో నిర్ణయించింది. దీనికి సంపూర్ణ మద్దతు అందిస్తామని రాజకీయ పార్టీలు కూడా తేల్చి చెప్పాయి. సమ్మె కార్యాచరణలో భాగంగా ఈ నెల 30న

మిగతా 2వ పేజీలో ▶



కొత్తగూడెం బస్ డిపోలో సమ్మెకు సహకరించాలని తాత్కాలిక డ్రైవర్‌కు చేతులు జోడించి అభ్యర్థిస్తున్న కార్మికురాలు

**ఆర్టీసీని కాపాడుకుందాం.. రండి** 2లో



## నేటి నుంచి పాఠశాలలు

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో విద్యా సంస్థలు 24 రోజుల తరువాత ప్రారంభం కాబోతున్నాయి. సోమవారం నుంచి తరగతులు నిర్వహించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. దసరా సెలవుల్లో భాగంగా గత నెల 28 నుంచి మొదలైన సెలవులు ఈ నెల 13వ తేదీతోనే ముగియాల్సి ఉంది. అయితే ఆర్టీసీ సమ్మె కారణంగా ప్రైవేటు స్కూళ్లు, కాలేజీల వాహనాలన్నీ ప్రజల కోసం నడుపుతున్నారు. దీంతో ప్రభుత్వం స్కూళ్లు, కాలేజీలకు సెలవులను ఈనెల 19 వరకు పొడిగించింది. 20వ తేదీ ఆదివారం కావడంతో సోమవారం పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయి.

## మోదీ టర్కీ పర్యటన రద్దు

- ఐరాసలో టర్కీ అధ్యక్షుడి పాక్ అనుకూల వ్యాఖ్యలే కారణం



- వివరాలు 4లో

## రైలు ఆలస్యానికి తొలిసారి పరిహారం

- తేజస్ ఎక్స్‌ప్రెస్ శనివారం రెండు గంటలు ఆలస్యంగా నడవడంతో గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రయాణికులకు రూ.250 చొప్పున పరిహారం చెల్లిస్తామని ఐఆర్‌సీటీసీ ప్రకటించింది.




- వివరాలు 2లో














అయినా ఖాళీ చేయరట! చివరి ప్రయత్నంగా డెంగీ దోమల్ని వదులుదామా సార్!!

# ఈ-వాహనాలకు 'ఇంటి' చార్జీలే

### ఇళ్లలో ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్‌కు డొమెస్టిక్ చార్జీలు

- ఎవరైనా పబ్లిక్ చార్జింగ్ స్టేషన్లు పెట్టొచ్చు..
- సాంకేతిక, రక్షణ ప్రమాణాలు పాటిస్తే సరిపోతుంది
- చార్జింగ్ స్టేషన్లలో సదుపాయానికి సర్వీస్ చార్జీలు అదనం
- కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలు

సాక్షి, హైదరాబాద్: ఇళ్ల వద్ద ప్రజలు సొంత ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్‌కు గృహ కేటగిరీ విద్యుత్ చార్జీలనే వర్తింపజేయాలని కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ స్పష్టంచేసింది. పబ్లిక్ చార్జింగ్ స్టేషన్లకు మాత్రం ప్రత్యేక మీటర్లు ఏర్పాటు చేసి రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) ఖరారు చేసిన ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ టారిఫ్‌ను వర్తింపజేయాలని కోరింది. పబ్లిక్ చార్జింగ్ స్టేషన్ల వద్ద చార్జింగ్ సదుపాయం పొందే వారు విద్యుత్ చార్జీలతో పాటు సర్వీసు చార్జీలు సైతం చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించింది. సర్వీసు చార్జీలను ఈఆర్సీ/రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేస్తుందని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలని నిర్ణయించిన నేపథ్యంలో పబ్లిక్ చార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన మార్గదర్శకాలను తాజాగా కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ జారీ చేసింది. 40 లక్షలకు పైగా జనాభా గల హైదరాబాద్ వంటి మహానగరాలు, వాటికి అనుబంధంగా ఉన్న రహదారుల వద్ద ఏడాది నుంచి మూడేళ్లలోగా ప్రైవేటు చార్జింగ్ సదుపాయాలను అభివృద్ధి చేయాలని సూచించింది.



**ఈ-వాహనాల చార్జింగ్ మార్గదర్శకాల్లో ముఖ్యాంశాలు..**

- గృహాలు/కార్యాలయాల వద్ద ప్రైవేటు చార్జింగ్‌ను అనుమతించాలి. డిస్కంలు ఆ మేరకు సదుపాయాలు కల్పించాలి.
- పబ్లిక్ చార్జింగ్ స్టేషన్ల (పీసీఎస్)ల ఏర్పాటుకు ఈఆర్సీ నుంచి లైసెన్సు పొందాల్సిన అవసరం లేదు.
- ఏ వ్యక్తి/సంస్థ అయినా పబ్లిక్ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ), కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ జారీ చేసిన/జారీ చేసే మార్గదర్శకాలు, సాంకేతిక, భద్రత, నిర్వహణ ప్రమాణాలను పాటించాల్సి ఉంటుంది.
- పబ్లిక్ చార్జింగ్ స్టేషన్ నెలకొల్పాలనుకునే వ్యక్తులు విద్యుత్ కనెక్షన్ కోసం డిస్కంకు దరఖాస్తు చేసుకోవాలి. డిస్కంలు ప్రాధాన్యతనిచ్చి కనెక్షన్ జారీ చేయాలి. ఏదైనా చార్జింగ్ స్టేషన్/చైన్ ఆఫ్ చార్జింగ్ స్టేషన్లు నేరుగా ఓపెన్ యాక్సెస్

మిగతా 2వ పేజీలో ▶

## క్లుప్తంగా...

### ప్రధాని దక్షిణాదిని పట్టించుకోలేదు: ఉపాసన



సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఢిల్లీలోని లోక కల్యాణ్ మార్గ్‌లో 'చేంజ్ వితిన్'పేరుతో బాలీవుడ్ సెలబ్రిటీలను కలిసిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి షారూక్ ఖాన్, అమీర్ ఖాన్, కంగనా రనౌత్, జాక్వలిన్ ఫెర్నాండెజ్ సహా పలువురు సినీ, టెలివిజన్ ప్రముఖులు హాజరయ్యారు. ఈ విషయాన్ని మోదీ ట్విట్టర్‌లో సైతం పంచుకున్నా రు. అయితే మోదీ హిందీ ప్రముఖులను మా త్రమే కలవడంపై మెగాస్టార్ చిరంజీవి కోడ లు, సీఎస్‌ఆర్ అపోలో హాస్పిటల్స్ వైస్ చైర్‌పర్సన్ ఉపాసన కొణిదెల అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి దక్షిణాది చిత్ర పరిశ్రమ నుంచి ఒక్క కళాకారుడికి కూడా ఆహ్వానం అందకపోవడంపై ఆమె అభ్యంతరం తెలిపారు. దక్షిణాది చిత్ర పరిశ్రమను ప్రధాని పట్టించుకోవడం లేదని అభిప్రాయపడ్డారు. 'ప్రధాని మోదీ గారు.. దక్షిణ భారతదేశంలో మేం మిమ్మల్ని ఆరాధిస్తున్నాం. మీరు మా ప్రధానిగా ఉన్నందుకు గర్విస్తున్నాం. సాంస్కృతిక ప్రముఖ వ్యక్తులుగా హిందీ కళాకారులను మాత్రమే చూపి, దక్షిణ భారత చిత్ర పరిశ్రమ వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేసినట్లుగా మేం భావించాం. బాధతో వ్యక్తం చేస్తున్న నా భావనలను సరైన మనస్సుతో అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను'అని ట్వీట్ చేశారు.

### దక్షిణ మధ్య రైల్వేలో డిజిటలైజేషన్

సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వేలో చేపడుతున్న డిజిటల్ సంస్కరణల్లో భాగంగా లోకో పైలట్లకు ఆండ్రాయిడ్ ట్యాబ్‌లు, కామన్ లైవ్ బాక్స్ (సీఎల్‌బీ)లను అందజేశారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జీఎం గజానన్ మాల్యా మాట్లాడుతూ.. జోన్ పరిధిలో డిజిటలైజేషన్ ప్రారంభించడం సంతోషకరంగా ఉందన్నారు. లోకో పైలట్లపై పని భారం తగ్గించడంతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించేలా డిజిటల్ పరికరాలు అందజేసినట్లు పేర్కొన్నారు. త్వరలో రైలు ఇంజన్లలో కూడా ఎయిర్ కండిషనర్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.



### రైలు ఆలస్యానికి పరిహారం

**దేశంలో ఇదే తొలిసారి**

లక్నో: దేశంలోనే మొదటి ప్రైవేటు రైలు తేజస్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభించినప్పుడు ఒక వేళ ఏదైనా కారణంతో రైలు ఆలస్యమైతే అందుకు పరిహారం చెల్లిస్తామని ఆ రైలు బాధ్యతలు నిర్వహించే ఐఆర్‌సీటీసీ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇచ్చిన మాటకు కట్టుబడ్డ ఐఆర్‌సీటీసీ శనివారం తేజస్ ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యం నడవడంతో అందులో ప్రయాణించిన ప్రయాణికులకు రూ. 250 చొప్పున చెల్లిస్తామని ప్రకటించింది. శనివారం రైలులో ప్రయాణించిన ప్రయాణికులందరి ఫోన్లకు ఒక వెబ్ లింక్‌ను సందేశం ద్వారా పంపించామని, ఆ లింక్ ద్వారా ప్రయాణికులు పరిహారాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చని ఐఆర్‌సీటీసీ చీఫ్ రీజనల్ మేనేజర్ అశ్విని శ్రీవాస్తవ తెలిపారు. శనివారం లక్నో నుంచి ఢిల్లీకి రెండు గంటలు ఆలస్యంగా బయల్దేరిన తేజస్ ఎక్స్‌ప్రెస్, తిరుగు ప్రయాణంలోనూ రెండు గంటలు ఆలస్యంగా నడిచింది. లక్నో నుంచి ఢిల్లీకి వెళ్లేటప్పుడు 451 మంది ప్రయాణికులతో, తిరుగు ప్రయాణంలో 500 మంది ప్రయాణికులు తేజస్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించారు. నిర్వహణ పనుల ఆలస్యం వల్ల రైలు ఆలస్యమైనట్లు అధికారులు తెలిపారు. రైలు ఆలస్యమైనందున అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఐఆర్‌సీటీసీ టీ, మధ్యాహ్న భోజన పొట్లాలపై ఆలస్యమైనందుకు క్షమించండి అని ముద్రించి అందించింది. రైలు ఆలస్యమైనందుకు అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు పరిహారం అందించడం దేశంలో ఇదే మొదటిసారి.

### ఈ-వాహనాలకు 'ఇంటి' చార్జీలే

▶ మొదటి పేజీ తరువాయి

విధానంలో విద్యుదుత్పత్తి కంపెనీ నుంచి విద్యుత్‌ను పొందొచ్చు.

**పబ్లిక్ చార్జింగ్ స్టేషన్‌కు ఉండాల్సిన కనీస సదుపాయాలు:**

- సబ్ స్టేషన్ ఉండాల్సిన అన్ని రకాల పరికరాలతో ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్
- 33/11 కేవీ లైన్/కేబుల్స్, అనుబంధ పరికరాలు
- సరైన సివిల్స్ వర్క్స్, సరైన కేబులింగ్/ఎలక్ట్రికల్ వర్క్స్
- వాహనాల రాకపోకలతో పాటు చార్జింగ్‌కు సరిపడా స్థలం
- ఆన్‌లైన్‌లో చార్జింగ్ స్లాట్ల బుకింగ్ సదుపాయం కల్పించేందుకు కనీసం ఒక ఆన్‌లైన్ నెట్‌వర్క్ సర్వీసు ప్రొవైడర్‌తో ఒప్పందం కుదుర్చుకుని ఉండాలి. చార్జింగ్ స్టేషన్ల లొకేషన్, చార్జర్ల రకాలు, సంఖ్య, లభ్యత, చార్జీల వివరాలను వాహనదారులకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలి.
- హౌసింగ్ సొసైటీలు, మాల్స్, కార్యాలయ సముదాయాలు, రెస్టారెంట్లు, హోటళ్ల తదితర ప్రాంతాల వద్ద చార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి సందర్శకుల వాహనాల చార్జింగ్‌కు అనుమతించొచ్చు.

## గోతిలో పూడ్చుకుని నిరసన



ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం భూపాలపల్లిలో గోతిలో పూడ్చుకుని నిరసన తెలుపుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సాయిలు



నల్లగొండ బస్టాండ్‌లో శీర్షాసనం వేసి నిరసన తెలుపుతున్న ఓ ఆర్టీసీ కార్మికుడు

## గురుకులాల్లో స్పెషల్ ప్లాన్



సాక్షి, హైదరాబాద్

పాఠశాలల్లో అత్యుత్తమ ఫలితాల కోసం గురుకుల సొసైటీలు ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తున్నాయి. ఏటా వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నప్పటికీ... ఈ సారి వరుస సెలవులు రావడం... ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో తలెత్తిన ఇబ్బందులను అధిగమించేందుకు గురుకుల సొసైటీలు ముందస్తు చర్యలకు దిగాయి. ఇందులో భాగంగా ప్రత్యేక తరగతుల నిర్వహణ, ప్రతి రోజు పరీ క్షలు నిర్వహిం చేందుకు ఉపక్రమించాయి. ఈ మేరకు కార్యాచరణ సిద్ధం చేసి పాఠశాల ప్రిన్స్‌పాళ్లకు పంపించాయి. వాస్తవానికి

**నవంబర్ 1 నుంచి ప్రత్యేక తరగతుల నిర్వహణ**
**ఉదయం, సాయంత్రం గంటపాటు బోధన, అభ్యసన**
**ప్రతిరోజు ఒక సబ్జెక్టులో సందేహాల నివృత్తి, స్లిప్ టెస్టులు**
**వరుస సెలవుల నేపథ్యంలో ముందే యాక్షన్ ప్లాన్**

ప్రతి సంవత్సరం నూరు రోజుల ప్రణాళిక పేరిట గురుకుల సొసైటీలు డిసెంబర్ నుంచి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టేవి. కానీ ఈసారి నవంబర్ నుంచే అమలు చేసేం దుకు సిద్ధమయ్యాయి. వరుసగా 24 రోజులు సెలవులు రావడంతో విద్యార్థుల్లో అభ్యసనా కార్యక్రమాలు తగ్గాయి. ఈ నెల 20 నాటికి గురుకులంలో రిపోర్టు చేయాలని సూచించినా... ఆది వారం సాయంత్రానికి చాలా పాఠశాలల్లో విద్యార్థులు రాలేదు. రవాణా సమస్యలే దీనికి కారణమని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల్లో బోధన, అభ్యసన పట్ల శ్రద్ధ తగ్గకుండా ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని నిర్ణయించాయి.

**ప్రతిరోజు స్పెషల్ క్లాసులు...**

నవంబర్ మొదటి వారం నుంచి 8, 9, 10 తరగతులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. ఒకే సబ్జెక్టుపైన ఉదయం పూట బోధన, సాయంత్రం పూట అభ్యసన, సందేహాల నివృత్తితో పాటు పరీక్షను నిర్వహిస్తారు. ఇలా వారంలో అన్ని సబ్జెక్టులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుని, విద్యార్థి సామర్థ్యాన్ని అంచనా వేస్తారు. ప్రతి ఆదివారం విద్యార్థుల సామర్థ్యంపై ఉపాధ్యాయులు విశ్లేషించి, తక్కువ సామర్థ్యం ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. ఇలాంటి వారు ఎక్కు వ మంది ఉంటే ఒక బృందంగా ఏర్పాటు చేసి ప్రత్యేక బోధన తరగతులు నిర్వహించి, సామర్థ్యాన్ని మెరుగుపర్చేలా వివిధ రకాల కార్యక్రమాలు చేపడతారు. ఈ ప్రణాళికకు అదనంగా పదో తరగతికి మరో కార్యచరణ అమలు చేయాలని అధికారులు భావిస్తున్నారు.

**ఆర్సీలకు నివేదికలు...**

పాఠశాల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసిన తర్వాత ఆ వివరాలను రీజినల్ కో–ఆర్డినేటర్ల(ఆర్సీ)కు సమర్పించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి నిర్దేశిత ప్రొఫార్మాలను గురుకుల సొసైటీ తయారు చేసి ప్రిన్సిపాళ్లకు పంపింది. దాని ఆధారంగా వివరాలను ఆన్‌లైన్‌లో ఆర్సీలకు సమర్పిస్తే వాటిని క్రోడీకరించి సొసైటీ కార్యాలయానికి పంపిస్తారు. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన నివేదికలు సొసైటీ కార్యాలయాల్లో విశ్లేషించి, తదుపరి కార్యాచరణను రూపొందిస్తారు.

# ఆర్టీసీని కాపాడుకుందాం.. కదిలిరండి!

- ప్రజలకు పూలు అందించి విజ్ఞప్తి చేసిన కార్మికులు
- రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఆర్టీసీ జేఏసీ ఆందోళనలు
- మద్దతు పలికిన విపక్ష నేతలు.. ఇటు రోడ్డెక్కిన 71.93 శాతం సర్వీసులు
- నేడు తెరుచుకోనున్న విద్యాసంస్థలు.. బస్సుల సంఖ్య పెంచేందుకు చర్యలు
- నేడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి పువ్వాడ సమీక్ష

సాక్షి, హైదరాబాద్: 'ఆర్టీసీని కాపాడుకుందాం... ప్రజా రవాణా వ్యవస్థను పరిరక్షించుకుందాం..'ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ చూసినా ఇదే నినాదం కనిపించింది. వేల మంది ఆర్టీసీ కార్మికులు ఈ నినాదం రాసి ఉన్న ప్లకార్డులు పట్టుకుని కూడళ్ల వద్ద నిలబడి సాధారణ ప్రజానీకంతో మాట్లాడి మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేశారు. శనివారం నాటి బంద్‌కు ప్రజలు కూడా మద్దతు తెలపటంతో వారికి కృతజ్ఞతలు తెలుపుతూనే తదుపరి తమ కార్యాచరణకు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారు. తాము తమ జీతాల కోసం ఈ సమ్మె చేయటం లేదని, ఆర్టీసీ పరిరక్షణ కోసమే ఉద్యమిస్తున్నామని చెప్పే ప్రయత్నం చేశారు. కొన్ని ప్రాంతాల్లో వారి కుటుంబసభ్యులు కూడా నిలబడి ప్రజలకు గులాబీ పూలు ఇచ్చి మరీ మద్దతు కోరటం విశేషం. ఇక యథాప్రకారం డిపోల ముందు నిలబడి బస్సులు బయటకు రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. తాత్కాలిక డ్రైవర్లు తమ పొట్టకొట్టొద్దని వేడుకునే ప్రయత్నం చేశారు. శాంతియుతంగా కార్యక్రమాలు జరగటంతో రాష్ట్రంలో ఎక్కడా పెద్ద ఉద్రిక్తత నెలకొనలేదు. గత పక్షం రోజులుగా సమ్మెలో పాల్గొంటున్న సత్తుపల్లికి చెందిన డ్రైవర్ ఖాజామియా ఆదివారం గుండెపోటుతో మృతి చెందటం కార్మికులను కలిచివేసింది. ఉద్యోగ భద్రత దిగులుతోనే ఆయన మృతి చెందాడంటూ కార్మికులు ఆరోపించారు. ములుగు జిల్లాలో జాతీయ రహదారిపై ఆదివారం సాయత్రం ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన తాత్కాలిక డ్రైవర్ పరారయ్యాడు. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా 4,502 ఆర్టీసీ బస్సులు, 1,953 అద్దె బస్సులు తిప్పినట్టు ఆర్టీసీ ప్రకటించింది. మొత్తంగా 71.93 శాతం సర్వీసులు రోడ్డెక్కినట్టు వెల్లడించింది.

**నేడు కీలక నిర్ణయం వెలువడనుందా?**

ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరపాలంటూ 18న హైకోర్టు ఇచ్చిన ఆదేశం తాలూకు ప్రతి సోమవారం అధికారులకు అందే అవకాశముంది. దీంతో సోమవారం కీలక నిర్ణయం వెలువడే అవకాశమున్నట్లు తెలుస్తోంది. కోర్టు ఆదేశం తర్వాత రవాణాశాఖ మంత్రి పువ్వాడ, అధికారులు సీఎంతో భేటీ కోసం ప్రగతిభవన్ వెళ్లిన విషయం విదితమే. కానీ కోర్టు ఆదేశం తాలూకు ప్రతి అందకపోవటంతో సీఎం దానిపై చర్చించలేదు. సోమవారం ఆ ప్రతి అందితే దాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి తదుపరి కార్యాచరణను అధికారులు రూపొందించనున్నారు. కార్మిక సంఘాలతో ఆర్టీసీ ఎండీ చర్చలు జరపాలని కోర్టు ఆదేశించినందున, సోమవారం దీనిపై తుది నిర్ణయం తీసుకునే అవకాశముంది. కోర్టు ప్రతి అందటంలో జాప్యం జరిగితే ఈ ప్రక్రియలోనూ జాప్యం తప్పకపోవచ్చు. కాగా దసరా సెలవుల పొడిగింపు పూర్తి కావటంతో సోమవారం విద్యాసంస్థలు తిరిగి ప్రారంభమవుతున్నాయి. ఇప్పటివరకు ఆయా విద్యాసంస్థల బస్సులను కూడా ప్రభుత్వం స్టేజీ క్యారియర్లుగా వాడుకుంది. ఇప్పుడు ఆ బస్సులన్నీ తిరిగి విద్యా సంస్థలకు వెళ్లిపోయాయి. దీంతో అంతమేర బస్సుల సంఖ్య తగ్గడమే కాకుండా ఒకేసారి వేల మంది విద్యార్థులు ప్రయాణాలకు రోడ్డెక్కనుండటంతో వారికి బస్సులు అందుబాటులో ఉంచాల్సిఉంది. విద్యార్థులకు ఇబ్బంది కాకుండా ఏర్పాట్లు చేయాలన్న సీఎం ఆదేశాలతో అధికారులు ఆదివారం ముందస్తు ఏర్పాట్లలో తలమునకలయ్యారు. హైదరాబాద్, శివారు ప్రాంతాల్లో కనీసం 2 వేల బస్సులను అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. ఇటు తాత్కాలిక డ్రైవర్ల సంఖ్యను వీలైనంతగా పెంచుకోవాలని అన్ని డిపో మేనేజర్లకు ఆదేశాలందాయి. ఇక విద్యార్థుల బస్ పాస్‌లు కేటగిరీతో సంబంధం లేకుండా అన్ని బస్సుల్లో చెల్లుబాటయ్యేలా ఆదేశాలు జారీ చేశారు. ఆర్డినరీ పాస్ ఉన్న వారు కూడా ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ఎక్కొచ్చు.

**నేడు మంత్రి పువ్వాడ వీడియో కాన్ఫరెన్సు..**

విద్యాసంస్థలు తెరుచుకోనుండటంతో పరిస్థితిని అంచనా వేసి ఆదేశాలు జారీ చేసేందుకు వీలుగా రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సోమవారం ఉదయం 11 గంటలకు ఆర్టీసీ, రవాణా శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు.

**డిపోల ఎదుట ఆందోళనలు..**

ఆర్టీసీ సమ్మె 16వ రోజు ఉధృతంగానే కొనసాగింది. అన్ని జిల్లాల్లో ఉదయం నుంచే డిపోల ఎదుట ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా విపక్ష పార్టీల నేతలు, ప్రజా సంఘాల నాయకులు ధర్నాల్లో పాల్గొన్నారు. ఇటు ప్రభుత్వ దిష్టి బొమ్మలను దహనం చేసి మానవహారాలు నిర్వహించారు. శనివారం బంద్ విజయవంతం చేసినందుకు కొన్నిచోట్ల ప్రజలకు, దుకాణదారులకు గులాబీ పూలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. తమ పొట్ట కొట్టొదని తాత్కాలిక కార్మికులను కోరుతూ ఆర్టీసీ కార్మికులు కొన్నిచోట్ల పూలు అందజేశారు.

# 4 లక్షల మందితో సకల జనుల సమర భేరి

▶ మొదటి పేజీ తరువాయి

కనీసం 4 లక్షల మందితో సకల జనుల సమర భేరీ పేరుతో హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో 3 లక్షల మంది ఆర్టీసీ కార్మికుల కుటుంబ సభ్యులు, మరో లక్ష మంది సాధారణ ప్రజలు హాజరయ్యేలా రాజకీయ పార్టీలతో కలసి జనసమీకరణ జరపాలని నిశ్చయించారు. ఈలోగా ఇతర నిరసన కార్యక్రమాలు కొనసాగించనున్నారు.

**మలిదశ సమ్మె కార్యాచరణ ఇలా...**

- నేడు అన్ని డిపోల వద్ద కార్మికుల కుటుంబ సభ్యులు బైఠాయించి దీక్షలు.
- 22న అద్దె బస్సుల డ్రైవర్లు, యజమానులు, తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లకు (ఇక నుంచి విధులకు హాజరు కావద్దని, తమ పొట్ట కొట్టొద్దని) విన్నపాలు.
- 23న ప్రజాప్రతినిధులు మొద లు ఎంపీల వరకు కలసి ఆర్టీసీ పరిస్థితిపై వివరణ.
- 24న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు సహా అన్ని డిపోల వద్ద ఆర్టీసీ మహిళా ఉద్యోగుల నిరాహార దీక్షలు.
- 25న ప్రజాసంఘాలు, సాధారణ ప్రజలతో కలసి రాస్తారోకోలు.
- 26న ఆర్టీసీ కార్మికుల పిల్లల ఆధ్వర్యంలో నిరాహారదీక్షలు.
- 27న దీపావళి వేడుకలకు దూరం. కొన్ని పార్టీల నేతలు మాత్రం కార్మికుల కుటుంబాలను తమ ఇళ్లకు ఆహ్వానించి వారితో కలిసి దీపావళి జరుపుకోనున్నట్టు ప్రకటించారు.
- 28న (సోమవారం) సమ్మెపై హైకోర్టులో ఒకవైపు వాదనలు కొనసాగిస్తూనే మరోవైపు నిరసన కార్యక్రమాల కొనసాగింపు.
- 30న సకల జనుల సమర భేరి సభ నిర్వహణ.

**అఖిలపక్ష భేటీలో ఎవరేమన్నారంటే...**

కోర్టు తీర్పును కూడా ప్రభుత్వం గౌరవించకపోవడం దారుణం. ముఖ్యమంత్రి నియంతలా వ్యవహరిస్తున్నారు. దానికి మద్దతు ఇస్తున్నట్టుగా పోలీసులు దమనకాండను కొనసాగిస్తున్నారు. ప్రజలు మా ఉద్యమానికి మద్దతుగా నిలిచి ఆర్టీసీని విధ్వంసం చేసే కుట్రను అడ్డుకొని ప్రజారవాణా సంస్థను కాపాడుకునేందుకు సహకరించాలి

*– ఆర్టీసీ జేఏసీ నేతలు అశ్వత్థామరెడ్డి, రాజిరెడ్డి, వీఎస్‌రావు, సుధ*

**కార్మికుల వెంట నడుస్తాం**

ఆర్టీసీ కార్మికులు చేపట్టే అన్ని నిరసన కార్యక్రమాల్లో మా నేతలు పాల్గొంటారు. ప్రజాప్రతినిధుల ములాఖత్‌లో మేమూ పాల్గొంటాం. వారికి మా సంపూర్ణ మద్దతు ఉంటుంది.

*– తమ్మినేని వీరభద్రం (సీపీఎం), చాడ వెంకట్‌రెడ్డి (సీపీఐ), ఎస్.వెంకటేశ్వరరావు (న్యూడెమొక్రసీ)*

**ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి**

ఆర్టీసీ పరిరక్షణకు నడుంబిగించాలని కోర్టు చెప్పినా ప్రభుత్వం వినకపోవడం విడ్డూరం. ఆర్టీసీ ఆస్తులు, అప్పులపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలి. కార్మికుల ఆత్మ హత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి.

*– ఎల్.రమణ, టీడీపీ*

**కోర్టు తీర్పును గౌరవించి చర్చలకు పిలవాలి**

కోర్టు ఆదేశాన్ని గౌరవించి కార్మికులను ప్రభుత్వం చర్చలకు పిలవాలి. ఆర్టీసీ ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ఆర్టీసీ జేఏసీకి మా సంపూర్ణ మద్దతు ఉంటుంది.

*– కోదండరాం, టీజేఎస్*

**వేల పుస్తకాలు చదివి నేర్చుకున్నదిదేనా?**

వేల పుస్తకాలు చదివానని చెప్పుకునే ముఖ్యమంత్రి నేర్చుకున్నది ఇదేనా? ప్రజలు శక్తిమంతులు, వారి ఆగ్రహాన్ని తట్టుకోవడం కష్టమంటూ హైకోర్టు వ్యాఖ్యానించినా కేసీఆర్ పెడచెవిన పెట్టడం వల్ల ఆయనకే నష్టం

*– డాక్టర్ చెరుకు సుధాకర్, ఇంటి పార్టీ*

**న్యాయవ్యవస్థపై కూడా గౌరవం లేకుంటే ఎలా?**

న్యాయవ్యవస్థపైనా ప్రభుత్వానికి గౌరవం లేకుంటే ఎలా? ఆర్టీసీ సమస్యను పరిష్కరించాలని హైకోర్టు ఆదేశించినా చర్చలకు ఎందుకు పిలవట్లేదు. లోటు బడ్జెట్‌తో ఉన్న ఏపీని అక్కడి ముఖ్యమంత్రి అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తుంటే మిగుల బడ్జెట్ రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితి ఎందుకొస్తోంది.

*– మంద కృష్ణమాదిగ*



ఆదివారం మీడియాతో మాట్లాడుతున్న ఆర్టీసీ జేఏసీ నేత అశ్వత్థామరెడ్డి, రాజిరెడ్డి తదితరులు

# చేతికొచ్చే వేళ.. చితక్కొడుతున్న వానలు

▶ మొదటి పేజీ తరువాయి

గత రెండు రోజులుగా తడిసిన పచ్చి సోయాబీన్‌నే తీసుకువస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు వెల్లడించారు. తడిచిన సోయాకు క్వింటాకు రూ. 2 వేల నుంచి రూ.2,500 వరకే వ్యాపారులు చెల్లిస్తున్నారు. అదే సమయంలో పత్తి పంటకు కూడా ఈ వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు. పలు జిల్లాల్లో పత్తి మొదటి తీత కొనసాగుతోంది.వరుస వర్షాలతో వచ్చిన మొక్కమీదే పత్తి తడవడంతో పాటు, కాయలు కూడా నల్లబారిపోయి బూజు పడుతున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.కొన్నిచోట్ల రంగుమారుతోందని అంటున్నారు.

**ముందస్తు చర్యలేవి?**

రాష్ట్రవ్యాప్తంగా ఈ ఖరీఫ్‌లో 1.10 కోట్ల ఎకరాలలో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో వరి 33.68 లక్షల ఎకరాల్లో సాగైంది. మొక్కజొన్న 10 లక్షల ఎకరాల్లో, పెసర 1.78 లక్షల ఎకరాలు, సోయాబీన్ 4.16 లక్షల ఎకరాలు, పత్తి 49.15 లక్షల ఎకరాలు, కందులు 7.06 లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. అర్థ గణాంక శాఖ అంచనాల ప్రకారం వరి ఉత్పత్తి 66.62 లక్షల మెట్రిక్ టన్నులు, మొక్కజొన్న 13.79 లక్షల మెట్రిక్ టన్నులు, కందులు 1.94 లక్షల మెట్రిక్ టన్నులు, పెసర 45 వేల మెట్రిక్ టన్నులు, వేరుశనగ 30 వేల మెట్రిక్ టన్నులు, సోయాబీన్ 2.82 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి వస్తుందని అంచనా వేశారు. మార్క్‌ఫెడ్ ద్వారా సోయాబీన్, పెసర ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే సోయాబీన్ 113 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. పెసర 4769 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి.



మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలం తిమ్మాపూర్‌లో నేల వాలిన వరి పంట

**మద్దతు ధరకూ ఇక్కట్లే...**

ఇప్పుడు వర్షాలు కురిస్తే ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు రైతుకు మద్దతు ధర కూడా లభించదు. మార్కెట్ యార్డులకు తీసుకువచ్చిన మొక్కజొన్న, సోయాబీన్, ధాన్యం వంటి ఉత్పత్తులు ఆరుబయటే ఎటువంటి రక్షణ లేకుండా ఉంటాయి. వర్షాలు పడితే అవి తడిసిపోయే ప్రమాదం ఉంది.కనుక మార్కెట్ యార్డులలో తూనిక కోసం ఎదురుచూస్తున్న పంట ఉత్పత్తులను తక్షణమే సురక్షితమైన ప్రాంతాలకు తరలించడం లేదా వర్షానికి తడవకుండా వాటిపై ప్లాస్టిక్ టార్పాలిన్లు కప్పి ఉంచడం మంచిదని అధికారులు సూచిస్తున్నారు.రాష్ట్రంలో పత్తి లక్ష ఎకరాల్లో తడిసినట్లు భావిస్తున్నారు.ఇప్పటివరకు వ్యవసాయశాఖ ఎక్కడెక్కడ ఎంత నష్టం జరిగిందన్న దానిపై ఇంకా అంచనాకు రాలేదు. పంట రక్షణ కోసం ఉపయోగపడే టార్పాలిన్లను రైతులకు సరఫరా చేయడంలో వ్యవసాయశాఖ విఫలమైందని రైతులు విమర్శిస్తున్నారు.

**తడిసిపోయిన 700 క్వింటాళ్ల మొక్కజొన్న**

మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌కు సుమారు 400 క్వింటాళ్ల మొక్కజొన్న విక్రయానికి రాగా ఇటీవలి బంద్ కారణంగా శనివారం, వారాంతపు సెలవు కారణంగా ఆదివారం టెండర్లు జరగలేదు. ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి ఆ కుప్పలు తడిసి ముద్దయ్యాయి.నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లోని మార్కెట్ యార్డుకు సుమారు 300 క్వింటాళ్లను రైతులు తీసుకురాగా అవి తడిసిపోయాయి.

**ఏడువేల ఎకరాల్లో నీటమునిగిన పత్తి, వరి**

మంచిర్యాల జిల్లాలో భారీ వర్షం దెబ్బకు 7 వేల ఎకరాల్లో పంట నీటిమునిగింది. మూడు వేల ఎకరాల్లో వరి, 4 వేల ఎకరాల్లో పత్తి పంట దెబ్బతింది. నెన్నెల, బెల్లంపల్లి, భీమారం, తాండూర్, కాసిపేట, మండలాల్లో అధికంగా పంటలు దెబ్బతిన్నాయి.

**పత్తి తడిసి..వరి దెబ్బతిని...**

కరీంనగర్ జిల్లాలోని పలు మండలాల్లో పంటలు నీటమునిగాయి.ఇల్లందకుంట మండలంలోని శ్రీరాములపల్లిఓ ఓ ఇంటిలో నిల్వ చేసిన పత్తి పూర్తిగా తడిసి పోయింది.మానకొండూర్ గంగిపల్లి, కొండపల్కల, ఊటూరు, పచ్చునూర్, లక్ష్మీపూర్, దేవంపల్లి కెల్లెడ, ఈదులగట్టెపల్లి, చెంజర్ల, గట్టుదుద్దెనపల్లి, వన్నారం, లింగాపూర్, వెల్ది గ్రామాల్లో వరిపంట బాగా దెబ్బతింది. శంకరపట్నం, ఇల్లందకుంట, వీణవంక మండలాల్లో ఎక్కువగా నష్టం వాటిల్లింది.

## నాలుగు రోజులు భారీ వర్షాలు

**తెలంగాణపై ఉపరితల ద్రోణి ప్రభావం**



సాక్షి, హైదరాబాద్: తూర్పు మధ్య అరేబియా సముద్రంలో అల్పపీడనం, దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. అలాగే తూర్పు మధ్య అరేబియా సముద్రం నుంచి విదర్భ వరకు ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక, తెలంగాణ మీదుగా ఉపరితల ద్రోణి ఏర్పడింది. మరోవైపు కోమోరిన్ ప్రాంతం నుంచి ఉత్తర కోస్తాంధ్ర వరకు అల్పపీడన ద్రోణి ఏర్పడింది. ఈ ప్రభావంతో వచ్చే 4 రోజులు తెలంగాణలో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే చాలా చోట్ల ఉరుములు, మెరుపులతోపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఇదిలావుండగా ఆదివారం వరంగల్ అర్బన్ జిల్లా ఎలకతుర్దిలో 6.4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. గోవిందరావుపేటలో 5.5, మంకాల్‌లో 5.2, కోహెడలో 4.4, బండ్లగూడలో 4.2, కమలాపూర్‌లో 4.1 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

# చరిత్రలో లేనంతగా ఖరీఫ్ దిగుబడులు

**ఈ ఏడాది 80 లక్షల టన్నుల ధాన్యం**

- దిగుబడులకు పరోక్ష కారణం ప్రభుత్వ పథకాలే
- ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు


అక్కెనపల్లి వాగు వద్ద పూజలు చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

**సిద్దిపేట జోన్:** చరిత్రలో ఇప్పటి వరకు చూడనంత వరి పంట ఈ ఏడాది ఖరీఫ్‌లో రానుందని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. 80 లక్షల టన్నుల వరి ధాన్యం రాష్ట్రంలో పండబోతుందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వచ్చిన పంట దిగుబడులు ఇప్పుడు కేవలం ఒక్క తెలంగాణలోనే పండుతోందన్నారు. ఆదివారం సిద్దిపేట నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో రూ.6.5 కోట్లతో నెక్లెస్ రోడ్డు తుది దశ పనులకు శంకుస్థాపన చేశారు. అక్కెనపల్లి వాగు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు మందపల్లి, మిట్టపల్లి మార్గంలో రూ.17.5 కోట్లతో ఇండస్ట్రియల్ పార్క్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో 2017–18 రబీ సీజన్ మార్కెటింగ్ కమీషన్ రూ.1.85 కోట్లను మహిళా సంఘాలకు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గతంలో ఎప్పుడూ పండనంత పంట ఈ ఏడాది పండుతోందని, దీనంతటికీ ప్రాజెక్టుల నిర్మాణం, చెరువుల పునరుద్ధరణ, రైతు బంధు పథకం, 24 గంటల విద్యుత్ సరఫరా లాంటి ప్రభుత్వ కార్యక్రమాలు వ్యవసాయానికి భరోసాగా నిలిచాయన్నారు. రైతుకు గిట్టుబాటు ధర కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిందని తెలిపారు. ఐకేపీ కేంద్రాలకు, లారీలు, హామాలీల సమస్య ఉత్పన్నం కాకుండా ఈసారి క్షేత్రస్థాయిలోనే భవిష్యత్తు ప్రణాళికలను రూపొందించినట్లు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు జరిగిన 48 గంటల్లోగా రైతులకు చెల్లింపులు జరిగేలా ఆదేశాలిచ్చామన్నారు. మహిళా సమాఖ్య సంఘాలకు కమీషన్ విడుదల్లో జాప్యాన్ని నివారించేందుకు సంబంధిత శాఖ మంత్రి గంగుల కమలాకర్ పౌర సరఫరాల శాఖ కమిషనర్‌తో మాట్లాడారని, త్వరలో కమీషన్ డబ్బులు రానున్నాయని తెలిపారు.

**60 ఏళ్ల దరిద్రం పోయింది..**

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన 30 రోజుల గ్రామ ప్రణాళికతో గ్రామాల్లో 60 ఏళ్ల దరిద్రం పోయిందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. త్వరలో పారిశుధ్య చర్యలు మరింత మెరుగుపర్చడం కోసం ప్రతి ఊరికి ఒక ట్రాక్టర్ సమకూర్చడంతోపాటు, ఒక డంప్ యార్డును నిర్మించనున్నట్లు తెలిపారు. సిద్దిపేట ప్రాంతంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. పార్కు నిర్మాణం కోసం మంత్రి కేటీఆర్, పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ బాలమల్లు, అధికారుల సహకారంతో ముందుకు సాగుతున్నామన్నారు. రెండేళ్ల తర్వాత అక్కెనపల్లి వాగు పొంగిపొర్లడం సంతోషాన్ని కలిగించిందన్నారు. ఆయన వెంట జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, సంబంధిత అధికారులు ఉన్నారు.

# వివాహిత ఆత్మహత్య


**భర్త ఇంటికి నిప్పు పెట్టిన బంధువులు**



**సిరికొండ:** ఓ వివాహిత ఆత్మహత్య చేసుకోగా, కోపోద్రిక్తులైన ఆమె పుట్టింటి వారు భర్త ఇంటిపై దాడికి దిగి, ఇంటిని తగులబెట్టారు. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని చీన్యానాయక్ తండాలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చీమన్‌పల్లి జీపీ పరిధిలోని చోక్లానాయక్ తండాకు చెందిన సరిత (22)కు చీన్యానాయక్ తండాకు చెందిన తిరుపతితో 5 నెలల క్రితం వివాహం జరిగింది. పెళ్లయిన నాటి నుంచి అదనపు కట్నం కోసం భర్త, అత్తామామలు వేధిస్తున్నారు. ఆదివారం సరిత ఇంట్లో ఉరేసుకుంది. ఇది గమనించిన భర్త స్థానికుల సాయంతో ఆమెను దింపి కామారెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్లాడు. కానీ మార్గమధ్యలోనే మృతి చెందిందని తిరిగి తీసుకొచ్చాడు. ఈ విషయం తెలిసి మృతురాలి బంధువులు పెద్ద సంఖ్యలో చీన్యానాయక్ తండాకు వచ్చారు. కోపంతో తిరుపతి ఇంటికి నిప్పు పెట్టడంతో ఇల్లు కాలిబూడిదైంది. ఈ నేపథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# తల్లీ కూతుళ్ల ఆత్మహత్య

- కూతురి మరణం తట్టుకోలేక తల్లి కూడా..
- వీరి అంత్యక్రియలకు వస్తుండగా ఆటో ప్రమాదంలో చిన్నారి మృతి


గంగమ్మ (ఫైల్)


నాగమ్మ (ఫైల్)

**సంగారెడ్డి రూరల్:** ఆర్థిక సమస్యలతో తల్లీ కూతుళ్లు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లా కంది మండలం చెర్లగూడెంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చెర్లగూడెంలో నివాసం ఉంటున్న అలకుంట గంగమ్మ (70), మాశెట్టి నాగమ్మ (40) తల్లీ కూతుళ్లు. గంగమ్మ, నాగమ్మ భర్తలు గతంలోనే మృతి చెందారు. గంగమ్మకు ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉండగా.. నాగమ్మకు ఓ కుమార్తె ఉంది. నాగమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్సకు సరిపడా డబ్బులు లేకపోవడంతో మనస్తాపం చెంది చనిపోతానని తరచూ చెబుతుండేది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన నాగమ్మ శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కూతురి మరణాన్ని తట్టుకోలేక తల్లి గంగమ్మ కూడా అదేరోజు అర్ధరాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు నాగమ్మ కూమార్తె శివలీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**అంత్యక్రియలకు వస్తుండగా ఆటో బోల్తా..**

శనివారం ఆత్మహత్య చేసుకున్న తల్లీకూతుళ్లు గంగమ్మ, నాగమ్మల అంత్యక్రియలకు హాజరయ్యేందుకు నర్సాపూర్ నుంచి వస్తున్న బంధువుల ఆటో బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న ఓ చిన్నారి మృతిచెందగా.. మరో 11 మంది గాయపడ్డారు. ఈ ఘటన సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో చోటుచేసుకుంది. అంత్యక్రియలకు హాజరయ్యేందుకు నర్సాపూర్ నుంచి మహేశ్ తన కుటుంబ సభ్యులతో ఆటోలో బయలుదేరారు. ఆటో ఇస్మాయిల్‌ఖాన్‌పేటకు రాగానే అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న చిన్నారి దుర్గ (8) అక్కడికక్కడే మృతి చెందింది. పాప తల్లి కనకమ్మ, మాశెట్టి రాధమ్మలకు తీవ్ర గాయాలవడంతో వారిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

# మావోయిస్టు కొరియర్ అరెస్టు

**కొత్తగూడెం అర్బన్:** మావోయిస్టు పార్టీ అగ్రనేతలకు కొరియర్‌గా వ్యవహరిస్తున్న వ్యక్తితోపాటు నూతనంగా దళంలో చేరేందుకు వెళ్లిన మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ సునీల్‌దత్ చెప్పారు. ఆదివారం ఆయన కొత్తగూడెంలోని ఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ వివరాలు వెల్లడించారు. చర్ల మండలంలో శనివారం సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా, పోలీసులకు ఇద్దరు అనుమానాస్పద వ్యక్తులు కనిపించారని, పోలీసులను చూసి పారిపోతుండగా సిబ్బంది వారిని వెంబడించి పట్టుకున్నారని చెప్పారు. వీరిని హన్మకొండలోని రెడ్డికాలనీకి చెందిన జూనియర్ అడ్వొకేట్ ఐత అనిల్‌కుమార్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం తిరుమలాపూర్ గ్రామానికి చెందిన దాసరపు సురేశ్‌గా గుర్తించామన్నారు. వీరిలో అనిల్‌కుమార్ మావోయిస్టు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్‌కు కొరియర్‌గా వ్యవహరిస్తున్నాడని తెలిపారు. 2011 నుంచి మావోయిస్టు అనుబంధ సంస్థ అయిన తెలంగాణ విద్యార్థి వేదిక (టీవీవీ) వరంగల్ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తూనే కాకతీయ యునివర్సిటీలో ‘లా’చదివాడని, జగన్‌తోపాటు తెలంగాణ మావోయిస్టు నాయకులు హరిభూషణ్, దామోదర్‌లకు కొరియర్‌గా పనిచేస్తున్నాడని చెప్పారు. ఈనెల 5న అనిల్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా రాంపూర్ గ్రామం వెళ్లి దామోదర్‌ను కలిశాడని, ఆయన ఆదేశాల మేరకు నూతనంగా దళంలో రిక్రూట్ చేసేందుకు ఈనెల 18న దాసరపు సురేశ్‌ను తీసుకొని బీజాపూర్ జిల్లా బట్టిగూడెం గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్లాడని వివరించారు. అక్కడ వారు అందించిన లేఖలను పలువురు వ్యాపారవేత్తలకు ఇచ్చి వారి నుంచి డబ్బులు వసూలు చేయాలని ఆదేశించడంతో ఆ లేఖలతో ఇద్దరూ ద్విచక్రవాహనంపై వస్తుండగా పట్టుబడ్డారని తెలిపారు. వీరి నుంచి నాలుగు లెటర్లు, మూడు మెమొరీ కార్డులు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు. ఎస్పీ వెంట ఓఎస్‌డీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఏఎస్పీ రాజేశ్‌చంద్ర, భద్రాచలం సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ ప్రమోద్‌కుమార్, సీఐ సత్యనారాయణ, ఎస్సై వెంకటప్పయ్య ఉన్నారు.




## ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

**మాక్లూర్:** నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలోని మానిక్‌బండార్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మరణించాడు. ఎస్సై సాయినాథ్ కథనం ప్రకారం. కర్ణాటకకు చెందిన ధన్‌రాజ్ (34) కుటుంబం బతుకుదెరువు కోసం ఐదేళ్ల క్రితం నిజామాబాద్‌కు వలస వచ్చింది. ఉదయం కూలి పని కోసం ధన్‌రాజ్ మానిక్‌బండార్ గ్రామానికి వచ్చాడు. అక్కడ రోడ్డు దాటుతుండగా కోరుట్లనుంచి నిజామాబాద్ వైపు వస్తున్న కోరుట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మరణించాడు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

## గుండెపోటుతో ఇద్దరు ఆర్టీసీ ఉద్యోగుల మృతి

**సత్తుపల్లిటౌన్/చిట్యాల :** ఖమ్మం జిల్లా సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్న ఎస్.కె.ఖాజామియా(55) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వగ్రామం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణాజిల్లా జగ్గయ్యపేటలోని డ్యాంగీనగర్. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మరో సంఘటనలో నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీలోని ఇందిరానగర్‌కు చెందిన ఆర్టీసీ ఉద్యోగి గోసుకొండ మల్లయ్య (54) సమ్మె నేపథ్యంలో ఆందోళనకు గురై ఈ నెల 17న గుండెపోటుకు గురయ్యాడు. దీంతో కుటుంబసభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మల్లయ్య చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మల్లయ్య నల్లగొండ ఆర్టీసీ డిపోలో ఏడీఈగా విధులు నిర్వహిస్తున్నాడు.

## కత్తిపోట్లతో ఆర్మీ జవాన్ మృతి



**నర్సంపేటరూరల్ :** పుట్టిన రోజు వేడుకల్లో స్నేహితుల మధ్య జరిగిన గొడవ ఓ ఆర్మీ జవాన్‌ను బలితీసుకున్న సంఘటన వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట పట్టణంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. నర్సంపేట పట్టణానికి చెందిన హన్మకొండ ప్రేమ్‌కుమార్ జమ్ముకశ్మీర్‌లో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల అతను సెలవుపై ఇక్కడికి వచ్చాడు. శనివారం రాత్రి స్నేహితులతో సినిమా చూసేందుకు వెళ్లిన అతను అందులో ఒకరి స్నేహితుడి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు పట్టణంలోని వల్లబ్‌నగర్ ప్రాంతానికి చేరుకున్నాడు. అప్పటికే బర్త్‌డే చేసుకుంటున్న వ్యక్తి, అతడి స్నేహితులు గొడవపడుతుండగా వారికి సర్దిచెప్పేక్రమంలో ప్రేమ్‌సాగర్ కత్తిపోట్లకు గురయ్యాడు. వెంటనే అతడిని నర్సంపేటకు తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

## కాటు వేసిన కరెంటు తీగ

**సంగారెడ్డి రూరల్:** అడవి పందుల నుంచి పంటను రక్షించుకునేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగె యువరైతు ప్రాణాలను బలి తీసుకుంది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలోని చింతలపల్లిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ కథనం ప్రకారం.. చింతలపల్లికి చెందిన రైతు గుండు మహేశ్(38) తన పొలంలో వేసిన చెరుకు పంటను అడవి పందుల నుంచి కాపాడుకునేందుకు పొలం చుట్టూ కరెంట్ తీగలు ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి పొలం వద్దకు వెళ్లిన మహేశ్ ప్రమాదవశాత్తు తీగలకు తగిలి విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు.



L&K | SAATCHI & SAATCHI




భారత బలగాలు భారీగా కాల్పులతో విరుచుకుపడటంతో ధ్వంసమైన పాక్ ఆర్మీ పోస్టులు, ఉగ్ర శిబిరాల నుంచి వెలువడుతున్న పొగ

# పాకిస్తాన్‌కు మరో చావుదెబ్బ



**పీఓకేలోని ఉగ్రస్థావరాలపై భారత్ ప్రతీకార కాల్పులు**

**3 ఉగ్ర స్థావరాలు ధ్వంసం** — పలు పాక్ ఆర్మీ పోస్టులు కూడా..

**35 మంది ఉగ్రవాదులు హతం!**

**6-10 మంది పాక్ జవాన్లు చనిపోయారన్న ఆర్మీ చీఫ్**

న్యూఢిల్లీ/ఇస్లామాబాద్

పాకిస్తాన్‌ను మరోసారి భారత్ చావుదెబ్బ తీసింది. బాలాకోట్ ఉగ్రస్థావరాలపై వైమానిక దాడుల అనంతరం.. ఆ స్థాయిలో ఆదివారం పాక్ ఆక్రమిత కశ్మీర్లోని ఉగ్ర స్థావరాలపై విరుచుకుపడింది. భారత్‌లోకి చొరబడి విధ్వంసం సృష్టించేందుకు పీఓకేలోని నీలం లోయలో ఉన్న నాలుగు ఉగ్ర స్థావరాల్లో సిద్ధంగా ఉన్న ఉగ్రవాదులపై బుల్లెట్ల వర్షం కురిపించింది. పక్కా ప్రణాళికతో, స్పష్టమైన లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని భారత జవాన్లు కాల్పులు జరిపారు. మూడు స్థావరాలను పూర్తిగా నేలమట్టం చేసి, మరో స్థావరాన్ని భారీగా నష్టపరిచిన భారత జవాన్లు.. ఆ స్థావరాల్లో భారీ సంఖ్యలో ఉన్న ఉగ్రవాదులను మట్టుపెట్టారు. ఆ ఉగ్రవాదులు భారత్‌లోకి చొరబడేందుకు వీలుగా భారత పోస్ట్‌లపై కాల్పులు జరపడం కోసం అదే ప్రాంతంలో ఉన్న పాక్ జవాన్ల స్థావరాలను సైతం నేలకూల్చారు. ఉగ్రవాదులు భారత్‌లోకి చొరబడేందుకు వీలుగా శనివారం తంగధర్ సెక్టార్లో నియంత్రణ రేఖ వెంబడి ఉన్న భారత ఆర్మీ పోస్టులపై పాక్ కాల్పులకు తెగబడింది. ఆ కాల్పుల్లో ఇద్దరు భారత జవాన్లు పదమ్ బహదూర్ శ్రేష్ఠ, గమిల్ కుమార్ శ్రేష్ఠ, ఒక పౌరుడు మృతి చెందారు. ప్రతిగా ఆదివారం పీఓకే లోని ఉగ్రస్థావరాలు లక్ష్యంగా భారత్ తీవ్ర స్థాయిలో దాడులు ప్రారంభించింది. భారత్ కాల్పుల్లో హతమైన ఉగ్రవాదుల సంఖ్య 35 వరకు ఉండొచ్చని, వారు జైషే మొహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రసంస్థలకు చెందినవారని ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. పాక్ జవాన్లు కూడా భారీగానే హతమయ్యారని పేర్కొన్నాయి.

ఆదివారం సాయంత్రం ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ మాట్లాడుతూ.. ‘ ఇప్పటివరకు అందిన సమాచారం మేరకు భారత్ కాల్పుల్లో 6 నుంచి 10 మంది పాక్ జవాన్లు, అంతే సంఖ్యలో ఉగ్రవాదులు చనిపోయారు’ అని అన్నారు. పీఓకేలోని ఉగ్రస్థావరాల నెట్‌వర్క్ చాలా వరకు ధ్వంసమైందన్నారు.




వీరమరణం పొందిన భారత జవాన్లు పదమ్ బహదూర్, గమిల్ కుమార్

‘మూడు ఉగ్రవాద స్థావరాలు పూర్తిగా నాశనమయ్యాయి. నాలుగోది దాదాపు ధ్వంసమైంది. పక్కా సమాచారంతోనే దాడులు చేశాం’ అన్నారు. ‘దీపావళి పండుగ సమీపిస్తోంది. భారత్‌లో దాడులు చేసేందుకు కొందరు ఉగ్రవాదులు పీఓకేలోని నీలం లోయలో ఉన్న కొన్ని ఉగ్రస్థావరాల్లో సిద్ధంగా ఉన్నట్లు మాకు సమాచారమందింది. వారు చొరబాటుకు ప్రయత్నించే వరకు ఎదురుచూడకుండా.. ముందే పక్కా ప్రణాళికతో దాడులు చేశాం’ అని వివరించారు. జమ్మూకశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని భారత ప్రభుత్వం రద్దు చేసిన ఆగస్ట్ 5వ తేదీ నుంచి పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నిస్తున్నారన్న సమాచారం మాకు వస్తూనే ఉందని ఆర్మీ చీఫ్ రావత్ వ్యాఖ్యానించారు. నెల రోజులుగా గురెజ్, మచిల్, కేరన్ సెక్టార్ల ద్వారా పలు చొరబాటు ప్రయత్నాలు జరిగాయన్నారు. ‘భారత్‌లోకి ఉగ్రవాదులను పంపించే ప్రయత్నాలను పాక్ నిలిపేయకపోతే.. మా స్పందన మరింత తీవ్రంగా ఉంటుంది’ అని రావత్ స్పష్టం చేశారు. ‘కశ్మీర్లో సాధారణ స్థితి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాం’ అన్నారు.

**ఒక్కో స్థావరంలో 10 నుంచి 15 మంది**

జమ్మూకశ్మీర్లోని తంగధర్ సెక్టార్‌కు ఆవలివైపు పీఓకేలో ఉన్న నీలం లోయలోని ఒక్కో ఉగ్రస్థావరంలో భారత్ దాడులు చేసిన సమయంలో 10 నుంచి 15 మంది ఉగ్రవాదులు భారత్‌లోని కశ్మీర్లోకి చొరబడేందుకు సిద్ధంగా ఉన్నారని ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ పీఓకేలోని ఉగ్రస్థావరాలపై భారత్ దాడులు, తదనంతర పరిస్థితులను వివరించారు. మరోవైపు, దాడుల్లో ఉగ్రవాదులు, పాక్ జవాన్లు చనిపోయారన్న భారత్ వాదనను పాకిస్తాన్ తోసిపుచ్చింది. భారత్ అబద్ధాలను ప్రచారం చేస్తోందని పేర్కొంది. ఐక్యరాజ్య సమితి భద్రతామండలిలోని 5 శాశ్వత సభ్య దేశాల ప్రతినిధులను ఉగ్రస్థావరాలున్నాయని భారత్ చెబుతున్న నీలం లోయ ప్రాంతానికి తీసుకువెళ్లేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, వారే నిజానిజాలను నిర్ధారిస్తారని పాక్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మొహమ్మద్ ఫైజల్ సవాలు చేశారు. పాకిస్తాన్‌లో భారత రాయబారి గౌరవ్ అహ్లూవాలియాను పాక్ ప్రభుత్వం పిలిపించి భారత్ కాల్పులకు నిరసన తెలిపింది. భారత్ కాల్పుల్లో ఐదుగురు పౌరులు చనిపోయారని పాక్ మిలటరీ అధికార ప్రతినిధి మేజర్ జనరల్ ఆసిఫ్ గఫూర్ ఆదివారం సాయంత్రం ట్వీట్ చేశారు. పాక్ ఆర్మీ కాల్పుల్లో 9 మంది భారత జవాన్లు చనిపోగా, రెండు భారత బంకర్లు ధ్వంసమయ్యాయన్నారు. పాక్ వాదనను భారత ఆర్మీ తోసిపుచ్చింది. ‘ఉగ్రవాదులను భారత్‌లోకి పంపేందుకు వీలుగా శనివారం సాయంత్రం కాల్పుల విరమణ ఒప్పందాన్ని పాక్ ఉల్లంఘించింది. అందుకు ప్రతిగా భారత్ జరిపిన కాల్పుల్లో పీఓకేలోని పలు ఉగ్రస్థావరాలు, ఆ స్థావరాలకు రక్షణ కల్పిస్తున్న పాక్ ఆర్మీ పోస్ట్‌లు ధ్వంసమయ్యాయి’ అని ఒక ప్రకటన విడుదల చేసింది. కాగా, రాజకీయ ప్రయోజనాల కోసం పాకిస్తాన్ పేరును వాడుకోవడం బీజేపీ నేతలు ఇకనైనా ఆపేయాలి’ అని పాకిస్తాన్ విదేశాంగ శాఖ కోరింది.

## పఠాన్‌కోట్.. ఉడి. పుల్వామా!

**2016 జనవరి 2:**



పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌లో ఉన్న వైమానిక స్థావరంపై 2016 జనవరి 2వ తేదీ వేకువజామున ఉగ్రవాదులు జరిపిన దాడిలో ఏడుగురు భద్రతా సిబ్బంది నేలకొరగగా నలుగురు ఉగ్రవాదులు మృతి చెందారు. రాత్రి సమయంలో వైమానిక స్థావరంలోకి భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రితో ప్రవేశించిన ఉగ్రవాదులు పేలుళ్లు, కాల్పులతో విధ్వంసం సృష్టించారు. ఉగ్ర మూకలను ఏరిపారేసేందుకు సైన్యానికి 17 గంటలకుపైగా సమయం పట్టింది.

**2016 సెప్టెంబర్ 28**

ఉడి సైనిక స్థావరంపై దాడికి తెగబడిన ఉగ్రవాదులు 18 మంది భారత జవాన్లను పొట్టనబెట్టుకున్నారు. ఈ ఘటనతో రగిలిపోయిన భారత్.. సరిగ్గా పది రోజుల తర్వాత పగ తీర్చుకుంది. 2016 సెప్టెంబర్ 28వ తేదీన అర్ధరాత్రి 12 గంటలకు కమాండోలతో కూడిన వైమానిక దళం విమానాలు ఎల్‌వోసీలోకి ప్రవేశించాయి. దాదాపు మూడు కిలోమీటర్ల దూరం లోపలికి చొచ్చుకుని వెళ్లి భింబేర్, కేల్, హాట్ స్ప్రింగ్, లిపా సెక్టార్లలోని 7 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేశాయి. ఈ సందర్భంగా 38 మంది ఉగ్రవాదులతోపాటు ఇద్దరు పాక్ సైనికులను హతం చేశాయి. నాలుగు గంటలపాటు జరిగిన ఈ ఆపరేషన్ లక్ష్యాలను సాధించి, పూర్తిగా విజయవంతమైందని సైన్యం ప్రకటించింది.

**2019 ఫిబ్రవరి 14**

2019 ఫిబ్రవరి 14వ తేదీన పుల్వామాలో జరిగిన ఆత్మాహుతి దాడిలో 40 మంది భద్రతా సిబ్బంది వీరమరణం పొందారు. జమ్మూ శ్రీనగర్ జాతీయ రహదారిపై వస్తున్న భద్రతా బలగాల కాన్వాయ్‌ని ఆత్మాహుతి దళ సభ్యుడు వాహనంతో ఢీకొట్టాడు. భారీ విస్ఫోటం సంభవించి 40 మంది భద్రతా సిబ్బంది చనిపోయారు. ఈ ఘటన అనంతరం భారత్ మరోసారి ఎల్‌వోసీలోకి వైమానికదళాన్ని పంపింది. బాలాకోట్‌లో నడుస్తున్న ఉగ్ర శిక్షణ శిబిరంపై భీకర దాడులు జరిపి, తీవ్ర నష్టం కలిగించింది. అనంతరం సరిహద్దుల్లో పాక్ ఎఫ్–16 కూల్చివేత, తదనంతర పరిణామాల్లో ఐఏఎఫ్ వింగ్ కమాండర్ అభినందన్ పట్టుబడటం, పాక్ అతడిని సురక్షితంగా విడిచి పెట్టడం తెలిసిందే.


## మోదీ టర్కీ పర్యటన రద్దు

**టర్కీ అధ్యక్షుడి పాక్ అనుకూల వ్యాఖ్యలే కారణం**



**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల అధికారిక టర్కీ పర్యటన రద్దయ్యింది. గత నెలలో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ వేదికగా జమ్మూ కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దుపై టర్కీ అధ్యక్షుడు తుయ్యిప్ ఎర్డోగన్ విమర్శలు చేసిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మరోవైపు పారిస్‌లోని ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ సమావేశంలోనూ పాక్‌కు మద్దతుగా ఎర్డోగన్ చేసిన వ్యాఖ్యలు కూడా పర్యటనకు రద్దుకు కారణాలుగా తెలుస్తోంది. ఈ నెల్లో జరగనున్న పెట్టుబడుల సదస్సులో పాల్గొనేందుకు సౌదీ అరేబియాకు వెళ్లనున్న మోదీ.. అక్కడి నుంచి టర్కీ రాజధాని అంకారా వెళ్లాల్సి ఉంది. అయితే తాజా నిర్ణయంతో మోదీ కేవలం సౌదీలో మాత్రమే పర్యటించనున్నారు. ఈ వార్తలపై విదేశాంగ శాఖ స్పందిస్తూ అసలు మోదీ టర్కీ పర్యటన ఖరారే కాలేదని, అలాంటప్పుడు రద్దయ్యే అవకాశమే లేదని పేర్కొంది.

**తమిళంలో మోదీ కవిత:** ఇటీవల మామల్లపురంలో తాను సముద్రంతో సంభాషణ అంటూ రాసిన కవిత తమిళ అనువాదాన్ని తాజాగా ఆదివారం ప్రధాన మంత్రి మోదీ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో అనధికార భేటీ సందర్భంగా మహాబలిపురంలో మోదీ ఒక రోజు గడిపిన విషయం తెలిసిందే. భేటీ రోజు ఉదయం బీచ్‌లో ప్లాగింగ్ చేసిన మోదీ.. అక్కడే కాసేపు కూర్చున్నారు. ఆ సందర్భంగా సముద్రంతో మమేకమయ్యానంటూ తన భావావేశాన్ని కవితగా మలిచానని తరువాత చెప్పారు. ఆ కవితనే తమిళంలో ఆదివారం ట్వీట్ చేశారు. ఇటీవలి కాలంలో తమిళంపై ప్రధాని ప్రత్యేక ప్రేమ చూపుతున్న విషయం తెలిసిందే. ఐరాస వేదికపైనా తమిళం అత్యంత ప్రాచీన భాష అని గుర్తు చేశారు. జిన్‌పింగ్ పర్యటన సందర్భంగా మామల్లపురంలో తమిళ సంప్రదాయ వస్త్రధారణలో కనిపించారు.



## 8 వేల ఏళ్ల నాటి ముత్యం

**అబుధాబి:** యూఏఈలోని మరవాహ్ ద్వీపంలో జరిపిన తవ్వకాల్లో అత్యంత ప్రాచీన ముత్యం బయల్పడింది. ఇది 8 వేల ఏళ్ల నాటి నియోలిథిక్ కాలానికి చెందిందని పురాతత్వ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అక్టోబర్ 30 నుంచి ప్రారంభం కానున్న లౌవ్రె అబుధాబి ఎగ్జిబిషన్‌లో ఈ ముత్యాన్ని ప్రదర్శించనున్నారు. ముత్యపు పొరలపై జరిపిన కార్బన్ డేటింగ్‌లో ఇది క్రీ.పూ 5800–5600 కాలానికి సంబంధించిందిగా తేలినట్లు అధికారులు వెల్లడించారు. యూఏఈలో దొరికిన అత్యంత ప్రాచీన వస్తువు కూడా ఇదే కావడం గమనార్హం.

## ‘ఎన్నికలొస్తే సర్జికల్ స్ట్రైకులొస్తాయ్’

**న్యూఢిల్లీ:** దేశంలో ఎన్నికలొచ్చినప్పుడే.. సరిహద్దుల్లో సర్జికల్ స్ట్రైకులొస్తున్నాయని.. వాస్తవ సమస్యలను మరుగుపరిచేందుకే బీజేపీ సైనికులను అడ్డుపెట్టుకుని ఆటలాడుతోందని కాంగ్రెస్ నేత అఖిలేశ్ ప్రసాద్ సింగ్ వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్, హరియాణా ఎన్నికలకు ఒక్కరోజు ముందే ఈ దాడులు బయటకు రావడం వెనుక మతలబేంటని ఆయన ప్రశ్నించారు. పెద్ద ఎన్నికలు వచ్చినప్పుడల్లా సర్జికల్ స్ట్రైక్స్ కనిపించడం మోదీ ప్రభుత్వంలో సర్వసాధారణమైందని ఎద్దేవా చేశారు. అయితే కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ సింఘ్వి మాత్రం భారత సైనికుల ధైర్యసాహసాలను మెచ్చుకుంటూ ట్వీట్ చేశారు. సైనికుల ధైర్యాన్ని చూసి గర్విస్తున్నామని పేర్కొన్నారు.

## ‘కర్తార్‌పూర్’కు మన్మోహన్ రారు



**న్యూఢిల్లీ/లాహోర్:** కర్తార్‌పూర్ కారిడార్ ప్రారంభోత్సవానికి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హాజరుకారని ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. అయితే సాధారణ యాత్రికుడిలాగా మన్మోహన్ అక్కడికి వెళ్తారని ఆదివారం పేర్కొన్నాయి. కాగా, పాక్ విదేశీ వ్యవహారాల మంత్రి షా మహమూద్ ఖురేషీ కర్తార్‌పూర్ కారిడార్ ప్రారంభోత్సవానికి రావాలని తాము పంపిన ఆహ్వానాన్ని మన్మోహన్ అంగీకరించారని ప్రకటించిన నేపథ్యంలో ఈమేరకు వెల్లడించాయి. ‘నవంబర్ 9న జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి మన్మోహన్ ఒక ప్రత్యేక అతిథిగా కాకుండా, ఒక సాధారణ వ్యక్తిగా హాజరవుతారు’ అని అక్కడి స్థానిక వార్తా పత్రిక డాన్ పేర్కొంది. పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ నేతృత్వంలోని సిక్కు జాతా ప్రతినిధుల బృందంతో పాటు మన్మోహన్ సింగ్ పాల్గొననున్నారు.

## రైల్వే బోర్డులో సంస్కరణలు

**25 శాతం సిబ్బందికి కోత**

**న్యూఢిల్లీ:** రైల్వే బోర్డు త్వరలో పలు సంస్కరణలు చేపట్టనుంది. దీనిలో భాగంగా బోర్డు సభ్యుల సంఖ్యకు కోత విధించనుంది. బోర్డులో డైరెక్టర్, ఆపై స్థాయి అధికారులను వివిధ జోన్లకు బదిలీ చేయాలని భావిస్తోంది. రైల్వేల నిర్వహణ తీరును మెరుగుపరచడం కోసం ఈ కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రైల్వే బోర్డులో 200 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో డైరెక్టర్, ఆపై స్థాయి అధికారులుగా ఉన్న 50 మందిని (25 శాతం) రైల్వే జోన్లకు బదిలీ చేయాలని భావిస్తున్నట్లు ఓ అధికారి ఆదివారం వెల్లడించారు. ప్రస్తుతం బోర్డులో చాలా మంది సభ్యులు ఉన్నారని వీరంతా దాదాపు ఒకేలాంటి పనులు చేస్తున్నారని తెలిపారు. జోన్లలో సీనియర్ ఆఫీసర్ల కొరత కూడా ఉండటంతో వీరిని అక్కడికి బదిలీ చేయాలని భావిస్తున్నామన్నారు. వంద రోజుల ఎజెండాలో భాగంగా ఇటీవల రైల్వే మంత్రి పీయూష్ గోయల్ రైల్వే బోర్డు చైర్మన్‌కు పలు సూచనలు చేసిన విషయం తెలిసిందే.

# నేడే ఎన్నికలు

- మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీలకు పోలింగ్
- 18 రాష్ట్రాల్లోని 51 అసెంబ్లీ సీట్లతో పాటు రెండు ఎంపీ స్థానాలకు ఉప ఎన్నికలు






మహారాష్ట్రలోని సాంగ్లీలో ఎన్నికల సామగ్రితో బురదలోనే నడిచి వెళ్తున్న అధికారులు సిబ్బంది

**ముంబై/చండీగఢ్:** మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీలతోపాటు వివిధ రాష్ట్రాల్లో ఉప ఎన్నికలు నేడు జరగనున్నాయి. మహారాష్ట్రలోని మొత్తం 288 సీట్లు, హరియాణాలోని 90 స్థానాలకు ఎన్నికలు, 18 రాష్ట్రాల్లో 51 అసెంబ్లీ సీట్లకు, రెండు లోక్‌సభ స్థానాల(సతారా, సమస్తిపూర్)కు కూడా ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. ఇందుకోసం యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఎన్నికల బందోబస్తు కోసం మహారాష్ట్రలో 3 లక్షల మందిని, హరియాణాలో 75 వేల మంది పోలీసులను మోహరించారు.

మహారాష్ట్ర, హరియాణా ఎన్నికల ప్రచారంలో బీజేపీ పైచేయి సాధించగా ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌లో నాయకత్వ లోపం స్పష్టంగా కనిపించింది. ఈ రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీ, దాని మిత్రపక్షాలు వరుసగా రెండోసారి కూడా అధికారాన్ని కైవసం చేసుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఇందుకుగాను ఆర్టికల్ 370 రద్దు, జమ్మూకశ్మీర్ అంశాన్ని బీజేపీ ప్రముఖంగా ప్రచారంలో వాడుకుంది. దేశ ఆర్థిక పరిస్థితి, నిరుద్యోగం, నోట్ల రద్దు, జీఎస్టీ వంటి అంశాల్లో ప్రభుత్వ వైఫల్యంపై కాంగ్రెస్ నేతలు ప్రచారం చేశారు.


**ఉప సమరం జరిగే రాష్ట్రాలు..**

యూపీలో 11, గుజరాత్ 6, బిహార్ 5, అస్సాం 4, హిమాచల్ ప్రదేశ్ 2, తమిళనాడు 2, పంజాబ్ 4, కేరళ 5, సిక్కిం 3, రాజస్తాన్ 2, అరుణాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా, చత్తీస్‌గఢ్, పుదుచ్చేరి, మేఘాలయ, తెలంగాణల్లో ఒక్కోటి చొప్పున స్థానాలకు..మహారాష్ట్రలోని సతారా, బిహార్‌లోని సమస్తిపూర్ లోక్‌సభ స్థానాలకు కూడా నేడు పోలింగ్ జరగనుంది.

## బరిలో ప్రముఖులు



**మహారాష్ట్రలో:** బీజేపీకి చెందిన సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ (నాగ్‌పూర్–నైరుతి), కాంగ్రెస్ మాజీ ముఖ్యమంత్రులు అశోక్ చవాన్ (భోకర్), పృథ్వీరాజ్ చవాన్ (కరాడ్) శివసేనకు చెందిన ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు ఆదిత్య ఠాక్రే (వర్లి)



**హరియాణాలో:** సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్ (కర్నాల్), కాంగ్రెస్ మాజీ సీఎం భూపీందర్ సింగ్ హూడా (గర్హి సంప్లా–కిలోయి), రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా (కైతాల్), కుల్దీప్ బిష్ణోయి (ఆదమ్‌పూర్), దుష్యంత్ చౌతాలా (ఉచన్‌కలాన్)

**విపక్షమే లేనప్పుడు అన్ని ర్యాలీలా: సేన**

రాష్ట్రంలో బీజేపీ కూటమికి గట్టి పోటీనిచ్చే ప్రతిపక్షమే లేదంటూనే ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలు పదుల సంఖ్యలో ర్యాలీలు నిర్వహించడం ఎందుకంటూ బీజేపీని మిత్రపక్షమైన శివసేన నిలదీసింది. శివసేన అధికార పత్రిక సామ్నాలో ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్ రాసిన వ్యాసంలో.. ‘ఎన్నికల ప్రచార పర్వంలో తమకు పోటీ ఇచ్చే ప్రతిపక్షమే లేదని సీఎం అంటున్నారు. అలాంటప్పుడు ప్రధాని 10, హోం మంత్రి 30, సీఎం 100 ర్యాలీల్లో ఎందుకు పాల్గొన్నట్లు?’ అని ప్రశ్నించారు.

## ఈ ఎన్నికల్లో ఎన్నో ఫస్ట్‌లు

మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. అయితే ఈసారి ఎన్నికల్ని వివిధ కోణాల నుంచి చూస్తే ఎన్నో ఫస్ట్‌లు కనిపిస్తాయి.

- 2019 లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక జరిగే తొలి ఎన్నికలివి. ఇప్పటికీ దేశవ్యాప్తంగా మోదీ ఇమేజ్ చెక్కు చెదరని నేపథ్యంలో ఈ ఎన్నికలు జరుగుతున్నాయి.
- కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని రద్దు చేసిన తర్వాత జరుగుతున్న మొదటి ఎన్నికలు. కశ్మీర్ అసెంబ్లీ అనుమతి లేకుండా రాష్ట్రాన్ని విభజించారన్న విమర్శలు వచ్చినప్పటికీ, రావణకాష్టంలా రగులుతున్న సమస్యకు ఏదో ఒక పరిష్కారం వచ్చిందనే అభిప్రాయమైతే జనంలో కనిపించింది. అందుకే ఈసారి ప్రచారంలో స్థానిక అంశాలను పట్టించుకోకుండా ఆర్టికల్ 370 రద్దునే ప్రధాని మోదీ ఎన్నికల అస్త్రంగా చేసుకున్నారు. జాతీయ భావాన్ని రగిల్చి ఓట్లు రాబట్టే ప్రయత్నం చేశారు.
- ట్రిపుల్ తలాక్ బిల్లును పార్లమెంటు ఆమోదించిన తర్వాత జరుగుతున్న మొట్టమొదటి ఎన్నికలివి. బీజేపీ తీసుకున్న అత్యంత సాహసోపేతమైన చర్య ఇది. దీని ప్రభావం ముస్లిం ఓటర్లపై ఎలా పడుతుందోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఈ ఎన్నికల ఫలితాలతో ముస్లింలు, ముఖ్యంగా మహిళా ముస్లింలను బీజేపీ ఏ మేరకు ఆకర్షించగలదో తేలిపోనుంది.
- 2014 ఎన్నికల్లో బీజేపీ సీఎం అభ్యర్థులు ఎవరో ప్రకటించకుండానే ఎన్నికలకు వెళ్లింది. గెలిచిన తర్వాత అనూహ్యంగా మరాఠాల ఆధిపత్యం ఉన్న మహారాష్ట్రలో బ్రాహ్మణ వర్గానికి చెందిన ఫడ్నవీస్‌ను, జాట్‌ల ప్రాబల్యం ఉన్న హరియాణాలో పంజాబీ అయిన ఖట్టర్‌ను సీఎంలుగా చేసింది. ఇప్పుడు వారే సీఎంలుగా ఎన్నికలకు వెళుతోంది. మరి మరాఠా, జాట్‌ల దారి ఎటో తెలిసిపోతుంది.



- ఇక కాంగ్రెస్ పార్టీ పరంగా చూస్తే అ పదవికి రాహుల్ గాంధీ రాజీనామా చేసిన తర్వాత ఆ పార్టీ ఎదుర్కొంటున్న తొలి ఎన్నికలివి. సోనియా గాంధీ తాత్కాలిక అధ్యక్షురాలిగా ఉన్నప్పటికీ అనారోగ్య కారణాలతో పార్టీపై దృష్టిపెట్టలేక పోతున్నారు. దశ, దిశను నిర్దేశించే నాయకత్వలేమితో సతమతమవుతున్న కాంగ్రెస్‌కు ఈ ఫలితాలు ఇంకెన్ని చేదు అనుభవాలను మిగల్చబోతున్నాయో !

# బిల్లులు కట్టాల్సిందే!

- ‘లిఫ్టు’ల విద్యుత్ బిల్లులు రూ. 2,728 కోట్లు
- బకాయిలు చెల్లించాలని నీటిపారుదల శాఖకు దక్షిణ డిస్కం సీఎండీ లేఖ
- మొత్తంగా రూ.3,237 కోట్లకు చేరిన విద్యుత్ బకాయిలు


సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో ఆర్థిక మాంద్యం దృష్ట్యా నిధుల కొరతతో సాగునీటి పథకాలకు పెండింగ్ బిల్లులను చెల్లించలేక ఆ శాఖ సతమతమవుతోంది. మరో వైపు ప్రధాన ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నందున బిల్లులు చెల్లించాల్సిందేనని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్‌పీడీసీఎల్) నీటి పారుదల శాఖపై ఒత్తిడి పెంచుతోంది. తమ ఆర్థిక నిర్వహణ, విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా తక్షణమే రూ.2,728 కోట్లు కట్టాలని టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి నీటి పారుదల శాఖకు లేఖ తాజాగా రాశారు. దీంతో ఈ బిల్లుల చెల్లింపు ఎలా చేయాలన్న దానిపై నీటి పారుదల శాఖ తలలు పట్టుకుంటోంది.

రాష్ట్రంలో ప్రస్తుతం ప్రధాన ఎత్తిపోతల పథకాలైన కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, దేవాదుల, ఎల్లంపల్లి, అలీసాగర్, ఏఎంఆర్ ఎస్ఎల్‌బీసీల ద్వారా మోటార్లను నడిపి నీటిని తాగు, సాగు అవసరాలకు మళ్లిస్తున్నారు. దీనికయ్యే విద్యుత్ సరఫరాను టీఎస్ఎస్‌పీడీసీఎల్ చేస్తోంది. వీటి బిల్లులను నీటి పారుదల శాఖ చెల్లించాల్సి ఉంటుంది. ఆర్థిక పరిస్థితి సరిగా

## నిధులకు కటకట..

లేక కాళేశ్వరం, దేవాదుల, సీతారామ, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులకు సరిపడినన్ని నిధులు లేక బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని పనులు చేస్తున్నారు. ఈ పరిస్థితిలో విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం కనిపించడమే లేదు. దీంతో మొత్తంగా ఎత్తిపోతల పథకాల పరిధిలో రూ.3,237.39 కోట్ల మేర బిల్లులు బకాయి పడింది. వీటిని తీర్చే మార్గాలే లేని దుస్థితిలో నీటిపారుదల శాఖ ఉంటే.. బకాయిలు కట్టాల్సిందేనని టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ లేఖ రాసింది.



మొత్తం బకాయిలు **2728**
కల్వకుర్తి ఎత్తిపోతల బకాయిలు **1,433**
ఎస్ఎల్‌బీసీ బకాయిలు **637**
బీమా బకాయిలు **110**
మిగిలిన బకాయిలు **548**
(అంకెలు రూ. కోట్లలో)

## బిల్లులు చెల్లించండి..

‘ఎత్తిపోతల పథకాల విద్యుత్ బిల్లుల బకాయిలు గత ఆగస్టు 31 నాటికి రూ.2,728.73 కోట్లకు ఎగబాకాయి. దీర్ఘకాలికంగా ఈ బిల్లులు చెల్లించకపోవడంతో టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. టీఎస్ఎస్‌పీడీసీఎల్ వివిధ రకాల విద్యుదుత్పత్తి కంపెనీల నుంచి విద్యుత్‌ను కొనుగోలు చేస్తుంది. ఈ బిల్లులు చెల్లించేందుకు టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఎత్తిపోతల పథకాల వంటి బల్క్ విద్యుత్ కొనుగోలుదారులు చెల్లించే బిల్లులపైనే ప్రధానంగా ఆధారపడుతోంది. ఈ బిల్లులను నీటి పారుదల శాఖ 2019–20 బడ్జెట్ కేటాయింపుల నుంచి చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలి’ అని లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దీనిపై కదిలిన నీటి పారుదల శాఖ ఈ బకాయిల చెల్లింపునకు వీలుగా ప్రతి నెలా కనిష్టంగా రూ.100 కోట్లయినా తమకు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది.

## క్లుప్తంగా...



లక్ష్మణ్ సమక్షంలో బీజేపీలో చేరిన డాక్టర్లు, అడ్వొకేట్లు

### 50 వేల కుటుంబాల ఆవేదన

**ఆర్టీసీ సమ్మెపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికుల ప్రయోజనాలే కాకుండా వారు చేస్తున్న సమ్మెలో తెలంగాణ ప్రజల ప్రయోజనాలు, ఆత్మగౌరవ పోరాటం ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. అందుకే ఉద్యమాన్ని బీజేపీ భుజానికి ఎత్తుకుందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో, సకల జనుల సమ్మెలో ఆర్టీసీ కార్మికులు కీలకంగా వ్యవహరించారన్నారు. అప్పుడు ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పరిగణించాలని, వారికి సమాన వేతనాలు చెల్లించాలని కేసీఆర్ డిమాండ్ చేశారని గుర్తు చేశారు. వారి ఉద్యమంతో వచ్చిన తెలంగాణలో వారినే రోడ్డున పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు ఇవ్వకుండా ఆర్టీసీని నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. దీంతో 50 వేల మంది కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆవేదన చెందుతున్నాయని, వారి ఆవేదన ఈ ప్రభుత్వానికి పట్టడం లేదని ఆరోపించారు. ఆర్టీసీ నష్టాలపాలు కావడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలే కారణమన్నారు. ఈ సమ్మె టీఆర్ఎస్ ప్రభుత్వ పతనానికి నాంది కాబోతోందని అన్నారు. అరెస్టులు, నిర్బంధంతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. బీజేపీ ఉద్యమాన్ని మరింత తీవ్రం చేస్తుందన్నారు. రాష్ట్రంలో పరిణామాలను కేంద్రం నిశితంగా పరిశీలిస్తోందని చెప్పారు. కాగా, పలువురు డాక్టర్లు, ప్రొఫెసర్లు, అడ్వొకేట్లు, యువత బీజేపీలో లక్ష్మణ్ ఆధ్వర్యంలో చేరారు. ఎన్టీఆర్‌కు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా సేవలందించిన నర్సయ్య కూతురు, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ వీరపనేని పద్మ, డాక్టర్ శ్వేత యాదవ్ లక్ష్మి, లావణ్య, దివ్య రాజ్, అజయ్, రత్న తదితరులు బీజేపీలో చేరిన వారిలో ఉన్నారు.

### ఉత్తమ్‌పై సీఈసీకి టీఆర్ఎస్ ఫిర్యాదు

**సాక్షి, హైదరాబాద్/ హుజూర్‌నగర్ రూరల్:** హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో టీపీసీసీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర సమితి కేంద్ర ఎన్నికల సంఘాని(సీఈసీ)కి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఆదివారం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి లిఖితపూర్వకంగా రెండు ఫిర్యాదులు చేశారు. ‘టీపీసీసీ అధ్యక్షుడు, నల్లగొండ పార్లమెంటు సభ్యుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోదాడవాసి. అతనికి ఓటుహక్కు కోదాడలోనే ఉంది. ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రచారం ముగిశాక స్థానికేతరులు ఎన్నిక జరిగే నియోజకవర్గ పరిధిలో ఉండకూడదు. కానీ, ఈ విషయంలో హుజూర్‌నగర్‌లోనే మకాం వేసిన ఉత్తమ్.. నిబంధనలను ఉల్లంఘించారని మొదటి ఫిర్యాదులో ఆరోపించారు. నిబంధనల ప్రకారం ప్రచారం 19వ తేదీ సాయంత్రం 5 గంటలకే ముగిసింది. ఆ తర్వాత ఎలాంటి సమావేశాలు పెట్టరాదు. కానీ, ఉత్తమ్ ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు’అని రెండో ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ రెండు ఫిర్యాదులపై సీఈసీ తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, ఎన్నికల కోడ్ ఉల్లఘించి ప్రెస్‌మీట్ పెట్టారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు హుజూర్‌నగర్ ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన హుజూర్‌నగర్‌లో తన ఇంట్లో ప్రెస్‌మీట్ పెట్టి ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారి డాక్టర్ పెంటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఐపీసీ 188 సెక్షన్, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 126 సెక్షన్ల కింద ఈ కేసు నమోదైందని చెప్పారు.

## నేడు కాంగ్రెస్ ‘ప్రగతి భవన్ ముట్టడి’

- ఆర్టీసీ సమ్మె పరిష్కరించనందుకు నిరసనగా ఆందోళన
- కాంగ్రెస్ కార్యకర్తలంతా పాల్గొనాలని ఉత్తమ్ పిలుపు



**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ సమ్మె పరిష్కరించనందుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ప్రగతి భవన్ ముట్టడి జరగనుంది. ఉదయం 10 గంటలకు టీపీసీసీ కార్యాలయం గాంధీభవన్ నుంచి ర్యాలీగా ఆ పార్టీ నేతలు ప్రగతి భవన్‌ను ముట్టడించేందుకు సిద్ధమవుతున్నారు. అందులో భాగంగా ఆందోళన వ్యూహంపై చర్చించేందుకు ఆదివారం సాయంత్రం మాజీ మంత్రి షబ్బీర్‌అలీ నివాసంలో కాంగ్రెస్ నేతలు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో భువనగిరి, మల్కాజ్‌గిరి ఎంపీలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎ.రేవంత్ రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం షబ్బీర్‌అలీ మీడియాతో మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి సమ్మె విరమణ జరిగేలా ఈనెల 19లోగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని కోరిందని, అయినా ప్రభుత్వం పరిష్కరించకపోవడంతో ప్రగతిభవన్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హైకోర్టు ఆదేశాలను కూడా కేసీఆర్ ప్రభుత్వం ధిక్కరించిందని విమర్శించారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు కాంగ్రెస్ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలంతా పాల్గొనాలని కోరారు. కాగా, టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, 50వేల మంది ఆర్టీసీ కార్మికులను రోడ్డు మీద పడేసిన కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలని కోరారు. కాంగ్రెస్ ఆందోళన నేపథ్యంలో సోమవారం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగానే ఆ పార్టీ నేతలను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఆదివారం రాత్రే కాంగ్రెస్ కీలక నేతలను హౌస్ అరెస్ట్ చేసే అవకాశాలున్నట్లు సమాచారం.

## నేడే హుజూర్‌నగర్ ఉప ఎన్నిక

**ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్**



ఆదివారం ఈవీఎం, వీవీ ప్యాట్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ అమయ్ కుమార్, ఎన్నికల పరిశీలకుడు సచింత్ర ప్రతాప్‌సింగ్

**సాక్షి, ప్రతినిధి, సూర్యాపేట:** హుజూర్‌నగర్ శాసనసభ స్థానానికి సోమవారం ఉప ఎన్నిక జరగనుంది. నియోజకవర్గ పరిధిలోని 302 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. 24న ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు. ఎన్నికల ఫలితాలను నిర్దేశించే స్థాయిలో మహిళా ఓటర్లు ఈ నియోజకవర్గంలో ఉన్నారు. 1,16,508 మంది పురుషులు, 1,20,435 మంది మహిళలు కలిపి మొత్తం 2,36,943 మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొననున్నారు. పోలింగ్ నేపథ్యంలో సోమవారం నియోజకవర్గం పరిధిలో ప్రభుత్వం స్థానిక సెలవు దినంగా ప్రకటించింది. పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లోక్‌సభకు ఎంపిక కావడంతో హుజూర్‌నగర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. దీంతో ఇక్కడ ఉపఎన్నిక అనివార్యమైన విషయం తెలిసిందే. ఉప ఎన్నికలో శానంపుడి సైదిరెడ్డి(టీఆర్ఎస్), నలమాద పద్మావతిరెడ్డి (కాంగ్రెస్), కోటా రామారావు(బీజేపీ), చావ కిరణ్మయి (టీడీపీ)తో కలిపి మొత్తం 28 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఈ వీఎంకు అనుసంధానం చేసే బ్యాలెట్ యూనిట్‌తో గరిష్టంగా 15 మంది (నోటాతో కలిపి 16) అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉండటంతో ఇక్కడ రెండు బ్యాలెట్ యూనిట్లను వినియోగించనున్నారు. టీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య ప్రధాన పోటీ నెలకొని ఉంది.

**పోలీస్ పహారాలో..:** పోలింగ్ నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 2,350 మంది పోలీసులతో భారీ బందోబస్తు చేపట్టారు. 6 కంపెనీల కేంద్ర బలగాలు, 5 కంపెనీల తెలంగాణ స్పెషల్ పోలీస్, జోన్ పరిధిలోని జిల్లాల నుంచి అదనపు సిబ్బంది, 10 స్పెషల్ పార్టీలు, డాగ్ స్క్వాడ్స్, టాస్క్‌ఫోర్స్, 27 రూట్ మొబైల్స్, 7 క్విక్ రియాక్షన్ టీమ్స్ బందోబస్తులో ఉన్నాయి.



ఆదివారం హైదరాబాద్‌లో దశ-దిశ గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న సుదర్శన్‌రెడ్డి. చిత్రంలో మల్లేపల్లి లక్ష్మయ్య, చుక్కా రామయ్య, రామచంద్రమూర్తి, బొత్స, హరీశ్, యార్లగడ్డ, తెలకపల్లి తదితరులు

## పాత్రికేయులు పౌరులకు విధేయులు

**‘తెలుగు ప్రజల దశ –దిశ’ గ్రంథావిష్కరణలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి**

**హైదరాబాద్:** సీనియర్ పాత్రికేయులు కొండుభట్ల రామచంద్రమూర్తి నిర్వహించిన ‘దశ- దిశ’కార్యక్రమం అద్వితీయమైనదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. కొండుభట్ల రామచంద్రమూర్తి సారథ్యంలో రాష్ట్ర విభజనకు ముందు హెచ్ఎంటీవీ నిర్వహించిన చరిత్రాత్మక చర్చ ‘తెలుగు ప్రజల దశ–దిశ ’గ్రంథావిష్కరణ సభ ఆదివారం రాత్రి ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి గ్రంథాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. టెలివిజన్ కేంద్రాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లి ఉద్విగ్నభరితమైన పరిస్థితుల్లో సమావేశాలను నిర్వహించడం ఆషామాషీ కాదన్నారు. ఇలాంటి బృహత్తరమైన చర్చా కార్యక్రమాన్ని నిర్వహించడం కొండుభట్ల రామచంద్రమూర్తికే సాధ్యమైందని అన్నారు. జర్నలిజం బాధ్యతాయుతమైన వృత్తి అని చెప్తూనే, పత్రికలు పాటించాల్సిన నైతిక విలువలను ఆయన గుర్తు చేశారు. పాత్రికేయులు పౌరులకు విధేయులుగా ఉండాలని, పాలకులను ప్రశ్నించాలని సూచించారు. సీనియర్ పాత్రికేయులు రామచంద్రమూర్తి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన దశదిశ కార్యక్రమం తనకెంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ, ఆర్థిక మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, సీనియర్ పాత్రికేయులు దేవులపల్లి అమర్, బుద్ధవనం ప్రాజెక్టు ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య, విద్యావేత్త చుక్కా రామయ్య, విశ్లేషకులు వల్లీశ్వర్, తెలకపల్లి రవి, ఎమెస్కో విజయ్ కుమార్, బీసీ కమిషన్ చైర్మన్ బి.ఎస్.రాములు, ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, నమస్తే తెలంగాణ పత్రిక సంపాదకులు కట్టా శేఖర్‌రెడ్డి, రచయిత దేవిప్రియ పాల్గొన్నారు.

## ఫార్మాసిటీకి సాయమందించాలి



**సాక్షి, హైదరాబాద్:** సమీకృత ఫార్మాపార్క్‌కు అన్ని విధాలా సాయమందిచాలని పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ కేంద్రాన్ని కోరారు. జాతీయ ప్రాధాన్యం కలిగిన ప్రాజెక్టుకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తూ ఆదివారం కేంద్రమంత్రులు పియూష్ గోయల్, ధర్మేంద్రప్రదాన్‌లకు ఆయన లేఖలు రాశారు. ‘హైదరాబాద్ ఫార్మా సిటీ ప్రపంచంలోనే అతిపెద్ద సమీకృత ఫార్మా పార్క్. ఇది కేంద్ర ప్రభుత్వ మేకిన్ ఇండియా కార్యక్రమానికి అనుగుణంగా ఫార్మా సిటీ దేశీయ ఫార్మా రంగాన్ని బలోపేతం చేస్తుంది. ఇప్పటికే కేంద్రం ఫార్మాసిటీని జాతీయ ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టుగా గుర్తించింది. దీంతో పాటు నిమ్జ్ హోదాకు కేంద్రం సూత్రప్రాయ అంగీకారం తెలిపింది. ఫార్మా సిటీ ద్వారా సుమారు రూ.64 వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశముంది. సుమారు 5 లక్షల 60 వేల మందికి ఉపాధి దొరుకుతుంది. ఇంత ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టుకు కేంద్ర మద్దతు తప్పనిసరి. అందుకే, ఫార్మా సిటీ మౌలిక వసతుల కోసం రూ.1,318 కోట్లు, సాంకేతిక సదుపాయాల కల్పన రూ.2,100 కోట్లు కోసం కేంద్ర ఆర్థిక సాయం అందించాలి..’అని పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను లేఖలో కోరారు. ఫార్మాసిటీకి సహజ వాయువు సరఫరా కేటాయింపుల కోసం కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ మరో లేఖ రాశారు.

## దూకుడు పెంచాల్సిందే: అరుణ్ సింగ్



**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ కార్మికుల సమ్మె వ్యవహారంలో బీజేపీ దూకుడు పెంచడంతోపాటుగా హుజూర్‌నగర్ ఉపఎన్నికల్లో పార్టీ సత్తా చాటేలా చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ఆదేశించారు. బీజేపీ పక్షాన ఆర్టీసీ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్రంలోని బీజేపీ శ్రేణులకు ఆయన సూచించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అధ్యక్షతన పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్, ప్రధాన కార్యదర్శులు మనోహర్ రెడ్డి, ప్రేమేందర్ రెడ్డి, పార్టీ ముఖ్య నేతలు, జిల్లాల నేతలు హాజరైన ఈ సమావేశంలో హుజూర్‌నగర్ ఉప ఎన్నికలు, రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికుల సమ్మె, బీజేపీ అనుసరిస్తున్న వైఖరి తదితర అంశాలు చర్చించారు. అనంతరం అరుణ్ సింగ్ మీడియాతో మాట్లాడారు. మహారాష్ట్ర, హరియాణలో బీజేపీ పూర్తిస్థాయి మెజారిటీతో అధికారంలోకి రాబోతుందని ఆయన జోస్యం చెప్పారు. టీఆర్ఎస్ ప్రభుత్వం పట్ల ప్రజలు అసహనంతో ఉన్నారని విమర్శించారు. ఆర్టీసీ కార్మికులను టీఆర్ఎస్ ప్రభుత్వం అకారణంగా ఇబ్బందులకు గురిచేస్తోందని, కార్మికులను ఇంతలా అణచివేస్తున్న ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేదన్నారు. 50 వేలమంది కార్మికులు చేస్తోన్న సమ్మెపై హైకోర్టు జోక్యం చేసుకున్నా టీఆర్ఎస్ మాత్రం స్పందించడం లేదన్నారు. ఆర్టీసీ కార్మికులు చేసిన రాష్ట్రబంద్‌లో బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్‌తో పాటు అనేక మందిని అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కార్మికుల పక్షాన పోరాటం చేసిన వారిని ఎలా అరెస్టు చేస్తారని ఆయన ప్రశ్నించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా ఆర్టీసీని ప్రైవేటీకరణ చేయలేదని, కావాలంటే టీఆర్ఎస్ నాయకులు పరిశీలించుకోవచ్చన్నారు. గాంధీ 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా చేపట్టిన ‘గాంధీ సంకల్ప యాత్ర’కు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. బీజేపీ సంస్థాగత నిర్మాణ ప్రక్రియలో భాగంగా డిసెంబర్ నాటికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికను పూర్తి చేయాలని నిర్ణయించింది.

The Andhra Pradesh State Co-operative Bank Ltd.,
(A State Govt. Partnered Scheduled Bank)
D No:27-29-28, NTR Sahakara Bhavan, Governorpet,
Vijayawada-520 002, HRD Department, Email-id:hrd@apcob.org;
Ph:0866-2429011/012
APCOB

RECRUITMENT NOTIFICATION

Applications are invited for filling up of the post of MD / CEO of APCOB from suitable candidates who fulfil the Fit and Proper Criteria prescribed by RBI / NABARD.

Last date for receipt of application by APCOB is 04.11.2019. For full text of Notification and further details, please visit our website www.apcob.org.

Date: 21.10.2019 MANAGING DIRECTOR




# మండలానికో 108

▶ మొదటి పేజీ తరువాయి

మిగిలినవి రిజర్వులో ఉన్నాయి. పట్టణాలు, నగరాల్లోనూ ఇవే వాహనాలు అత్యవసర సమయాల్లో రోగులను ఆసుపత్రులకు చేరుస్తున్నాయి. ప్రతి లక్ష జనాభాకు ఒకటి చొప్పున ప్రస్తుతం ‘108’ వాహనం ఉండగా మండలానికి ఒకటి పెంచడం ద్వారా ప్రతి 70 వేల జనాభాకు ఒక వాహనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం రాష్ట్రంలో 589 మండలా లుండగా ఆ మేరకు వాహనాల సంఖ్యను పెంచనుంది.

**సమూల మార్పుల కోసం దేశవ్యాప్త అధ్యయనం...**

దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి అందుబాటులోకి తెచ్చిన ‘108’ అత్యవసర వైద్య సేవల ద్వారా గ్రామాలు, పట్టణాల్లో అత్యవసర వైద్యం అవసరమైనవారు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారు అంబులెన్స్ సేవలను ఉచితంగా పొందుతున్నారు. రోజుకు ఒక్కో వాహనం నాలుగు ట్రిప్పులు వెళ్లేలా ఈ పథకాన్ని తీర్చిదిద్దారు. ఫోన్ చేసిన 20 నిమిషాల్లోగా బాధితుల వద్దకు చేరుకోవాలనేది నిబంధన. 2007 నుంచి అంబులెన్స్ సర్వీసులను జీవీకే సంస్థ నిర్వహిస్తోంది. వాహనాల నిర్వహణ ఖర్చు, సిబ్బంది వేతనాలు కలిపి ప్రభుత్వం ఆ సంస్థకు ఏటా రూ. 86 కోట్లు చెల్లిస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో చేసుకున్న ఒప్పందం ప్రకారమే ఇప్పటికీ ఆ సంస్థ కార్యకలాపాలు చేపడుతోంది. దాని నిర్వహణ ఒప్పందం 2016లో ముగిసినా పొడిగిస్తూ వస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. మూడు నెలల క్రితం టెండర్ల ద్వారా 108 సర్వీసుల నిర్వహణ బాధ్యతను ఒక ప్రతిష్టాత్మక సంస్థకు అప్పగించాలనుకున్నా అది కుదరలేదు. అయితే ‘108’ సేవల్లో మరిన్ని విప్లవాత్మక మార్పులు చేసి కొత్త నిబంధనలతో సేవలను అందుబాటులోకి తేవాలని సర్కారు నిర్ణయించింది. అందుకోసం సేవల అమలు తీరును తెలుసుకునేందుకు ఆరోగ్యశాఖలోని రాష్ట్రస్థాయి అధికారుల బృందాలు ఢిల్లీ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో అధ్యయనం చేసి వచ్చాయి. అందుకు సంబంధించి ఎటువంటి మార్పులు చేయాలన్న దానిపై నివేదిక తయారు చేసి రెండ్రోజుల కిందట ప్రభుత్వానికి సమర్పించాయి.


**సీఎస్ఆర్ కింద నిర్వహణకు ముందుకొచ్చిన అరబిందో...**

‘108’ సేవల కోసం ఏటా రూ. 86 కోట్లు కేటాయిస్తున్న ప్రభుత్వం మూడు నెలలకోసారి నిర్వహణ సంస్థకు చెల్లించాల్సి ఉండగా ఒక్కోసారి బిల్లుల చెల్లింపులు, ఇతరత్రా సాంకేతిక కారణాలతో నిధుల విడుదల ఆలస్యమవుతోంది. దీంతో పలు సందర్భాల్లో డీజిల్ కొరత, ఉద్యోగులకు వేతనాల చెల్లింపు జరగక వాహన సేవల్లో అంతరాయం ఏర్పడుతోందని వైద్య బృందాలు తమ నివేదికలో ప్రస్తావించాయి. ఈ నేపథ్యంలో ‘108’ నిర్వహణ పూర్తి బాధ్యతను తమకు అప్పగిస్తే కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ. 30 కోట్లు ఖర్చు చేస్తామని అరబిందో ఫార్మా వర్గాలు పేర్కొన్నాయని వైద్య ఆరోగ్యశాఖకు చెందిన ఒక అధికారి వ్యాఖ్యానించారు. దీనివల్ల నిధుల కొరత ఉండదని, అంతరాయం ఏర్పడదని, సర్కారుపైనా భారం తగ్గుతుందని భావిస్తున్నారు. ఈసారి టెండర్లకు వెళ్లాలని సర్కారు భావించినా ఆ ఆలోచనను విరమించుకొని నామినేషన్ పద్ధతిలోనే అప్పగించాలని యోచిస్తోంది. దీనిపై ప్రభుత్వానికి కూడా ప్రతిపాదనలు వెళ్లినట్లు సమాచారం.

**వాళ్లు ముందుకొచ్చారు..**

‘108’ వాహన సేవల నిర్వహణకు అరబిందో ఫార్మా ముందుకొచ్చిన విషయం వాస్తవమే. సీఎస్ఆర్ కింద రూ. 30 కోట్లు ఖర్చు చేస్తామని చెప్పారు. దీనివల్ల సర్కారుపై భారం ఉండదని భావిస్తున్నాం. అయితే ఇవన్నీ ప్రతిపాదనలే.. వాటిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు.
– ఈటల రాజేందర్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి

సాక్షి
సాహిత్యం
నల్లగొండ | సోమవారం
అక్టోబర్ | 21 | 2019
sakshisahityam@gmail.com



## గ్రహం అనుగ్రహం


శ్రీ వికారినామ సంవత్సరం. దక్షిణాయనం, శరదృతువు. ఆశ్వయుజ మాసం. తిథి బ.అష్టమి రా.1.12 వరకు, తదుపరి నవమి. నక్షత్రం పునర్వసు ప.2.41 వరకు, తదుపరి పుష్యమి. వర్జ్యం రా.10.19 నుంచి 11.50 వరకు. దుర్ముహూర్తం ప.12.08 నుంచి 12.53 వరకు, తదుపరి ప.2.26 నుంచి 3.12 వరకు. అమృత ఘడియలు ప.12.09 నుంచి 1.42 వరకు.

**సూర్యోదయం:** 5.57 **సూర్యాస్తమయం :** 5.33.
**రాహుకాలం :** ఉ.7.30 నుంచి 9.00 వరకు.
**యమగండం :** ఉ.10.30 నుంచి 12.00 వరకు

## నమాజ్ వేళలు


ఫజర్ : 4.58
జొహర్ : 12.01
అసర్ : 4.14
మగ్రీబ్ : 5.51
ఇషా : 7.04

## ఈవారం పుస్తకాలు




**చేదుపూలు** (కథలు)
రచన: మెహెర్; పేజీలు: 208; వెల: 135; ప్రచురణ: ఛాయా రిసోర్సెస్ సెంటర్ ప్రతులకు: అనల్ప బుక్ కంపెనీ, సికింద్రాబాద్. ఫోన్: 7093800678

**మెటమార్ఫసిస్**
('చైనా గోడ', 'పల్లెటూరి వైద్యుడు' లాంటి కొన్ని ఫ్రాంజ్ కాఫ్కా అనువాద కథలు)
తెలుగు: మెహెర్; పేజీలు: 126; వెల: 100; ప్రచురణ: పల్లవి పబ్లికేషన్స్, డాక్టర్ ఎ.ప్రేమ్‌చంద్ కాంప్లెక్స్, అశోక్‌నగర్ ఫస్ట్ లేన్, విజయవాడ–10. ఫోన్: 9866115655



**తథాగతుని అడుగుజాడలు**
రచన: రాణీ శర్మ ఈమని, ఉణుదుర్తి సుధాకర్; పేజీలు: 196; వెల: 180


**టిపు సుల్తాన్**
రచన: యార్లగడ్డ నిర్మల; పేజీలు: 160; వెల: 150; రెండింటి ప్రతులకు: హైదరాబాద్ బుక్ ట్రస్ట్, గుడిమల్కాపూర్, హైదరాబాద్–6. ఫోన్: 040–23521849



**తెలంగాణ చరిత్రలో రెడ్డి పాలకులు: సాహిత్యం–సమాజం**
సంపాదకులు: ఆచార్య కె.తిమ్మారెడ్డి, ఆచార్య కె.కుసుమారెడ్డి, ఆచార్య సూర్యా ధనంజయ్; పేజీలు: 232; ప్రచురణ: అఖిల భారత రెడ్ల సంక్షేమ సమాఖ్య, శ్రీశైలం–518101.

**నెల నెలా మన జిల్లా సాహిత్యం**
(కడప జిల్లా సాహిత్యంపై ప్రసంగ వ్యాసాలు)
సంపాదక మండలి: ఆచార్య అత్తిపల్లి రామచంద్రారెడ్డి, ఆచార్య కె.చంద్రయ్య, డాక్టర్ మూల మల్లికార్జున రెడ్డి; పేజీలు: 634; వెల: 400; ప్రచురణ: సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, యోగి వేమన విశ్వవిద్యాలయం, 1–1254, యర్రముక్కపల్లె, కడప–516004. ఫోన్: 08562–255517

కథాసారం



**చ**ట్టం ముందు ఒక కాపలావాడు నిలబడి ఉంటాడు. ఒక పల్లెటూరి మనిషి కాపలావాడి దగ్గరకు వచ్చి చట్టం లోపలికి వెళ్ళటానికి అనుమతి ఇవ్వమని బతిమాలతాడు. కాని కాపలావాడు అనుమతి ఇప్పుడు ఇవ్వలేనని అంటాడు. ఆ వచ్చిన మనిషి కాసేపు ఆలోచించి, అయితే తర్వాత ఎప్పుడైనా అనుమతి దొరికే అవకాశం ఉందా అని అడుగుతాడు. 'అవకాశం ఉంది, కానీ ఇప్పుడు కాదు,' అంటాడు కాపలావాడు. ఎప్పటిలాగే తెరుచుకొని ఉన్న చట్టం తలుపుల్లోంచి, కాపలావాడు పక్కకు జరగటంతో, ఆ మనిషి లోపలికి తొంగి చూస్తాడు. కాపలావాడు అది చూసి నవ్వి అంటాడు: 'నీకు అంత ఆత్రంగా వుంటే, నా మాట కాదని లోపలకి వెళ్ళే ప్రయత్నం చేయి. కాని ఒకటి మటుకు గుర్తుంచుకో: నాకు చాలా బలముంది. అయినా నేనిక్కడ కాపలావాళ్ళలో చివరిస్థాయి వాడ్ని మాత్రమే. లోపలకి వెళ్ళేసరికి ఇలా గది నుండి గదికి ప్రతీ తలుపు దగ్గరా ఒక్కో కాపలావాడు నిలబడి ఉంటాడు, ప్రతీ ఒక్కడూ ముందు వాడి కంటే బలవంతుడే. మూడో కాపలావాడికి ఎదురుగా నిలబడటానికి నాకే ధైర్యం చాలదు.' పల్లెటూరి నుంచి వచ్చిన మనిషి ఇలాంటి కష్టాలను ఊహించలేదు; చట్టం అందరికీ అన్ని సమయాల్లోనూ అందుబాటులో ఉండి తీరాలని అతని అభిప్రాయం, కాని ఇక్కడ ఈ కాపలావాడ్ని -- ఇలా ఉన్నికోటు వేసుకొని, మొనదేలిన పెద్ద ముక్కుతో, నిగనిగలాడే నల్లని తార్తారు గెడ్డంతో సన్నగా పొడవుగా ఉన్నవాడ్ని -- కాస్త దగ్గరగా పరిశీలించిన మీదట, అనుమతి వచ్చేంత వరకూ ఎదురుచూడటమే మంచిదన్న నిర్ణయానికి వస్తాడు. కాపలావాడు అతనికి ఒక పీట ఇచ్చి తలుపుకి వారన కూర్చోనిస్తాడు. ఆ మనిషి అక్కడే రోజుల తరబడి, సంవత్సరాల తరబడి కూర్చుంటాడు. పదే పదే లోపలికి అనుమతి ఇవ్వమని అడుగుతూ అభ్యర్థనలతో కాపలావాడ్ని విసిగిస్తాడు. అప్పుడప్పుడూ కాపలావాడు ఆ మనిషిని ఆరాలు తీస్తాడు, ఇంటి గురించీ మిగతా విషయాల గురించీ అడుగుతాడు, కానీ అవన్నీ గొప్పవాళ్ళు తెలుసుకోవాలని లేకపోయినా అడిగే ప్రశ్నల్లా ఉంటాయి, ఎంతసేపు మాట్లాడినా చివరకు మాత్రం ఇంకా అనుమతి లేదనే ముక్తాయిస్తాడు. ఈ ప్రయాణం కోసం చాలా సరంజామా వెంటపెట్టుకొని వచ్చిన ఆ మనిషి, తెచ్చుకున్నదంతా, అదెంత విలువైనదైనా, కాపలావాడికి లంచాలు ఇవ్వటానికి వాడేస్తాడు. కాపలావాడు అన్నీ కాదనకుండా తీసుకుంటాడు, కాని తీసుకొనేటప్పుడు మాత్రం: 'ఇంకా ఏదో ప్రయత్నించకుండా వదిలేశావని నువ్వనుకోకుండా ఉంటానికి మాత్రమే ఇది తీసుకుంటున్నాను,' అనటం మానడు. అన్ని సంవత్సరాల సమయంలోను ఆ మనిషి నిరంతరాయంగా కాపలావాడ్ని గమనిస్తూనే ఉంటాడు. అందులో పడి మిగతా కాపలావాళ్ళ సంగతే మరిచిపోతాడు, ఈ కాపలావాడొక్కడే చట్టంలోపలికి వెళ్లటానికి ఏకైక అడ్డంకిగా కనిపిస్తాడు. ఈ దురదృష్టానికి తన్ను తానే తిట్టుకుంటాడు, వచ్చిన కొత్తల్లో పైకే తిట్టుకుంటాడు, కానీ తర్వాత, వయసు మళ్ళేకొద్దీ, తనలో తాను గొణుక్కోవటంతో సరిపుచ్చుకుంటాడు. అతనిలో పిల్లచేష్టలు మొదలవుతాయి, సంవత్సరాల తరబడి అదే పనిగా చూడటం వల్ల కాపలావాడి కాలరు మడతలోని నల్లులను కూడా గుర్తుపట్టి, వాటిని కూడా తన తరపున కాపలావాడి మనసు మారేలా బతిమాలమని అడుగుతాడు. రాన్రానూ అతని చూపు మందగిస్తుంది, చుట్టూ ప్రపంచమే మసక బారుతోందో లేక తన కళ్ళే తనను మోసం చేస్తున్నాయో అర్థం కాదు. కానీ, అంత చీకటిలో కూడా, అతను చట్టపు ప్రవేశ ద్వారం నుంచి ఆగకుండా వెలువడుతున్న ఒక కాంతి పుంజాన్ని దర్శించగలుగుతాడు. ఇక అతని జీవితం చివరికొచ్చేసింది. చనిపోయేముందు, ఇన్ని సంవత్సరాల అనుభవాలూ మనసులో కూడుకొని, కాపలావాడ్ని ఇప్పటిదాకా అడగని ఒకే ఒక్క ప్రశ్నగా రూపుదిద్దుకుంటాయి. పట్టేసిన శరీరాన్ని నిటారుగా లేపలేక, కాపలావాడికి సైగ చేస్తాడు. వాళ్ళిద్దరి ఎత్తుల్లో పెరిగిన తేడా వల్ల ఇప్పుడు కాపలావాడు అతని వైపు వొంగాల్సి వస్తుంది. 'ఇప్పుడేం తెలుసుకోవాలి, నీకు తృప్తి అన్నదే లేదు కదా!' అంటాడు కాపలావాడు. 'ప్రతి ఒక్కరూ చట్టంలోపలికి వెళ్ళాలని ఆరాటపడతారు కదా. మరి, ఇన్నేళ్ళలో, ఇక్కడ నేను తప్ప ఇంకెవరూ వచ్చి ప్రవేశానికి అనుమతి అడగలేదెందుకు?' అని అడుగుతాడు ఆ మనిషి. అతను ఆఖరి క్షణాల్లో ఉన్నాడని కాపలావాడు గ్రహిస్తాడు, వినికిడి తగ్గుతున్న అతని చెవుల్లోకి చేరేట్టు, గట్టిగా ఇలా అరుస్తాడు: 'ఇంకెవ్వరూ ఇక్కడ నుంచి లోపలకు వెళ్ళలేరు, ఎందుకంటే ఈ తలుపు ఉన్నది నీ ఒక్కడి కోసమే. ఇప్పుడిక దాన్ని మూసేస్తున్నాను.'

ఫ్రాంజ్ కాఫ్కా (1883–1924) 'బిఫోర్ ద లా'కు ఇది అనువాదం. 1914–15 మధ్యలో ఆయన రాసిన 'ద ట్రయల్' నవలలో ఒక పాత్ర చెప్పే నీతి కథలాంటిది ఇది. తర్వాత విడిగా కూడా ప్రచురణ అయింది. అనువాదం, పరిచయం: మెహెర్. అనువాదకుడు కాఫ్కా కొన్ని కథల్ని 'మెటమార్ఫసిస్'గా పుస్తకం తెచ్చారు.

# కలల్లాంటి కథలు

**కాఫ్కా** రచనా ప్రక్రియ మన కలల నిర్మాణాన్ని ఫాలో అవుతుంది. మన కలల్లో ఒక ధోరణి ఉంటుంది. వాటిలో కనపడే దృశ్యాలకూ, వాటివల్ల మనకు కలిగే భావాలకూ పొంతన ఉండదు. కనపడే దృశ్యాలతో ఏ మాత్రం సంబంధంలేని భావాలేవో కలుగుతుంటాయి. కలలో మనం చందమామని చూసి కూడా భయపడవచ్చు. మరి మెలకువ జీవితంలో ఆహ్లాదకరమైన చందమామ కలలో భయకారకమెలా అయింది? అంటే, నిజానికి కాలేదు. కలలో మనకు భయం కలిగేది చందమామ 'వల్ల' కాదు, మనలో ఆల్రెడీ ఉన్న భయమే చందమామ మీదకూ ప్రసరించి దాన్ని కూడా భయావహం చేస్తుంది, అదే స్థానంలో మరే ఇతర అప్రమాదకర దృశ్యాలున్నా కూడా--సూర్యాస్తమయం, చెట్టు మీద కాకులు, దగ్గరగా ఎగిరే విమానం--అలాంటి భయమే కలగవచ్చు. అంటే, కల ఒక భావంతో మొదలవుతుంది, ఇక తర్వాత కలలో ఏ దృశ్యం వచ్చి పడినా, అది ఆ పూర్వనిశ్చిత భావాన్నే ప్రకటిస్తుంది. కాబట్టి, ఆ 'చందమామ కల'కు సంబంధించినంత వరకూ దృశ్యం వల్ల భయం కాదు, భయం వల్ల దృశ్యం. ఇక్కడ భయం ప్రేరేపిత భావం కాదు, ప్రేరేపక భావం. దీన్ని ఒక్క భయం అనే భావానికే కాదు; ఆహ్లాదం, కామం, ఉద్వేగం, జుగుప్స ఇలా ఏ భావానికైనా వర్తింపజేయవచ్చు. కానీ కాఫ్కా జీవితాన్ని ప్రధానంగా నిర్దేశించిన ఏకైక భావం భయం: తండ్రి పట్ల భయం, ఆరోగ్యం పట్ల భయం, సెక్సువల్ ఇంటిమసీ పట్ల భయం, పెళ్ళి పట్ల భయం, చివరకు సాహిత్యం పట్ల కూడా భయమే.



ఫ్రాంజ్ కాఫ్కా

కాఫ్కా జీవితానుభవాల్ని యథాతథంగా తీసుకోలేదు, అవి తనలో కలిగించిన భావాల్ని మాత్రం తీసుకున్నాడు. ఆ భావాన్ని తనలో నింపుకుని, ఆ భావం పూనినవాడై, ఆ భావంతో మమేకమై– కలం కదిపాడు. ఇక అతను రాసింది ఏదైనా ఆ భావం మాత్రం ఆ సృజన అంతటా ఒక పారదర్శకపు పొరలా పరుచుకుని ఉంటుంది. పాఠకుని మనసు ఆ భావాన్ని అనుభూతి చెందుతుంది, కానీ బుద్ధికి మాత్రం ఆ భావానికీ, రచనలోని వివరాలకూ తార్కికమైన సంబంధమేమిటో అందదు. అచ్చంగా కలల్లోలాగానే. కానీ ఎంతైనా పుస్తకం అనేది ఒక కాంక్రీటు వాస్తవం. అందులో వ్యాకరణానుగుణమైన వాక్యాలూ, వర్ణితమైన సన్నివేశాలూ ఒక తార్కికమైన క్రమాన్నీ, మెటీరియల్ ఉనికినీ కలిగి ఉంటాయి. పైగా కాఫ్కా రియలిస్టు రచయితలతో పోటీపడేవిధంగా కాల్పనిక ప్రపంచాల్ని తీర్చిదిద్దుతాడు. దాంతో వాటి నిర్మాణం తార్కికంగా స్పష్టంగా ఉంటుంది, అర్థం మాత్రం కలలోలా అలికేసినట్టు ఉంటుంది. ఈ కాంబినేషన్ పాఠకుల్ని చిత్రమైన ఆకర్షణతో కట్టిపడేస్తుంది. వారికి కాఫ్కాను చదవడం మెలకువలో ఉండి కలగంటున్నట్టుగా తోస్తుంది.

# మనుషులను వేటాడే మనిషి

కొత్త బంగారం

**'రా**త్రివేళ అంబులెన్స్ వచ్చి నన్ను పట్టుకుపోయే సందర్భం కోసమని సిద్ధంగా ఉండేందుకు– పడుకోబోయే ముందు నా పాదాలను శుభ్రంగా కడుక్కునే వయస్సులోనూ, స్థితిలోనూ ఉన్నాను' అనే 61 ఏళ్ళ జెనీనా మాటలతో, ఓల్గా తొకార్చుక్ పోలిష్ నవల 'డ్రైవ్ యువర్ ప్లవ్ ఓవర్ ద బోన్స్ ఆఫ్ ద డెడ్' మొదలవుతుంది. జెనీనా ఒకానొకప్పుడు వంతెన నిర్మాణ ఇంజనీరూ, క్రీడాకారిణీ.

'జాతీయ సరిహద్దులతో నిమిత్తంలేకుండా, ఫోన్ సిగ్నళ్ళు ఇటూ అటూ కూడా అందే' ఆధునిక పోలండ్ – చెక్ రిపబ్లిక్ సరిహద్దుల్లో ఉన్న పేరుండని గ్రామంలో శీతాకాలం అది. లోకం నుంచి దూరం పాటిస్తూ, జ్యోతిష్య శాస్త్రాన్ని అధ్యయనం చేస్తూ, విలియమ్ బ్లేక్ కవిత్వాన్ని అనువదిస్తూ కాలం గడుపుతుంది కథకురాలైన జెనీనా. ఆ వేటాడే సమాజంలో నివసించే శాకాహారైన ఆమెను, 'అడివిలో ఉండే మతిస్థిమితం లేని ముసలామె' అనుకుంటారు స్థానికులు.

జెనీనాకు, 'మనుషుల పేర్లు ఉపయోగించడం ఇష్టముండదు. మొదటిసారి, ఒక వ్యక్తిని చూసినప్పుడు తట్టే విశేషణమే నచ్చుతుంది.' అందుకనే ఊరివారిని తనకు తోచిన పేర్లతోనే పిలుస్తుంది. కీటక శాస్త్రవేత్త అయిన బౌరస్ ఆ పల్లెకు వచ్చి, జెనీనా ఇంట్లో ఉంటాడు.

ఒకరోజు– ఆమె పొరుగింట్లో ఉండే 'ఆడ్‌బాల్' వచ్చి, పక్కనే ఉంటుండే వేటగాడైన, 'బిగ్ ఫుట్' చనిపోయున్నాడని చెప్తాడు. మృతుడి గొంతుకు జింక ఎముక అడ్డం పడుంటుంది. పక్కనున్న ఫొటోలో, జెనీనా కుక్కలను వేటాడి చంపేసిన వ్యక్తుల మొహాలుంటాయి. ఆ తరువాత, మరికొందరు మధ్యవయస్కులైన వేటగాళ్ళు మరణిస్తారు. అందులో ఒకరి హత్య పురుగులను గొంతులోకి దింపడం ద్వారా జరుగుతుంది. ఆ మరణాలు ఊర్లో అలజడి సృష్టిస్తాయి. 'సంభవిస్తున్న ఈ విషాద ఘటనలకి కారణం జంతువులే అని నమ్మాలని నేను పోలీసు విభాగానికి విజ్ఞప్తి చేయాలనుకుంటున్నాను' అని ఆమె రాసిన తరువాత, పల్లెవాసులందరికీ ఆమెకు పిచ్చి అన్న అభిప్రాయం బలపడుతుంది.

'నా రోగాలెప్పుడు మోసం చేస్తూ నన్ను పట్టుకుంటాయో కూడా తెలియదు... ఒకోసారి రోజులకొద్దీ కొనసాగుతాయి... మందులు, ఇంజెక్షన్లు పని చేయవు' అనే జెనీనాను, 'జీవితంలో నీవు చేసినదేమిటి?' అని ఒక వ్యక్తి అడిగినప్పుడు, ఆమెకు నోటి మాట రాదు. 'మేము ప్రేమించిన– మా బాల్యం, యవ్వనం గడిచిన జాగాలు ఇక లేవు. వాటి బాహ్యరూపం మాత్రమే భద్రపరచబడి, లోపలేమీ లేని ఈ పెంకులని చూడటం మరీ బాధాకరం. వెళ్ళేందుకు నాకే చోటూ లేదు. ఇది జైలుశిక్ష. నేను చూడగలిగే దిగంతం దీని గోడలే' అనుకుంటుంది.

ఊరంతా జెనీనాయే హంతకురాలన్న నిర్ణయానికి వచ్చి, ఆమెను నిలదీస్తారు. తను జబ్బుపడే వేళయినప్పుడు, తన కుక్కలను వేటాడినవారిని తానే చంపేసేదాన్నని ఒప్పుకుంటుంది. జెనీనా, బౌరస్ కలిసి చెక్ రిపబ్లిక్‌లో కొత్త జీవితం ప్రారంభిస్తారు.



2018 సంవత్సరపు నోబెల్ పురస్కారం వరించిన పోలండ్ రచయిత్రి ఓల్గా తొకార్చుక్

నవల్లో ఉన్న 17 అధ్యాయాలూ, బ్లేక్ కవితల్లో నుంచి తీసుకున్న ఉల్లేఖనాలతోనే మొదలవుతాయి. 2009లో పోలిష్ భాషలో వచ్చిన పుస్తకం–ప్రకృతి, దానిపైన మానవుల ప్రభావం, వేట, దాని క్రూరత్వం వంటి సమకాలీన సాహిత్య సమస్యలకు సరితూగి, పాతదనిపించదు. అధికారం, డబ్బు, పితృస్వామ్యం గురించి మాట్లాడే నవల వచనం– సున్నితమైన హాస్యం నుండి విచారానికీ, దుర్బలత్వానికీ పాదరసంలా మారుతుంటుంది. ఏంటోనియా లాయిడ్ జోన్స్ ఇంగ్లిష్ అనువాదాన్ని రివర్ హెడ్ బుక్స్– ఆగస్టు 2019లో ప్రచురించింది. ఈ మర్మంతో కూడిన నవల కట్టుకథ శీర్షిక, బ్లేక్ 'ప్రావర్బ్స్ ఆఫ్ హెల్'లో ఒకటి. ఆగెనెస్కియా హాలెండ్ దర్శకత్వంలో ఈ నవల ఆధారంగా 2017లో సినిమా కూడా వచ్చింది.

1962లో జన్మించిన ఓల్గా తొకార్చుక్ తన ఫ్లైట్స్ నవలకుగానూ 2018లో మ్యాన్ బుక్ ఇంటర్నేషనల్ బహుమతి పొందారు. ఇది పొందిన మొట్టమొదటి పోలిష్ రచయిత్రి ఈమె. కార్యకర్త కూడా అయిన తొకార్చుక్ పుస్తకాలన్నీ పోలండ్, చెక్ రిపబ్లిక్, జర్మనీల చరిత్రకు సంబంధించినవై, పౌరాణిక స్వరంతో వినిపిస్తాయి. 29 భాషల్లోకి అనువదించబడిన రచయిత్రి పుస్తకాలు ఆమె ఎంతోకాలం గడిపిన కోయెడ్జ్కో లోయ నేపథ్యంగా రాసినవి.

2018 నోబెల్ పురస్కారాన్ని కూడా ఓల్గాకు ప్రకటించడంతో ఒకే ఏడాది రెండు ప్రధాన అవార్డులు ఆమెను వరించినట్టయింది. అయితే బుకర్ బహుమతి ఒక పుస్తకానికి ఇచ్చేది కాగా నోబెల్ జీవితకాల కృషికి దక్కే గుర్తింపు.

2019 నోబెల్ పురస్కారాన్ని ఆస్ట్రియన్ రచయిత పీటర్ హ్యాంకీకి ప్రకటించినప్పుడే, 2018కి గానూ ఓల్గాకు ఇస్తున్నట్టు ప్రకటించారు. గతేడాది నోబెల్ కమిటీ మీద వచ్చిన వివాదాల నేపథ్యంలో అవార్డును ఎవరికీ ప్రకటించలేదు. ఆ వాయిదా పడిన అవార్డును ఇప్పుడు ప్రకటించారు.

◆ కృష్ణ వేణి

# పరిమళించిన స్నేహం

సప్తతి



**తూ**ర్పుగోదావరి జిల్లాలో రామచంద్రపురం పేరు చెప్పగానే వెంటనే గుర్తుకొచ్చేపేరు అదృష్ట దీపక్! అతడు స్నేహార్తితో అలమటించే వారికి 'ఒయాసిస్సు' లాంటివాడు! ఔషధ విలువలున్న 'కేక్టస్ మొక్క'లాంటి వాడు!

నేను రామచంద్రపురం హైస్కూల్లో చదివేటప్పుడు, అందరినీ ఇంటిపేర్లతోనే పిలుచుకునేవాళ్లం. ఒరేయ్ భావరాజు, గరికిపాటి, కర్రి, నల్లమిల్లి, గోగినేని, ముద్దంశెట్టి, కటకం... ఇలా ఉండేవి పిలుపులు. కానీ పేరుతో పిలిపించుకున్నవాడు ఒక్కడే – అదృష్ట దీపక్! దీపక్ అనీ, దీపూ అనీ పిలిచేవాళ్లం. మేం ఇద్దరమూ ఒకే బెంచీలో కూర్చునేవాళ్లం. యిద్దరికీ కొన్ని కామన్ టేస్టులుండేవి. ఖాళీ సమయాల్లో విద్యార్థులు అందరూ రకరకాల వ్యాపకాలతో ఉంటే, మేము పత్రికలతో, సినిమా కబుర్లతో కాలక్షేపం చేసేవాళ్లం. అప్పటికే పత్రికలలో వాడు రాసిన చిన్న చిన్న రచనలు అచ్చవుతూ ఉండేవి. ఏవేవో రాయాలని నాకు కూడా పెద్ద పెద్ద కోరికలు మొదలయ్యాయి. ఈ విషయంలో వాడే నాకు ఇన్‌స్పిరేషన్!

ఆ వయసులో మేము పంపిన చిట్టి కథల్నీ, హాస్యరచనల్నీ ప్రచురించి జోకర్, బుడుగు, పకపకలు, నవ్వులు పువ్వులు పత్రికలు మమ్మల్ని ఎంతో ప్రోత్సహించాయి. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి మాస్టారు కవులెందరినో తీసుకొచ్చి మా స్కూల్లో సాహిత్యసభలు ఏర్పాటు చేసేవారు. ఒకసారి విశ్వనాథ సత్యనారాయణ ప్రసంగం– మాకేమీ తలకెక్కలేదు. బయటకొచ్చేసి రాజగోపాల్ థియేటర్‌లో 'ఉయ్యాల జంపాల' సినిమాకు చెక్కేశాం. తరువాత ఒకసారి ఆరుద్రను తీసుకొచ్చారు. ఆ ఉపన్యాసం మాత్రం ఎంజాయ్ చేశాం.

దీపక్ మేనమామ కళాకారుడు. మా ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ నాయకుడు. ఆయన ప్రభావంతో దీపక్ బాలనటుడిగా రంగస్థలం మీద అనుభవం సంపాదించాడు. స్కూల్లో ప్రదర్శించే నాటికల్లో ప్రధాన పాత్రధారి మాత్రమే కాదు– దర్శకుడూ వాడే! గొల్లపూడి మారుతిరావు 'అనంతం' నాటికలో నాచేత వేషం వేయించి, నన్ను కూడా స్టేజ్ యాక్టర్ని చేశాడు.

హైస్కూల్ చదువు పూర్తయ్యాక వాడు రామచంద్రపురంలోనే ఉండిపోయాడు. నేను కాకినాడ, ఆ తరువాత హైదరాబాద్ వెళ్లిపోయాను. అయినా మా స్నేహం చెక్కుచెదరకుండా ఈరోజుకీ ఎంతో ఫ్రెష్‌గా ఉంది. దీపక్ కాలేజ్ లెక్చరర్ వృత్తిలో కొనసాగాడు. రాష్ట్ర ప్రభుత్వం వారి ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్నాడు. ఉద్యోగ జీవితంలో విద్యార్థులతో ఏర్పడిన అనుబంధాల ముందు ఈ అవార్డులు, రివార్డులు పనికి రావు అంటాడు.

ప్రవృత్తిలో దీపక్ సాహిత్యం, నాటకాల వైపు మళ్లితే, నేను మేజిక్, మనస్తత్వ విశ్లేషణారంగాల వైపు మళ్లాను. మా రంగాలలో కృషికి గుర్తింపుగా తెలుగు యూనివర్సిటీవారు హైదరాబాద్‌లో మా యిద్దరికీ ఒకే వేదిక మీద 'కీర్తి' పురస్కారాలు యిచ్చి సత్కరించడం మరపురాని అనుభవం!

దీపక్ సినిమా పాటలు రాస్తున్న విషయం నాకు చాలా రోజుల తరువాత ఇంకా చెప్పాలంటే 'మానవత్వం పరిమళించే/ మంచి మనసుకు స్వాగతం' ఆంధ్ర దేశాన్ని పరిమళ భరితం చేసినప్పుడు మాత్రమే ఓ జర్నలిస్టు మిత్రుడి ద్వారా తెలిసింది. ఫోన్ చేసి ''ఏరా నువ్వు సినిమాలకు పాటలు రాస్తున్నావా?'' అని అడిగితే కూల్‌గా అవును అన్నాడు. ''ఈసారైనా మొహమాటం విడిచిపెట్టి నలుగురినీ కలుసుకో!'' అంటే ''అవసరం లేదు'' అన్నాడు. ''వాళ్లు పిలిస్తే, వెళ్లి రాసి వస్తున్నా. అవకతవక పాటలు రాయడం నాకు యిష్టం లేదు. నాకు నచ్చితేనే రాస్తా. నచ్చకపోతే రాయనని చెప్పి వచ్చేస్తున్నా. అవకాశాల కోసం ఆఫీసుల చుట్టూ తిరిగే అలవాటు నాకు లేదు'' అన్నాడు. ఇదీ వాడి మనస్తత్వం!

కవిగా, వక్తగా, సినీగేయ రచయితగా, నాటకరంగ న్యాయనిర్ణేతగా, భాషాపరమైన గళ్లనుడికట్టు నిర్వాహకునిగా దీపక్‌కు మంచి గుర్తింపు ఉంది. ఎందరో అభిమానులున్నారు. (నేను ఎప్పుడూ అదృష్టదీపుడి అభిమానినే!) ఇన్ని ప్రత్యేకతలున్నా తన గురించి గొప్పలు చెప్పుకోడు. 'లో ప్రొఫైల్' మెయిన్‌టెయిన్ చేస్తాడు. డెబ్బై యేళ్ల నిత్య చైతన్య స్ఫూర్తి, మంచిమనసున్న స్నేహదీప్తి అదృష్ట దీపక్ పరిచయం నా జీవితంలో గొప్ప అదృష్టంగా భావిస్తా. సప్తతి నడుస్తున్న వేళ వాడికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

◆ బి.వి.పట్టాభిరామ్

## బ్నోత్ ప్రపంచం




## రారండోయ్

- రాణీశర్మ ఈమని, ఉణుదుర్తి సుధాకర్ పుస్తకం 'తథాగతుని అడుగుజాడలు' ఆవిష్కరణ అక్టోబర్ 26న సాయంత్రం 6 గంటలకు పబ్లిక్ లైబ్రరీ, ద్వారకానగర్, విశాఖపట్నంలో జరగనుంది. ఆవిష్కర్త: సి.ఆంజనేయరెడ్డి. అధ్యక్షత: కె.తిమ్మారెడ్డి. వక్త: సి.ప్రజ్ఞ. నిర్వహణ: హైదరాబాద్ బుక్ ట్రస్ట్.
- కుడికాల వంశీధర్ 'నానీల వసంతం' ఆవిష్కరణ నవంబర్ 3న సాయంత్రం 6 గంటలకు శ్రీ త్యాగరాయ గానసభలో జరగనుంది. ఆవిష్కర్త: ఎన్.గోపి. నిర్వహణ: తేజ ఆర్ట్ క్రియేషన్స్.
- నారంశెట్టి బాలసాహిత్య పీఠం వారి 2019 బాలసాహిత్య పురస్కారాలను డి.కె.చదువుల బాబు, పైడిమర్రి రామకృష్ణకు ప్రదానం చేయనున్నారు. నవంబర్ 14న పార్వతీపురంలో జరిగే సభలో ప్రదానం ఉంటుంది. నిర్వహణ: నారంశెట్టి ఉమామహేశ్వరరావు.

# ఇస్మాయిల్ నిశ్శబ్దం

సాహిత్య మరమరాలు

16 ఏప్రిల్ 1992. ఆ రోజు సాయంకాలం హైదరాబాదులో తెలుగు విశ్వవిద్యాలయం అనువాద కవితా గోష్ఠి (వర్తమాన భారతీయ కవిత) నిర్వహించింది. అందులో ఇస్మాయిల్, మోహనప్రసాద్, స్మైల్ ప్రభృతులతో పాటు నేను కూడా పాల్గొన్నాను. ఆ రోజే ద్వారకాహోటల్ గదిలో మరో గోష్ఠి జరిగింది. అందులో ఇస్మాయిల్, మో, శివారెడ్డి, స్మైల్, ఆశారాజు, శిఖామణి – ఇంకా చాలామందే ఉన్నారు. గోష్ఠి సందడి సందడిగా సాగుతున్న సమయంలో మోహనప్రసాద్ 'ఆఫ్రికన్ కవిత్వం అనువాదం చెయ్యాలంటే ఆఫ్రికన్ జీవితం తెలిసివుండాలి. నువ్వెలా చేస్తావు? ఆఫ్రికన్ జీవితం నీకేం తెలుసు? నాకు తెలుసు. నేను నైజీరియాలో ఉండివచ్చాను' అని శివారెడ్డితో వాదనకు దిగారు. శివారెడ్డి 'ప్రజాసాహితి' పత్రికలో ఆఫ్రికన్ కవిత్వాన్ని అనువదించారు కదా! 'ఆఫ్రికన్ కవిత్వాన్ని అనువదించడానికి ఆఫ్రికాలో ఉండిరానవసరం లేదు' అన్నారు. మో ఒక పట్టాన వదిలిపెట్టలేదు. ఇస్మాయిల్ దగ్గరికి వచ్చి 'మీరు చెప్పండి' అని అడిగారు. ఇస్మాయిల్ ఎదురుగా కూచునివున్న నేను ఆయన ఏం చెబుతారా అని ఆసక్తిగా చూశాను. కానీ ఆయన ఏమీ మాట్లాడలేదు. ఒక చిరునవ్వు నవ్వారు. మధ్యగోష్ఠిలో కూడా ఇస్మాయిల్ అంత సంయమనంతో ప్రశాంతంగా ఉండటం చూసి ఆశ్చర్యపోయాను!



◆ గాలి నాసరరెడ్డి

## అలనాటి వ్యాసం

# మన సారథి, మన సచివుడు

**మన సారథి, మన సచివుడు**
**మన వియ్యము, మన సఖుండు, మన బాంధవుడున్**
**మన విభుడు, గురువు, దేవర**
**మనలను దిగనాడి చనియె మనుజాధీశా!**

ద్వారక నుంచి తిరిగివచ్చిన అర్జునుడు పెన్నిధిని కోల్పోయిన పేదవలె నిట్టూరిస్తూ అన్నతో అన్న పద్యమిది. కృష్ణుడు పాండవులను నడిపించినవాడు. ఉపాయాలు ఉపదేశించినవాడు, వియ్యమందుకున్నవాడు. నేస్తం నెరిపినవాడు. చుట్టరికం కలిసినవాడు. పైగా వారికి గురుడు. అన్నింటినీ మించి దేవునిలాంటివాడు. అంతటి ఆత్మహితుడు అస్తమించిన వార్తను ఎంతో కరుణావిలంగా అందించిన పద్యమిది. అయితే కాలం గడిచినకొద్దీ ఈ పద్యం వేనోళ్లతో వికసించింది. కృష్ణ పాండవుల పరిధిని దాటి సమస్త మానవుల దైనందిన వ్యవహారంలోకి ప్రవేశించింది. మిత్రుడో, ఆప్తుడో, బంధువో, ఒక సంఘ సేవకుడో, ఒక దేశనాయకుడో పరమపదించినపుడు అప్రయత్నంగా ఈ పద్యం తెలుగువాని గుండెలో మెదులుతుంది. కొండంత దుఃఖానికి అద్దంపట్టి చూపుతుంది. ఒక చిన్న కందంలో ఎన్నెన్ని బంధాలను ముడివేసినాడు పోతన్న! అందుకే తెలుగన్నల నాల్కలపై కలకాలం నిలిచిపోతుంది.

(బమ్మెర పోతన భాగవత పద్యాలను డాక్టర్ సి.నారాయణరెడ్డి వ్యాఖ్యానించిన 'మందార మకరందాలు' లోంచి; ప్రచురణ: తితిదే)

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
సోమవారం ॥ 21-10-2019



ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మంత్రి సుచరితతో మహిళా డీఎస్పీలు. (ఒక డీఎస్పీ ఈ పాసింగ్ అవుట్ పరేడ్‌కు హాజరు కాలేకపోయారు)

ధన్‌తేరస్ ప్రాజెక్ట్!

# ఐరనే ఆభరణం


ఐరన్ పుష్కలంగా దొరికే ఆహారపదార్థాన్ని తింటున్న మహిళను చూపిస్తూ.. 'ఈ ధన్‌తేరస్‌కు ఈ మహిళ బంగారం కన్నా ఎంతో విలువైన దాన్ని పొందుతోంది' అనే క్యాప్షన్‌తో తయారైన యాడ్ వినూత్నంగా, సందేశాత్మకంగా ఉంది.

మన దేశంలో స్త్రీలకు కావాల్సింది బంగారం కాదు.. ఇనుము! స్త్రీధనం కింద బంగారాన్ని కాదు ఐరన్‌ను అందించాలి. కాబట్టి ఈ ధన్‌తేరస్‌కి.. అంటే ధనత్రయోదశికి బంగారు నగల మీద కాక ఒంట్లోని ఐరన్ మీద దృష్టిపెట్టండి అంటూ 'ప్రాజెక్ట్ స్త్రీధన్' పేరుతో పౌష్టికాహారం, సుస్థిర ఆరోగ్యవంతమైన జీవనం గురించి పనిచేసే డీఎస్ఎమ్ అనే సంస్థ ఓ ప్రచారం ప్రారంభించింది.

సాధారణంగా ధన్‌తేరస్‌కు బంగారు ఆభరణాల దుకాణాలు విడుదల చేసే కమర్షియల్స్‌కు భిన్నంగా ఆ సంస్థ తన యాడ్స్‌ను తయారు చేసింది. ఐరన్ పుష్కలంగా దొరికే ఆహారపదార్థాన్ని తింటున్న మహిళను చూపిస్తూ 'ఈ ధన్‌తేరస్‌కు ఈ మహిళ బంగారం కన్నా ఎంతో విలువైన దాన్ని పొందుతోంది' అనే క్యాప్షన్‌తో ఒక యాడ్‌ను తయారు చేసింది. అలాగే.. చెవికి జూకాలు, మెడలో నగలు, చేతులకు గాజులు, నడుముకు వడ్డాణం, కాళ్లకు పట్టీలు పెట్టుకొని నడుస్తున్న యువతిని చూపిస్తూ.. ఇదే ఐరన్ అయితే మీ నరనరాల్లో ప్రవహిస్తుంది ఆరోగ్యంతో మిమ్మల్ని మెరిపిస్తుంది. అంటూ ఇంకో యాడ్‌ను రూపొందించింది. 'ఐరన్ తీసుకోండి' అంటూ ఇంకొన్ని యాడ్స్‌ను తయారు చేసి గ్రామీణ, పట్టణ వాసులను చైతన్యపరుస్తోంది. ఈ ప్రచారంలో డీఎస్ఎమ్ తన లాభాపేక్షను చూసుకుంటోందా వగైరా అనుమానాలను పక్కనపెడదాం. మన దేశంలో మహిళలకు ఐరన్ కావాల్సిన అవసరాన్ని గుర్తిద్దాం. 2018 జనవరిలో నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ -4) విడుదల చేసిన గణాంకాల ప్రకారం మన దేశంలో దాదాపు యాభై మూడు శాతం మహిళలు రక్తహీనతతో బాధపడ్తున్నారు. కాబట్టి ఈ ధన్‌తేరస్‌నే ఆరోగ్యసంరక్షణకు శుభారంభంగా భావించి ప్రతిరోజు ఆహారంలో విధిగా ఐరన్ ఉండేలా చూసుకోండి. స్త్రీ ఆరోగ్యమే దేశానికి మహాభాగ్యం.


# ఉమెన్ గ్రూప్ 1

**మీ సంకల్ప బలానికి సెల్యూట్**
**మీ సేవా భావానికి సెల్యూట్**
**మీ దీక్షా దక్షతలకు సెల్యూట్**
**మీ నెంబర్ వన్ గ్రూప్‌కు సెల్యూట్**

నవ్యాంధ్ర తొలి డీఎస్పీ బ్యాచ్‌లోని 25 మందిలో 12 మంది మహిళలు చోటు దక్కించుకుని కొత్త చరిత్ర సృష్టించిన సందర్భం ఇది. వీరంతా ఇప్పుడు విధులకు సిద్ధం అవుతున్నారు. సమాజానికి రక్షణ కవచంగా యూనిఫామ్ ధరించబోతున్నారు. చట్టం, న్యాయం, ధర్మానికి ప్రతీక అయిన మూడు సింహాలతో కలిసి కర్తవ్య నిర్వహణ నాలుగో సింహంగా కొత్త బాధ్యతలు చేపట్టనున్నారు. కరకు ఖాకీ వృత్తి మగవాళ్లకే పరిమితమన్న వాదనకు చెల్లుచీటి రాస్తూ 'మేము సైతం' అంటూ సత్తా చాటేందుకు సంసిద్ధులయ్యారు. ఉన్నత చదువులతో ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేసిన ఈ మహిళా డీఎస్పీలు మహిళావనికే ఆదర్శం.

ఇంజనీరింగ్, పీజీ, డిగ్రీ చదువులు పూర్తి చేసిన ఈ పన్నెండు మందీ ఏదో బతుకుదెరువు కోసం ఉద్యోగం చేయాలనే నిర్ణయానికి పరిమితం కాలేదు. జాతీయ స్థాయిలో గుర్తింపు కలిగిన సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్షలకు బరిలో దిగారు. ఢిల్లీ, హైదరాబాద్‌లలోని ఐఏఎస్ అకాడమీల్లో రేయింబవళ్లు విరామమెరుగకుండా శ్రమించారు. సివిల్స్ పరీక్షలకు సిద్ధమైన వీరంతా.. అంతకంటే ముందుగా వచ్చిన గ్రూప్-1 పరీక్ష రాశారు. విశేషం ఏమిటంటే ఉన్నతమైన సివిల్స్‌కు కోచింగ్ తీసుకున్న వారు గ్రూప్-1 పోటీ పరీక్షలకు ప్రత్యేకంగా ఎటువంటి కోచింగూ లేకుండానే నెగ్గుకొచ్చారు. సివిల్స్ కొట్టాలనుకుని గ్రూప్-1కు ఎంపికై డీఎస్పీ పోస్టును సాధించిన వారిలో కొందరు మాత్రం ఏమైనా సివిల్స్‌కు వెళ్తామంటున్నారు. పోలీసు ఉద్యోగంతో సమాజానికి నేరుగా సేవ చేసే భాగ్యం దక్కిందని మరికొందరు ఇక్కడికే పరిమితమవుతున్నారు. **వీరిలో కొందరిని సాక్షి పలకరించింది. వారి మనోభావాలను తెలుసుకుంది.**

## యూనిఫాం చూసుకుని గర్వపడుతున్నా



ఖాకీ యూనిఫాం వేసుకోవడానికి చాలా గర్వంగా ఫీలవుతున్నాను. నేను బీటెక్ చదివాను. గ్రూప్-1లో డీఎస్పీగా ఎంపిక కావడాన్ని ఎప్పటికీ మరిచిపోలేను. నా తల్లిదండ్రులు లలిత, ఎస్ఏ బషీర్, నా భర్త షఫీ, నా మావయ్య వన్నూర్ సాహెబ్ (రిటైర్డ్ ఏఎస్పీ) అందించిన ప్రోత్సాహం మరువలేను. వృత్తిపరంగా ప్రతీ రోజు నేను వేసుకున్న ఖాకీ యూనిఫాంకు న్యాయం చేసేలా పని చేస్తాను. ఒక పోలీసుగా గర్వంగా ఫీలయ్యేలా సమాజానికి సేవ చేస్తాను. వ్యక్తిగతంగా మంచి కూతురు, మంచి తల్లి అన్పించుకునేలా ఉంటాను.

**–షేక్ షాను,**
రేణిగుంట, చిత్తూరు జిల్లా

## సివిల్ సర్వీసెస్ నా టార్గెట్



డీఎస్పీగా పని చేస్తూ సివిల్ సర్వీసెస్‌లో రాణించాలన్నదే నా ముందున్న లక్ష్యం. నేను తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేయడంతోపాటు గోల్డ్‌మెడల్ సాధించాను. స్టేట్ బ్యాంక్ ఇఫ్ ఇండియా, ఏపీ జెన్‌కోలో ఉద్యోగం చేశాను. సివిల్స్ సాధించాలనే నా పట్టుదలను చూసి నా తల్లిదండ్రులు ఎన్.చంద్రశేఖర్, బీవీ ఉమ, నా భర్త పీవీ రాఘవ నన్ను ప్రోత్సహించారు. నాకు రెండేళ్ల కూతురు హంసిక ఉంది. ఒకవైపు కుటుంబాన్ని చూసుకుంటూ మరోవైపు డీఎస్పీ విధులు నిర్వర్తిస్తూ, అదే సమయంలో సివిల్స్ పై దృష్టి పెట్టి సాధిస్తాను.

**– ఎన్.రమ్య,** తిరుపతి

## బాధితులకు న్యాయం జరిగేలా పనిచేస్తాను



అనంతపురం జేఎన్‌టీయూలో కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాను. మా నాన్న ఎస్ఎం రమేష్‌చంద్ర రిటైర్డ్ డీఈఈ. అమ్మ ఎం.అనుపమ అనంతపురం కలెక్టరేట్‌లో తహసీల్దార్‌గా పనిచేస్తోంది. ఒక సోదరి కోటచెరువు మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తోంది. మరో సోదరి సుస్మిత ఫ్యాషన్ మేనేజ్‌మెంట్ పూర్తి చేసింది. డీఎస్పీగా విధుల్లో చేరిన నేను ఒక పోలీసుగా బాధితులకు న్యాయం చేసేలా పనిచేస్తాను. ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై ప్రధానంగా దృష్టి సారిస్తాను.

**– ఎస్.రమేష్ చంద్ర హర్షిత,** అనంతపురం

## మా మండలంలో నాదే రికార్డు



మా నాన్న గురుప్రసాద్ సాధారణ రైతు. మా అమ్మ లక్ష్మీదేవి గృహిణి. ఆడపిల్లనైనా నన్ను ఎంతో కష్టపడి చదివించారు. ఇంజనీరింగ్ పూర్తి చేసి 2016-2018 మధ్య భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం చేశాను. సివిల్స్ సాధించాలనే తపనతో హైదరాబాద్ వెళ్లి కోచింగ్ తీసుకున్నాను. గ్రూప్-1 సాధించి డీఎస్పీగా ఎంపికయ్యాను. మా ఓబులావారి మండలం మొత్తం మీద నేరుగా(డైరెక్ట్) గ్రూప్-1 సాధించిన ఘనత నాదే కావడం గర్వంగా ఉంది. ప్రజల సమస్యలు కళ్లారా చూసి వారికి న్యాయం చేసే అవకాశం ఉన్న పోలీసు అధికారిగా నా బాధ్యతను సక్రమంగా నిర్వహించాలనే ఆశయంతో ముందుకు సాగుతాను.

**– ఎం.శ్రీలత,** ఇందిరానగర్, వైఎస్సార్ కడప జిల్లా

## మా నాన్న జడ్జి కావడంతో..



నాకు పోలీస్ కావాలని ఉండేది మా నాన్న గాంధీ.. డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి (హైదరాబాద్) కావడంతో ఆయన ప్రభావం నాపై ఉండేది. ఆయన నిత్యం కేసులు, విచారణలో బిజీగా ఉండటం చూసి నేను పోలీసు కావాలని అనుకునేదాన్ని. బీటెక్ పూర్తి చేసి, ఖాళీగా ఉండటం ఎందుకని ఐడియా సెల్యులార్ సర్వీసెస్ (హైదరాబాద్)లో కొంతకాలం జాబ్ చేశాను. సివిల్స్ సాధించాలని ఇటీవల ఢిల్లీ వెళ్లి కోచింగ్ తీసుకున్నాను. ఈ మధ్యలో గ్రూప్-1 పరీక్ష రాసి డీఎస్పీ సాధించాను. పోలీసు ఉద్యోగం అంటే ఇష్టపడే నేను నేరుగా ప్రజలకు సేవ చేసే అవకాశం ఉన్న ఈ వృత్తిని వదులుకోను. అవకాశం ఉన్నంత మేరకు ప్రజలకు పోలీసు సేవలను అందించాలన్నదే నా లక్ష్యం. మహిళలు, చిన్నారులు, అట్టడుగు వర్గాల రక్షణ కోసం పనిచేస్తాను.

**– ఎం.శ్రావణి,** కొవ్వూరు, పశ్చిమగోదావరి

## నాన్నే నాకు స్ఫూర్తి



తిరుపతిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న శ్యామ్ సుందరం మా నాన్న. పోలీసుగా ఆయనను దగ్గర నుంచి చూసిన నాకు పోలీసు కావాలనే లక్ష్యం ఉండేది. నేను డీఎస్పీగా ఎంపిక కావడానికి నాన్నే నాకు స్ఫూర్తిగా నిలిచారు. అమ్మ సునీత వినోదిని గృహిణిగా ఉంటూ నన్ను చదువులో ప్రోత్సహించేది. బీటెక్‌లో నేను గోల్డ్‌మెడల్ సాధించాను. సివిల్స్ సర్వీసెస్‌ను టార్గెట్‌గా పెట్టుకుని హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకున్నాను. ఈలోపు గ్రూప్-1 రాసి డీఎస్పీ పోస్టు సాధించాను. ఇది నాకు చాలా సంతోషంగా ఉంది. అయినా ఇక్కడితో ఆగిపోను. డీఎస్పీగా పనిచేస్తూ సివిల్స్ కొడతాను. ఐఏఎస్, ఐపీఎస్‌లలో ఏదో ఒకటి సాధిస్తాను. పాజిటివ్‌గా పనిచేస్తే ప్రజలకు మరింత చేరువ అయ్యే అవకాశం పోలీసులకే ఉంది. నేరుగా ప్రజలకు సేవ చేసే అవకాశం ఉన్న పోలీసు వృత్తి నాకు చాలా ఇష్టం.

**– ఇ.జెస్సీ ప్రశాంతి,** తిరుపతి

## ప్రభుత్వ సర్వీసులో చేరాలన్న కోరిక నెరవేరింది



ప్రభుత్వ సర్వీసులో చేరి ప్రజలకు సేవ చేయాలన్న నా లక్ష్యం నెరవేరింది. నేను డీఎస్పీ పోస్టు సాధించడంలో అమ్మా, నాన్న ప్రోత్సాహం ఎంతో ఉంది. గుంటూరు జిల్లా చిలకలూరిపేట సొంత ప్రాంతమైనప్పటికీ అమ్మా, నాన్నలకు ఉద్యోగరీత్యా తిరుపతిలో ఉంటున్నాం. నాన్న డాక్టర్ ఎస్.కిషోర్ శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ(తిరుపతి)లో ప్రొఫెసర్. అమ్మ కేఎం రోజ్‌మండ్ నెల్లూరులో డిప్యూటీ కలెక్టర్. వారి స్ఫూర్తితో ప్రభుత్వ ఉద్యోగం చేయాలనే లక్ష్యంతో పట్టుదలగా సాధించాను.

**– ఎస్.భవ్య కిషోర్,** చిలకలూరిపేట, గుంటూరు జిల్లా

## డీఎస్పీగా ఎక్కువ సేవలు అందించాలనుకున్నా..



మా నాన్న ధర్మరాయ్ ఆంధ్రా యూనివర్సిటీలో ఫార్మసిస్టు. మా అమ్మ అప్పల నర్సమ్మ మున్సిపల్ స్కూల్ టీచర్. వారి ప్రోత్సాహంతోనే నేను రాణించాను. నేను ఎంబీబీఎస్ పూర్తి చేశాను. అయితే ప్రజలకు విస్తృతంగా అందుబాటులో ఉండటానికి డీఎస్పీ అవడం అవసరం అనుకున్నాను. పోలీసు అధికారిగా వీలైనంత ఎక్కువ మంది ప్రజలకు మేలైన సేవలు చేయాలన్నది నా సంకల్పం.

**–కె.స్రవంతి రాయ్,** తుర్రైగూడ, అరకు మండలం, విశాఖ

**– ఇరింకి ఉమామహేశ్వరరావు,** సాక్షి, అమరావతి
ఫొటోలు: పి. విజయ్ కృష్ణ

బాడీటిప్స్ / స్నానం

# నీటితో మసాజ్




**మనిషిని ఆరోగ్యంగా ఉంచే ప్రధానమైన దినచర్య స్నానం. రోజంతా వేడి, కాలుష్యం గల వాతావరణంలో ఉండే వాళ్లు రోజూ రెండుసార్లు స్నానం చేయడం తప్పనిసరి. అయితే స్నానం అంటే బకెట్‌లో ఉన్న నీటిని ఒంటి మీద కుమ్మరించుకోవడం కాదు. దేహమంతటినీ శుభ్రపరుస్తూ మర్దన చేయడమే స్నానం. మంచి స్నానం అంటే ఏమిటో తెలుసుకుందాం.**

- స్నానానికి ఉపయోగించే నీరు మరీ వేడిగా ఉండకూడదు, చల్లగానూ ఉండకూడదు. గోరువెచ్చగా లేదా ఒంటికి హాయి కలిగించేటంత వేడి ఉండాలి. చర్మం మీద ఉండే సెబేషియస్ గ్రంథులు ఉత్తేజితమై చర్మసంరక్షణకు అవసరమైన నూనెలను స్రవించడానికి తగినంత వేడి మాత్రమే ఉండాలి. నీటి వేడి మరీ ఎక్కువైనా, మరీ తక్కువైనా చర్మం పొడిబారిపోతుంది.
- ఎక్స్‌ఫోలియేషన్ కోసం స్నానం చేసేటప్పుడు స్క్రబ్ వాడాలి. అయితే రోజూ స్క్రబ్ ఉపయోగిస్తే చర్మకణాలు దెబ్బతింటాయి కాబట్టి స్క్రబ్ వారానికి రెండుసార్లకు మించకూడదు. ఇందుకోసం మార్కెట్‌లో దొరికే రెడీమేడ్ స్క్రబ్‌లను వాడవచ్చు లేదా గరుకుగా ఉన్న సున్నిపిండిని వాడవచ్చు.
- వారంలో రెండుసార్లు ఒంటికి నూనె లేదా మీగడ రాసి మర్దన చేసి స్నానం చేయాలి. తగిన సమయం లేకపోతే కనీసం ఒక్కసారయినా అలా చేయాలి.
- ఒంటిని రుద్దేటప్పుడు మురికి త్వరగా వదలడం కోసం గోళ్లతో గీకకూడదు. అలాగే ఒంటికి సబ్బు పట్టించిన తరవాత వలయాకారపు స్ట్రోక్స్‌తో మర్దన చేస్తూ రుద్దాలి. ఇలా చేస్తే... స్నానంతో దేహం సేదదీరుతుంది. రోజంతా ఉత్సాహంగా ఉంటుంది.


హార్డ్ వర్క్

# చిత్రాల శివుడు

**అతనొక అజ్ఞాత కళాకారుడు. స్పష్టంగా మాట్లాడలేడు కాని అందమైన బొమ్మలకు, అనూహ్యమైన ఘటనలకు ప్రాణం పోయగలడు. గడపలకు, గుమ్మాలకు రంగులు వేయడమైతే పుట్టుకతో వచ్చిన విద్య. వాటర్ కలర్స్, ఆయిల్ పెయింట్స్‌తో ప్రముఖ రాజకీయ నాయకుల బొమ్మలను కూడా సొంతంగానే వేస్తున్నాడు. తన బొమ్మలకు గుర్తింపు కావాలని మూగగానే అభ్యర్థిస్తున్నాడు.**






శివకుమార్ వేసే బొమ్మలలో ఒక ఏక సూత్రత ఉంటుంది. శివుడి తల మీద చంద్రుడు ఉన్నట్లుగా తన బొమ్మలలో పైభాగంలో పెద్ద చందమామను చిత్రీకరిస్తాడు. తన పేరు శివకుమార్ కాబట్టి తన తల మీద చంద్రుడు ఉన్నట్లు భావన చేస్తుంటాడు.

గాంధీని గాడ్సే షూట్ చేశాడు. ఇందిరా గాంధీని సెక్యూరిటీ గార్డులే పొట్టన పెట్టుకున్నారు. రాజశేఖర రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. రాజీవ్ గాంధీని మానవ బాంబు హతమార్చింది, సంజయ్ గాంధీ హెలికాప్టర్ ప్రమాదంలో మరణించాడు. వీటిని తన రంగులలో చిత్రీకరించాడు నాగర్కర్నూలు జిల్లా తెల్కపల్లి మండల కేంద్రానికి చెందిన ఎడ్ల శివకుమార్. రాజీవ్‌గాంధీ, సోనియా గాంధీ జంటను చిత్రీకరించి, సోనియాను అచ్చతెలుగు ఆడపడుచులా నగలతో అలంకరించి, తన సృజనను నిరూపించుకున్నాడు. ఐదో తరగతి వరకు మాత్రమే చదువుకున్న శివకుమార్, పది సంవత్సరాల వయస్సు వరకు బాగానే మాట్లాడేవాడు. ''ఏం జరిగిందో ఏమో తెలియదుకాని, పదో ఏట నుంచి మాట పోయింది'' అంటారు శివకుమార్ తల్లి సాయిలమ్మ. బుచ్చన్న సాయిలమ్మ దంపతులకు మొత్తం ఐదుగురు సంతానం. శివకుమార్ రెండో సంతానం. ఒక అన్న, ఒక తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. అనారోగ్యం కారణంగా తండ్రి బుచ్చన్న పది సంవత్సరాల క్రితం మరణించాడు. కుటుంబాన్ని తల్లి ఒంటి చేత్తో పోషించవలసి వచ్చింది. కూరగాయలు అమ్ముతూ పిల్లల్ని పెంచుకొస్తోంది. అన్న మల్లేశ్, చెల్లెలు విజయలక్ష్మి ఇద్దరూ మానసికంగా ఎదగలేదు. ''నాకు వచ్చిన విద్య బొమ్మలు వేయడం మాత్రమే. మా కుటుంబానికి అండగా ఉండాలంటే, నేను మరింత కష్టపడాలి. ఎవరి సహకారమూ లేకుండానే తలుపులకు రంగులు, గడపలకు ముగ్గులు వేసి, ఎంతో కొంత సంపాదిస్తున్నాను. అప్పుడప్పుడు ముగ్గుల పోటీలో పాల్గొని, చిన్న చిన్న బహుమతులు గెలుచుకున్నాను. ఇప్పుడు రాజకీయ నాయకుల బొమ్మలు వేస్తున్నాను'' అని చెప్పారు 35 ఏళ్ల శివకుమార్. తమ్ముడు సంజయ్ డిగ్రీ వరకు చదివినా ఉద్యోగం రాకపోవడంతో ఆ కుటుంబం ఒక పాత ఇంట్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. తన బొమ్మలను గుర్తించి ఎవరైనా ఆర్థికంగా సహాయం చేస్తే బాగుండునని శివకుమార్ ఆశ.

**– వైజయంతి పురాణపండ**
ఫొటోలు: గోరటి శ్రీరాములు, సాక్షి, తెలకపల్లి

చెట్టు నీడ

# బద్ధ విరోధులు



అదో చిన్న సామంత రాజ్యం. తన రాజ్యంలో జరిగే తప్పులను, సమస్యలను తెలుసుకొని తనకు తెలియజేయడం కోసం రాజు తగిన వ్యక్తుల కోసం అన్వేషించాడు. అందుకోసం సత్యం, శివం అనే ఇద్దరు ప్రాణ స్నేహితులను రాజు నియమించాడు. అయితే రాజు ఊహించిన దానికి భిన్నంగా తయారైంది. వాళ్లు తోడుదొంగల్లా తయారయ్యారు. ఇష్టమొచ్చినట్లు చేయసాగారు. సత్యం విషయాలు తెలుసుకొని రావడానికి వెళ్లినప్పుడు శివం విశ్రాంతి తీసుకునే వాడు. శివం పని మీద వెళ్లినప్పుడు సత్యం హాయిగా నిద్రపోయేవాడు.

ఇద్దరూ రాజు దగ్గరికి వెళ్లినప్పుడు సత్యం చెప్పింది అక్షరాల నిజం అని శివం, శివం చెప్పింది వంద శాతం వాస్తవం అని సత్యం, ఒకరికొకరు పొగుడుకునేవారు. దాంతో రాజుకు వాస్తవం తెలియకుండా పోయి, అనేక అనర్థాలు జరుగుతుండేవి.

రాజు బాగా ఆలోచించి వాళ్లిద్దరినీ పనిలో నుండి తొలగించి పరస్పరం బద్ధ విరోధులైన శేషాద్రి, గరుడాద్రి అనే ఇద్దరు వ్యక్తులను పనిలో నియమించాడు. శేషాద్రికి, గరుడాద్రికి ఒక్క క్షణం సరిపడేది కాదు.

శేషాద్రి ఏదైనా సమాచారం తెలుసుకొని వస్తే నిజమో కాదో అని గరుడాద్రి వెనకనే వెళ్లి తెలుసుకుని వచ్చేవాడు. దాంతో శేషాద్రి కూడా అలాగే చేసేవాడు. ఒకడు ఏదైనా అబద్ధం చెప్పబోతే రెండోవాడు ''మహారాజా! అతను చెప్పింది తప్పు. వాస్తవం నేను చెబుతాను'' అంటూ సరిదిద్దేవాడు. ఆ విధంగా రాజుకు వాస్తవాలు తెలుస్తుండడంతో రాజ్యం లోప రహితం అయింది.

epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
సోమవారం
21-10-2019



● హృతిక్ రోషన్

## సెవన్‌కి సై

**బా**లీవుడ్ హ్యాండ్‌సమ్ హీరో హృతిక్ రోషన్ తర్వాతి చిత్రంపై ఓ స్పష్టత వచ్చినట్లు తెలుస్తోంది. 1982లో అమితాబ్ బచ్చన్, హేమమాలిని నటించిన చిత్రం 'సత్తే పే సత్తా'. ఈ సినిమా తాజా రీమేక్‌లో హీరోగా నటించడానికి సై అన్నారట హృతిక్. ఫర్హాఖాన్ దర్శకత్వంలో దర్శక–నిర్మాత రోహిత్ శెట్టి ఈ సినిమాను నిర్మిస్తున్నారని బాలీవుడ్ సమాచారం. ఈ చిత్రానికి 'సెవన్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారట. హృతిక్ సరసన అనుష్కాశర్మ నటించనున్నారని బీటౌన్ టాక్. గతేడాది డిసెంబరులో విడుదలైన 'జీరో' తర్వాత అనుష్కాశర్మ సైన్ చేసిన చిత్రం ఇదేనని బాలీవుడ్‌లో చెప్పుకుంటున్నారు.



● నవాజుద్దీన్ సిద్ధిఖీ

## వెల్‌కమ్ టు టాలీవుడ్?

**బా**లీవుడ్ విలక్షణ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ టాలీవుడ్‌కి ఎంట్రీ ఇవ్వబోతున్నారట. వెంకటేశ్ హీరోగా 'పెళ్ళిచూపులు' ఫేమ్ తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో ఓ స్పోర్ట్స్ మూవీ తెరకెక్కనుందని వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో నవాజుద్దీన్ సిద్ధిఖీ ఓ కీలక పాత్ర చేయబోతున్నారని టాక్. హార్స్ రైడింగ్ నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉండబోతుండగా, వెంకటేశ్ హార్స్ రైడర్‌గా కనిపిస్తారట. ఈ సంగతి ఇలా ఉంచితే... ఈ ఏడాది జనవరిలో విడుదలైన రజనీకాంత్ తమిళ చిత్రం 'పేట్టా'తో (తెలుగులో 'పేట') తొలిసారి దక్షిణాదిన నటించారు నవాజుద్దీన్ సిద్ధిఖీ.



● అజిత్

## పోలీస్ పవర్

**అ**జిత్ హీరోగా హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాకు 'వలిమై' (తెలుగులో 'బలం' అని అర్థం) అనే టైటిల్ ఖరారు చేశారు. అజిత్ కెరీర్‌లో ఇది 60వ చిత్రం. జీ స్టూడియోస్‌తో కలిసి బోనీ కపూర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవం చెన్నైలో జరిగింది. ఇందులో అజిత్ పోలీసాఫీసర్ పాత్రలో నటించబోతున్నారని సమాచారం.

## మొదటి ప్రేమ



● కావ్య, చింటు

**చిం**టు కంచర్ల, కావ్యా కీర్తీ, అదిత్య రెడ్డి, కె.ధనుష్ బాబు, సోఫియా ప్రధాన పాత్రల్లో ముస్కు రాంరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'నాకిదే ఫస్ట్ టైమ్'. శ్రీవల్లిక ప్రొడక్షన్స్ పతాకంపై కురుపాల విజయ్ కుమార్ నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్ పూర్తయింది. విజయ్ కుమార్ మాట్లాడుతూ– ''ఇదో చక్కటి ప్రేమ కథ. సస్పెన్స్, థ్రిల్లర్ అంశాలూ ఉన్నాయి. మా సినిమాలో ప్రతి ఫ్రేమ్ చాలా రిచ్‌గా ఉంటుంది. ప్రేక్షకులను థ్రిల్ చేసే వాణిజ్య అంశాలన్నీ ఉన్నాయి. శ్రావణ భార్గవి పాడిన పాట హైలెట్‌గా ఉంటుంది. రెండో షెడ్యూల్‌లో భాగంగా గోవా, అరకులలో పాటల చిత్రీకరణ జరపనున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ కూరాకుల, కెమెరా:గోపి, లైన్ ప్రొడ్యూసర్: అగస్టీన్.




● చిత్రప్రదర్శన తర్వాత సరదాగా ఫోటో దిగిన 'బాహుబలి' బృందం

## భళా బాహుబలి

**'బా**హుబలి' చిత్రం భారతీయ సినిమాలో పెను మార్పులు తీసుకొచ్చింది. మార్కెట్‌ని విస్తృత పరిచింది.. హద్దుల్ని బద్దలు కొట్టేసింది. ప్రపంచ వ్యాప్త సినీ ప్రేక్షకులందరితో 'భళా బాహుబలి' అనిపించుకుంది. ఇప్పుడు లండన్‌లోనూ 'భళా బాహుబలి' అంటూ వినిపిస్తోంది. లండన్ ఆల్బర్ట్ హాల్‌లో 'బాహుబలి: 1' చిత్రాన్ని హిందీలో ప్రదర్శించారు. 148 ఏళ్ల ఆల్బర్ట్ హాల్ చరిత్రలో ఇంగ్లీష్ భాషలో కాకుండా ఇతర భాషలో ఓ సినిమా ప్రదర్శితం కావడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ సినిమా ప్రదర్శన అనంతరం ప్రేక్షకులందరూ నిల్చొని చప్పట్లు కొట్టారని సమాచారం. ఈ ప్రదర్శనలో రాజమౌళి, ప్రభాస్, రానా, అనుష్క, కీరవాణి, నిర్మాత శోభు యార్లగడ్డ పాల్గొన్నారు. పంచెకట్టు వేషధారణతో రాజమౌళి స్క్రీనింగ్‌కి హాజరయ్యారు.



● అబ్బూరి రవి, అడివి సాయికిరణ్, ఆది సాయికుమార్, కార్తీక్‌రాజు

## ప్రతిరోజు గర్వపడుతూ ఈ సినిమా చేశాను

**– ఆది సాయికుమార్**

**వి**నాయకుడు టాకీస్ పతాకంపై ఆది సాయికుమార్ హీరోగా, రచయిత అబ్బూరి రవి విలన్‌గా, సాయికిరణ్ అడివి దర్శకత్వం వహించిన చిత్రం 'ఆపరేషన్ గోల్డ్‌ఫిష్'. శుక్రవారం ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో ఆది మాట్లాడుతూ– ''సినిమా చూసిన అందరూ నేను చేసిన అర్జున్ పండిట్ పాత్ర చాలా బావుందని అభినందిస్తున్నారు. ప్రతి రోజూ గర్వపడుతూ ఈ సినిమా చేశాను. నా ఫ్రెండ్స్, ఫ్యామిలీ అందరూ పాజిటివ్ రిపోర్ట్స్ చెబుతుంటే ఆనందంగా ఉంది'' అన్నారు. సాయికిరణ్ అడివి మాట్లాడుతూ– ''మా చిత్రం విడుదలైన అన్ని చోట్ల నుండి సినిమా బావుంది అనే టాక్ రావడం ఆనందంగా ఉంది. సినిమా విజయం వెనక ఎంతో మంది ప్రోత్సాహం ఉంది. టెక్నీషియన్స్, మా టీమ్ అందరి హార్డ్ వర్క్‌తో ఈ సినిమా పూర్తయింది. సినిమా కొత్తగా ఉందని ప్రేక్షకులు రివ్యూ ఇస్తున్నారు'' అన్నారు. ఈ కార్యక్రమంలో కార్తీక్ రాజు, పార్వతీశం, పద్మనాభ రెడ్డి, అబ్బూరి రవి తదితరులు పాల్గొన్నారు.

## మాలో ఏం జరుగుతోంది?

**'మూ**వీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్(మా)' లో ఏం జరుగుతోంది? అన్నది ఆదివారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. నటుడు వీకే నరేశ్ అధ్యక్షతన కొత్త కార్యవర్గం ఏర్పడిన సంగతి తెలిసిందే. కొత్త కార్యవర్గం ఏర్పడి ఆరు నెలలు కూడా కాక ముందే కార్యవర్గ సభ్యుల మధ్య అంతరాలు పెరగడంతో ఇటీవల వివాదాలు తలెత్తుతున్నాయని పలువురు భావిస్తున్నారు. 'మా'లో అటు నరేశ్, ఇటు 'మా' ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రాజశేఖర్‌ల వర్గాలు తయారయ్యాయని సమాచారం. ఆదివారం 'మా' సభ్యుల మీటింగ్ ఉందంటూ 'మా' జనరల్ సెక్రటరీ జీవిత, రాజశేఖర్‌లు 'మా' సభ్యులకు, ఈసీ మెంబర్లకు మెసేజ్‌లు పంపడంపైనా వివాదం నెలకొంది. ఫిల్మ్‌చాంబర్‌లో ఆదివారం నిర్వహించిన 'మా' సమావేశం నరేశ్, రాజశేఖర్ వర్గాల మధ్య మాటల యుద్ధంతో వాడి వేడిగా సాగిందని టాక్. అధ్యక్షుడి స్థానంలో ఉన్న నరేశ్ 'మా' కి నిధుల సేకరణ కార్యక్రమాలు చేపట్టకపోగా, 'మా'లోని 5.5కోట్ల మూల ధనం నుంచి ఖర్చు చేస్తున్నారని పలువురు సభ్యులు మండిపడ్డారని భోగట్టా. ఇరువర్గాల వారిని 'మా' ట్రెజరర్ పరుచూరి గోపాలకృష్ణ సముదాయించేందుకు ప్రయత్నించినా, ఆయన మాట వినకపోవడంతో సమావేశం నుంచి బయటకు వచ్చేశారట. కాగా, కోర్టు ఆర్డర్ ప్రకారం ఇది 'మా' జనరల్ బాడీ మీటింగ్ కాదని కేవలం ఫ్రెండ్లీ మీటింగే అని, త్వరలో జనరల్ బాడీ మీటింగ్ ఉంటుందని జీవితా–రాజశేఖర్‌లు చెప్పారు. నటుడు, 'మా' ఈసీ మెంబర్ పృథ్వీ మాట్లాడుతూ– ''మా'లో కొందరు ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియాలా ఫీలవుతున్నారు. కృష్ణంరాజుగారు, చిరంజీవిగారు వంటి సినీ పెద్దలు జోక్యం చేసుకుంటేనే 'మా' సమస్యకి పరిష్కారం అవుతుంది'' అన్నారు. సమావేశం అనంతరం బయటికి వచ్చిన 'మా' సభ్యులు ఎవరికి తోచింది వారు మీడియా ముందు చెప్పడం విశేషం.

## సూపర్‌మార్కెట్‌లో థ్రిల్



● శ్రీనాథ్ పులకరం, గౌతం రాజు, కృష్ణ

**హా**స్యనటుడు గౌతంరాజు కుమారుడు కృష్ణ హీరోగా తెరకెక్కిన చిత్రం 'కృష్ణారావ్ సూపర్‌మార్కెట్'. శ్రీనాథ్ పులకరం ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమయ్యారు. ఎల్సాగోష్ కథానాయికగా నటించారు. బీజీఆర్ ఫిల్మ్ అండ్ టీవీ స్టూడియోస్ పతాకంపై రూపొందిన ఈ సినిమా గత శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో గౌతంరాజు మాట్లాడుతూ– ''యూత్ ఫుల్ లవ్ అండ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రమిది. క్లైమాక్స్ వరకూ సస్పెన్స్ అలానే ఉండి ప్రేక్షకులను థ్రిల్ చేస్తుంది. మా అబ్బాయి కృష్ణ ముందు నుంచి చిరంజీవిగారి అభిమాని. ఈ చిత్రంలో డ్యాన్సులు, ఫైట్స్ బాగా చేశాడు. నేను ఇండస్ట్రీకి వచ్చిన 33 ఏళ్ల నుంచి చాలా మందికి సాయం చేస్తూ వచ్చాను. మా సినిమాకి ఇంకా మంచి హైప్ వచ్చేలా మీడియా చేస్తే.. దానివల్ల మరికొంత మందికి సహాయం చేసే అవకాశం వస్తుంది'' అన్నారు. ''మా సినిమా పాజిటివ్ వైబ్స్‌తో వెళుతోంది. స్టోరీ, స్క్రీన్ ప్లే బాగా చేసిన మా డైరెక్టర్‌కి థ్యాంక్స్. యంగ్ టీమ్ చాలా కష్టపడి సినిమా చేశాం'' అన్నారు కృష్ణ. ''మా చిత్రం బాగుందని ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. అయితే పూర్తిస్థాయిలో ప్రేక్షకులను థియేటర్స్‌కి రప్పించడంలో అంతగా సక్సెస్ కాలేదనిపిస్తోంది'' అని శ్రీనాథ్ పులకరం అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: బోలే షవాలీ, కెమెరా: ఎ. విజయ్‌కుమార్.

''**నా** సినిమా హిట్ అయితే ఎందుకు ఆడింది?, ఫ్లాప్ అయితే ఎందుకు ఆడలేదు? అని ఎక్కువగా ఆలోచించను. అలా ఆలోచిస్తే కన్‌ఫ్యూజ్ అయిపోతాం (నవ్వుతూ). నేనెప్పుడు ఒక్కటే ఫాలో అవుతా. నేను చేసే సినిమా నాకు నచ్చాలి. నాకే నచ్చకపోతే మిగతావాళ్లకు నచ్చాలని ఎలా కోరుకోగలను'' అని కార్తీ అన్నారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో కార్తీ హీరోగా తెరకెక్కిన చిత్రం 'ఖైదీ'. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 25న విడుదల కానుంది. ఈ

## అందరూ ప్రేక్షకులే

చిత్రాన్ని తెలుగులో నిర్మాత రాధామోహన్ విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో కార్తీ పంచుకున్న విశేషాలు...

- ఒక రోజు రాత్రి నాలుగు గంటల వ్యవధిలో జరిగే కథే 'ఖైదీ' సినిమా. పదేళ్ల నుంచి జైల్లో ఉండి విడుదలైన ఖైదీ పాత్రలో కనిపిస్తాను. జైల్లో ఉండటంతో పదేళ్లుగా తన పాపను కూడా చూడలేదు. మొదటిసారి తన కూతుర్ని చూడబోయే క్రమంలో ఎన్నో అడ్డంకులు ఎదురవుతాయి. చివరికి పాపను చూస్తానా?



● కార్తీ


- 'ఖైదీ' కథలో కావాల్సినంత సస్పెన్స్, థ్రిల్ ఉన్నాయి. అందుకే పాటలు, రొమాన్స్ పెట్టలేదు. ఇది ఫుల్ మాస్ సినిమా. నా పాత్ర ఊర మాస్‌గా ఉంటుంది. సినిమాలో నేను మాత్రమే హీరోని కాదు. ఒక్కో సందర్భంలో ఒక్కో పాత్ర హీరోలా మారుతుంటుంది. టైటిల్ కూడా సూట్ అవుతుందని 'ఖైదీ' పెట్టాం.
- దర్శకుడు లోకేశ్‌కి ఇది రెండవ సినిమా. ఇంతకు ముందు 'మానగరం' సినిమా తెరకెక్కించారు. అంతకు ముందు కొన్ని షార్ట్‌ఫిల్మ్స్ రూపొందించారు. 'ఖైదీ' ఇంటర్నేషనల్ రేంజ్ ఫిల్మ్. హాలీవుడ్ 'బ్యాట్‌మ్యాన్, సూపర్‌మేన్' సినిమా స్టయిల్ ట్రీట్‌మెంట్ ఇచ్చాం. భవిష్యత్తులో లేదా? అనేది సినిమాలో చూడాల్సిందే. పోలీసులు ఉన్నారనే ధీమాతో మనందరం హాయిగా నిద్రపోతున్నాం. పోలీసులు అనేవాళ్లు లేకుంటే పరిస్థితి ఏంటి? అనే విషయాన్ని ఈ సినిమాలో చర్చించాం. 'ఖైదీ' చేశామని కచ్చితంగా గర్వపడతాం.
- 'విక్రమార్కుడు' తమిళ రీమేక్ చేస్తున్నప్పుడు నాకు ఒక పాప ఉన్నట్టు ఊహించుకొని ఎమోషన్‌ని పండించాలి. అప్పుడు నాకు కూతురు లేదు.. ఇప్పుడు ఉంది. ఆ ఫీలింగ్ ఎలా ఉంటుందో నాకు తెలుసు. కూతురు అనగానే తండ్రికి ఒకలాంటి సంరక్షించే బాధ్యత ఉంటుంది. ఈ భావోద్వేగాన్ని ఈ సినిమాలో చూపించాం.

**రజనీకాంత్, విజయ్, అజిత్‌తో సినిమాలు చేస్తున్న దర్శకులందరూ మీతో పని చేసినవాళ్లే. మీరు వాళ్లకు లక్కీ హీరో కదా? అని అడగ్గా - 'అది నా అదృష్టం. వాళ్లకు ప్రతిభ ఉంది కాబట్టి వరుసగా మంచి సినిమాలు చేస్తున్నారు. 'ఖైదీ' టీజర్ రాగానే విజయ్‌గారు మా దర్శకుడికి ఫోన్ చేసి అవకాశం ఇచ్చారు.**

- ప్రేక్షకులు సినిమాలు చూసే తీరు మారుతోంది. నెట్‌ఫ్లిక్స్, అమేజాన్ వల్ల ప్రపంచ సినిమాను ఫోన్‌లోనే వీక్షిస్తున్నారు. 'డిజిటల్‌లో కేవలం సిటీ వాళ్లే చూస్తారులే అనుకునేవాణ్ణి'. కానీ, షూటింగ్ కోసం ఓ ఊరు వెళితే 'సార్.. 'మనీ హెస్ట్' షో చూశారా? అని అడుగుతున్నారు. పండగకి రెండు సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. ఏది బావుంటే దాన్ని చూస్తారు. పండగ టైంలో ప్రేక్షకులకు ఆప్షన్స్ ఉండాలి. బావుంటే రెండు సినిమాలూ చూస్తారు. ఈ సంక్రాంతికి తమిళంలో విడుదలైన 'పేట్టా, విశ్వాసం' రెండూ హిట్ అయ్యాయి.
- ఏ పాత్ర అయినా నన్ను చాలెంజ్ చేయాలి. ఈ సినిమా కోసం నిజంగానే ఖైదీలను కలిశాం. వాళ్ల నుంచి సమాచారం తీసుకొని నా పాత్రను చేశాను. నా దృష్టిలో అందరూ ప్రేక్షకులే. తెలుగు, తమిళం అని వ్యత్యాసం ఉండదు. రెండు రాష్ట్రాలకు కొన్ని పోలికలు ఉంటాయి.
- జోసెఫ్‌గారి దర్శకత్వంలో వదిన జ్యోతికగారితో ఓ సినిమా చేశాను. అందులో మేమిద్దరం అక్కాతమ్ముడిగా నటించాం. ప్రస్తుతం 'సుల్తాన్' అనే సినిమా చేస్తున్నాను.

## రాములో రాములా...

**అ**ల్లు అర్జున్ హీరోగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా 'అల...వైకుంఠపురములో...'. ఈ చిత్రంలో పూజాహెగ్డే కథానాయికగా నటిస్తున్నారు. సుశాంత్, నివేతా పేతురాజ్ ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. రాజ్ పాత్రలో నటిస్తున్న సుశాంత్ లుక్‌ను ఆదివారం విడుదల చేశారు. 'రాజ్ పాత్ర పోషిస్తున్నాను. 'అల...వైకుంఠపురములో...' నటిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది' అన్నారు సుశాంత్. ఈ సినిమాలోని 'రాములో.. రాములా...' పాట టీజర్ ఈ రోజు సాయంత్రం విడుదలవుతోంది. పూర్తి పాటను దీపావళి సందర్భంగా విడుదల చేయనున్నాను. ఈ పాట చాలా క్యాచీగా ఉంటుందంటున్నారు అల్లు అర్జున్. ఇప్పటికే విడుదల చేసిన ఈ చిత్రంలో 'సామజవరగమన...' పాటకు మంచి స్పందన లభిస్తోంది. అల్లు అరవింద్, ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు. టబు, జయరామ్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 12న విడుదల కానుంది.



● సుశాంత్



● పూజా హెగ్డే

## పశ్చాత్తాపం లేదు

'మొహంజోదారో' చిత్రంతో బీటౌన్‌లో అడుగుపెట్టారు ఇప్పటి టాలీవుడ్ బిజీ హీరోయిన్ పూజాహెగ్డే. కానీ, ఆ సినిమా ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో ఆమె నటించిన మరో సినిమా విడుదలకు దాదాపు మూడేళ్లు పట్టింది. తాజాగా అక్షయ్ కుమార్ 'హౌస్‌ఫుల్ 4' సినిమాతో హిందీ తెరపై మెరవబోతున్నారీ బ్యూటీ. 'మొహంజోదారో' సినిమా విఫలం కావడం వల్లే బాలీవుడ్‌లో మీకు అవకాశాలు తగ్గాయా? అన్న ప్రశ్నను పూజా ముందు ఉంచితే...''ఈ ప్రశ్న ఎదురైన ప్రతిసారీ చెబుతూనే ఉన్నాను. ఈ సినిమా చేసినందుకు పశ్చాత్తాపం లేదు. అప్పట్లో ఈ సినిమా చేయాలని నేను తీసుకున్న నిర్ణయం సరైనదేనని ఇప్పటికీ నమ్ముతున్నాను. నా తొలి హిందీ సినిమాలోనే హృతిక్‌రోషన్ వంటి స్టార్ హీరోతో కలిసి నటించినందుకు సంతోషంగా ఉంది. ఇక సినిమా ఫలితం అన్నది నటీనటుల చేతుల్లో ఉండదు. ప్రేక్షకులు నిర్ణయిస్తారు. నేను నటించిన 'హౌస్‌ఫుల్ 4' ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుందనే నమ్మకం ఉంది'' అన్నారు.

## వయసు కాదు.. ప్రతిభ ముఖ్యం



● శ్వేత అవస్తి, అనురాగ్

**అ**నురాగ్ కొణిదెన హీరోగా పరిచయమైన చిత్రం 'మళ్ళీ మళ్ళీ చూశా'. శ్వేత అవస్తి, కైరవి తక్కర్ హీరోయిన్స్‌గా నటించారు. హేమంత్ కార్తీక్ దర్శకత్వంలో కె. కోటేశ్వరరావు నిర్మించిన ఈ సినిమా గత శుక్రవారం విడుదలైంది. సక్సెస్ మీట్‌లో హేమంత్ కార్తీక్ మాట్లాడుతూ– ''చాలా సంవత్సరాలుగా దర్శకత్వం అవకాశం కోసం ఎదురుచూస్తున్నాను. వయసు కాదు.. ప్రతిభే ముఖ్యం అని నమ్మిన కోటేశ్వరరావుగారు నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు'' అన్నారు. ''చిన్న సినిమా, పెద్ద సినిమా అని కాకుండా మంచి సినిమాలను ఎప్పుడూ ప్రోత్సహించే మీడియా రంగంలో నేను ఉన్నందుకు గర్వంగా ఉంది'' అన్నారు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సతీష్ పాలకుర్తి. ''మాకు ఎంతో సహకారం అందించిన మైత్రీ మూవీస్ రవి గారు, నిర్మాత అనిల్ సుంకరగార్లకు ధన్యవాదాలు'' అన్నారు అనురాగ్ కొణిదెన. లిరిసిస్ట్ తిరుపతి జవాన్, హీరోయిన్ శ్వేతా అవస్తి మాట్లాడారు.



డేంజర్.. డేంజర్

# యాంటాసిడ్స్ ఎక్కువగా వాడకండి...

ఈ రోజుల్లో చాలా మందిలో అజీర్తి తాలూకు లక్షణాలు తరచూ కనిపిస్తుండటం చాలా సాధారణం. ఇక వీళ్లు కూడా మెడికల్ షాపులకు వెళ్లి... యాంటాసిడ్ మాత్రలు, పౌడర్లు వాడటం కూడా చాలా సాధారణంగానే జరిగిపోతుంటుంది. కడుపు ఉబ్బరంగా ఉండటం, ఛాతీపై బరువుగా ఉన్నట్లు ఫీల్ కావడం, గొంతు మండినట్లుగా అనిపించడం, ఆహారం పైకి తన్నినట్లుగా ఉండటం, పొట్టంతా గట్టిగా బిగుసుకుపోయినట్లుగా అనిపించడం... ఇవన్నీ అజీర్తి లక్షణాలు. ఇలాంటి లక్షణాలు కనిపించగానే మెడికల్ షాపుల్లోకి వెళ్లి యాంటాసిడ్ మాత్రలు తీసు



కోవడం, అజీర్తిని తగ్గించే కొన్ని ద్రావణాలు నీళ్లలో కలుపుకుని తాగడం వంటి పనులు దాదాపు ప్రతి ఒక్క,రూ ఏదో ఒక సమయంలో చేస్తూనే ఉంటారు.

అయితే ఇలా తరచూ యాంటాసిడ్ మాత్రలు వాడటం, అజీర్తిని తగ్గించే పౌడర్లు, జెల్లు కలుపుకొని తాగడం అంత మంచి పని కాదంటున్నారు అమెరికన్ పరిశోధకులు. ఈ మందులు వాడే వారిలో విటమిన్ బి12 లోపం వస్తుందని అమెరికన్ పరిశోధకులు గుర్తించారు. అజీర్తి మందులతో పాటు యాంటాసిడ్‌లు, ప్రోటాన్ పంప్ ఇన్హిబిటర్లు, హెచ్2 బ్లాకర్స్ అనే మందులు వాడే వేలాది మందిపై నిర్వహించిన ఒక అధ్యయనంలో ఈ వాస్తవాలు వెల్లడయ్యాయి. ఈ అంశం జర్నల్ ఆఫ్ అమెరికన్ మెడికల్ అసోసియేషన్‌లో సైతం ప్రచురితమైంది.

## హెల్త్ టిప్

అరటిపండులో చక్కెర... సుక్రోజ్, ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటివి సహజరూపంలో ఉంటాయి. పీచు పదార్థాలు కూడా సమృద్ధిగా ఉంటాయి. రెండు అరటిపండ్లు తింటే 90 నిమిషాల సేపు పని చేయవచ్చని పరిశోధనల్లో రుజువైంది. అందుకే క్రీడాకారులు ఎక్కువగా అరటిపండు తీసుకుంటారు. అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవడానికి అరటిపండు మంచి ఆహారం. కాబట్టి ప్రతిరోజూ అరటిపండు తింటే శక్తితో పాటు జీర్ణ వ్యవస్థ పని తీరు మెరుగవుతుంది.



పరిచయం | కరుణా ఏకాంబర్

# విరి వాణి





చక్కగా రెక్కలు విచ్చుకున్న పువ్వు... అభినందనలలో సంతోషాన్ని రెట్టింపు చేస్తుంది. నివాళిలో మాటల్లో చెప్పలేని వేదనను మౌనంగా భాషిస్తుంది. భావోద్వేగాలను ఒకరి నుంచి మరొకరికి ప్రసారం చేయించే వాహకాలు పూలు. మనిషి జీవితాన్ని పరిపూర్ణం చేసే పరిమళాల బంధాలుపూలు. అందుకే పూల కోసమే ఒక పుస్తకం ఉండాలనుకున్నారు డాక్టర్ కరుణా ఏకాంబర్. పూల కోసమే ఒక కోర్సు ఉండాలని కూడా అంటున్నారు. పువ్వుకు మాట్లాడే అవకాశం వస్తే... ఎన్ని సంగతులు చెప్తుందో... అన్ని వివరాలను ఓ విరి వాణిగా అక్షరబద్ధం చేశారామె.

'చేంజింగ్ ప్యాటర్న్స్ ఆఫ్ ఫ్లోరల్ కల్చర్ – ఏ స్టడీ ఆన్ ఫ్లోరిస్ట్స్ ఆఫ్ హైదరాబాద్'... ఇది కరుణాఏకాంబర్ పూలమీద చేసిన పరిశోధన, పూలతో మమేకమైన మహిళల మీద పరిశోధన, వారి జీవితాల మీద సాగిన అధ్యయనం. పూలతో మనిషికి ఉండే బంధం అనంతమైనది. పండుగ, పర్వం, సంతోషం, దుఃఖం... సందర్భం ఏదైనా పువ్వుతోనే మొదలవుతుంది, పూలతోనే పూర్తవుతుంది. మనదేశంలో మట్టికి ఔన్నత్యం ఉంది. ఇక్కడ మొలిచిన ప్రతి చెట్టూ ఔషధాల మూలరూపమే. ప్రతి పువ్వూ సుగుణాల స్వరూపమే. ప్రతి వేడుకలోనూ పూలకు ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. అలాంటి పూలకే ప్రత్యేకమైన స్థానాన్ని కల్పించిన తెలంగాణ సంస్కృతి మూలాలను ఔపోసన పట్టారు డాక్టర్ కరుణా ఏకాంబర్. మనిషి జీవితంలో పూల ప్రాధాన్యంతోపాటు అలంకరణలో వస్తున్న మార్పులు, కొత్తగా వచ్చి చేరుతున్న పూల రకాల గురించి దండకట్టారు. మొక్క నాటి, పాదు చేసి, నీరు పోసి పూలు పూయించే వారి శ్రమ నుంచి వాటిని కోసి దండకట్టి మార్కెట్‌లో సిద్ధం చేసి ఉపాధి పొందే మహిళల వరకు ప్రతి ఒక్కరి జీవితాలనూ చదివారామె. వీళ్లంతా తెరవెనుక పని చేసే శ్రమ జీవులు. ఇక మోడరన్ మార్కెట్‌లో పూలతో కెరీర్‌ను అల్లుకున్న ఫ్లోరిస్ట్‌లను పరిశీలించారు. ఒక్కమాటలో చెప్పాలంటే... మట్టిలో మొలిచిన మొక్క నుంచి మొగ్గ తొడిగి రెక్కలు విచ్చుకున్నప్పటి నుంచి... ఆ పువ్వు ముఖం వేళ్లాడేసుకుని తిరిగి నేల ఒడిని చేరే వరకు కొనసాగే పువ్వు ప్రయాణమంతటినీ అక్షరబద్ధం చేశారు డాక్టర్ కరుణ. ఈ ప్రయాణంలో ఎంతమంది మహిళలు ఉపాధి పొందుతున్నారో వివరించారు. మరెంత మంది ఈ పూలతో సంతోషాలను పంచుకుంటున్నారో... ఆ వివరాలను తన పరిశోధన గ్రంథంలో పూసగుచ్చారు డాక్టర్ కరుణ.

### పూల పుస్తకం

''నా చిన్నప్పుడు నేను చూస్తూ పెరిగిన మాలతీలతలు, రేరాణి, గన్నేరు, సంపెంగ, పారిజాతం వంటి అనేక రకాల పూలు ఇప్పుడు ఏ ఫంక్షన్‌లోనూ కనిపించడం లేదు. మార్కెట్‌లో కొత్త రకాల పూలు చాలా వస్తున్నాయి. మన వాళ్లకు పాశ్చాత్యం మీద క్రేజ్ ఎక్కువ. చల్లని దేశాల్లో పూచే పూల వాడకం పెరిగింది. మార్కెట్‌లో ఏ పూలయితే బాగా అమ్ముడవుతాయో, ఆ పూల మొక్కలను పెంచితేనే పూలరైతుకి గిట్టుబాటవుతుంది. దాంతో మన దేశీయ పూలలో చాలా రకాలు కనుమరుగవుతున్నాయి. నా పరిశోధనలో భాగంగా వాటి కోసం అన్వేషించాను. ఒక చోట గ్రంథస్థం చేస్తేనయినా రాబోయే తరం తెలుసుకోవడానికి ఒక ఆధారం ఉంటుందనిపించింది. అందుకే మన కల్చర్‌లో దేవుళ్ల పూజల కోసం ఏ దేవుడికి ఏ పూలతో పూజ చేస్తారనే వివరాలను కూడా పరిశోధన గ్రంథంలో పొందుపరిచాను.

### సువాసనల పరిశ్రమ

పూలు అలంకరణ కోసమో, ఆడంబర ప్రదర్శన కోసమో మాత్రమే కాదు. ఇది ఉపాధినిచ్చే విస్తారమైన పరిశ్రమ. ఈ పరిశ్రమను వ్యవస్థీకృతం చేయాలనేది నా కోరిక. ఇంట్లో ఉండి భర్త మార్కెట్ నుంచి తెచ్చిన పూలను దండలు కట్టే మహిళలు ఈ రంగంలో సైలెంట్ ప్లేయర్స్. ఇప్పుడు మన సొసైటీలో క్వాలిఫైడ్ ఫ్లోరిస్ట్‌కు గౌరవాలు బాగానే లభిస్తున్నాయి. పూల దండలు కట్టే మహిళ కూడా అలాంటి గుర్తింపునే పొందగలగాలనేది నా అభిలాష. అలాగే ఫ్లవర్ డెకరేషన్– ఫ్లోరిస్ట్ కెరీర్‌కోసం గ్రాడ్యుయేషన్ స్థాయిలో కోర్సు అవసరం. హోటల్ మేనేజ్‌మెంట్, నిఫ్ట్‌లలో పరిమితంగా సిలబస్ ఉంది తప్ప మొత్తం కోర్సుగా లేదు. ఎన్‌జీవోలు కానీ ఇతర కార్పొరేట్ సంస్థలు తమ సీఎస్ఆర్‌లో భాగంగా ఇస్తున్న స్కిల్ ట్రెనింగ్ ప్రోగ్రామ్‌లలో మహిళలు ఫ్లవర్ డెకరేషన్‌లో శిక్షణ ఇచ్చి సర్టిఫికేట్ ఇస్తే మహిళలకు ఒక హోదా ఇచ్చినట్లవుతుంది.

ఇకబెనా వంటి జపాన్ శైలి ఫ్లవర్ డెకరేషన్ కోర్సులు మన దగ్గర కూడా ఉన్నాయి. నేను ఇకబెనా కోర్సు చేశాను కూడా. అయితే అవి సంపన్న వర్గాల నుంచి కిందకు దిగే పరిస్థితి లేదు. అందుకే మన దేశీయ పరిస్థితులకు అనుగుణంగా ఫ్లవర్ డెకరేషన్ కెరీర్‌ను అభివృద్ధి చేస్తే బావుటుందనిపిస్తోంది. మా అమ్మాయి కరిష్మాకి మెడిసిన్ తర్వాత పెళ్లి చేశాం. మా వారు సిద్ధార్థ బిజినెస్‌మేన్. ఇప్పుడు నా పూర్తి టైమ్‌ని పూల మీదనే ఫోకస్ చేయాలనుకుంటున్నాను.

### పొగడ పూల బాల్యం

'మాది సికింద్రాబాద్‌లోని పద్మారావునగర్. ఉమ్మడి కుటుంబం, ఇల్లు రెండెకరాల ఆవరణలో ఉండేది. ఇంటి నిండా రకరకాల పూల మొక్కలు. మొత్తం మూడు వందల చెట్ల మధ్య గడిచిన బాల్యం. ప్రతి పువ్వుతోనూ పరిచయం, ప్రతి రెమ్మతోనూ అనుబంధం ఉండేది. మా నానమ్మ పొగడ పూలతో 'లక్ష పూల పూజ' చేసేది. ఆ పూజ కోసం పిల్లలందరం పూలు కోసి దండలు గుచ్చేవాళ్లం. దసరా పది రోజులు మాకు పండుగే. అందరూ చేసుకునే పండుగ ఒక ఎత్తయితే, మా వేడుక ఒక ఎత్తు. మా చుట్టు పక్కల అన్ని ఇళ్ల వాళ్లూ బతుకమ్మను పేర్చి ఆర్‌పీ రోడ్‌లోని గుడికి తీసుకొచ్చేవాళ్లు. వాళ్లందరి కంటే



పూలమొక్కల మధ్య కరుణ పెరిగిన ఇల్లు

మా బతుకమ్మే పెద్దగా ఉండాలని మేము చేసే హడావుడి చిన్నది కాదు. ఏడు అడుగుల ఎత్తు బతుకమ్మను పేర్చేవాళ్లం. అందరూ మా బతుకమ్మను ఆసక్తిగా చూస్తూ ఉంటే మాకు గర్వంగా ఉండేది. ఆ బతుకమ్మలను నీటిలో వదిలేవాళ్లం. తంగేడు పూలకు నీటిని శుభ్రం చేసే గుణం ఉంది. బంతి, చేమంతుల పరిమళం శ్వాసకోశ వ్యాధులను హరించివేస్తుంది. మన జీవిక పూలతో ముడిపడి ఉంది. పూల మీదున్న ఇష్టమే నన్ను ఫ్లోరిస్ట్‌ని చేసింది. బంజారాహిల్స్‌లో 'బ్లూమింగ్ బడ్స్' షోరూమ్‌ని నడిపా'నని చెప్పారు కరుణ.

### పూలనగలొచ్చాయి

మోడరన్ జనరేషన్‌లో పూలకు క్రేజ్ ఎంతగా పెరిగిపోయిందంటే... పెళ్లికి పూలనగలు ధరిస్తున్నారు. చీర రంగును బట్టి పూలను ఎంపిక చేసి పూలనగలు చేస్తాం. వధూవరులు ధరించే దండలు కూడా వాళ్ల దుస్తులకు అనుగుణంగా తయారవుతున్నాయి. ఫంక్షన్లలో డెఫోడిలీస్, ఆర్కిడ్స్ వంటి పూలు రాజ్యమేలుతున్నాయి. కొత్త పూలు తెచ్చుకుందాం, కానీ స్వదేశీ పూలకు దూరం కావద్దు అనేది నేను చెప్పే మాట'' అన్నారు డాక్టర్ కరుణా ఏకాంబర్.

– వాకా మంజులారెడ్డి
ఫొటోలు: కె. రమేశ్ బాబు

### చదువుతూనే ఉన్నాను



మాది వ్యాపార కుటుంబం. తాత దండు వెంకన్న రైల్వేస్‌కి స్టీల్ సప్లయ్ చేసేవాళ్లు. సికింద్రాబాద్‌లో ఆయన నిర్మించిన చాలా భవనాలు ఇప్పటికీ ఉన్నాయి. మా తాత (వెంకన్న) వారసులు పెంటయ్య, ఆగయ్య, బాల నర్సయ్య, ఆయిల్ మిల్లులు, పిండిమిల్లులు నడిపారు. మా నాన్న ఏకాంబర్ పార్క్‌లేన్ హోటల్, ప్యాట్నీ మాల్ కట్టారు. మా ఇంట్లో ఆడపిల్ల అలా ఉండాలి, ఇలా ఉండాలి అనే పరిమితులు లేవు కాబట్టి ఇంటర్‌లో కస్తూర్బా కాలేజ్‌లో జాయింట్ సెక్రటరీ బాధ్యతలు నిర్వర్తించగలిగాను. అయితే అమ్మాయి ఇంటర్‌లోకి వస్తే చాలు.. ఇక పెళ్లి సంబంధాలు చూసేవాళ్లు. అలా నాకు పద్దెనిమిదేళ్లకే పెళ్లయింది. పెళ్లి తర్వాత బిఏ, హోటల్ మేనేజ్‌మెంట్, న్యూట్రిషన్‌కోర్సు, ఇకబెనా ఫ్లవర్ డెకరేషన్ కోర్సులతోపాటు 'ట్రినిటీ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్, లండన్' కాలేజ్‌లో వెస్టర్న్ క్లాసికల్ పియానో కోర్సు చేశాను. సోషియాలజీలో ఎంఏ, ఎంఫిల్ చేశాను. ఇప్పుడు పూల మీద పీహెచ్‌డీ చేశాను. నా చదువు అర్ధంతరంగా ఆగిపోవడం కూడా నాకు కలిసొచ్చిన అవకాశమే అయింది. నిత్యవిద్యార్థిగా మారిపోయాను. చదువుకోవడంతోపాటు ఎంటర్‌ప్రెన్యూర్‌గా బిజీగా ఉన్నాను. నాన్న కట్టిన పార్క్‌లేన్ హోటల్‌లో డైరెక్టర్‌ని, ఆయన అడుగుజాడల్లోనే నిజాం క్లబ్ కమిటీ మెంబర్‌గా కూడా పని చేశాను. ఆ బాధ్యతలు నిర్వర్తించిన తొలి మహిళను కూడా. క్లబ్‌లో ఉమెన్స్ డేకి సాధికారత సాధించిన మహిళలను సత్కరించడం అనే సంప్రదాయాన్ని మొదలు పెట్టాను.

– డాక్టర్ కరుణా ఏకాంబర్,
ఎంటర్‌ప్రెన్యూర్

బీపీ కౌన్సెలింగ్

# హైబీపీ వల్ల ముప్పేమిటి?

నా వయసు 52 ఏళ్లు. ఇంతవరకు ఎప్పుడూ బీపీ చూసుకోలేదు. కానీ ఇటీవల చూసుకున్నప్పుడు నా బీపీ 150 / 98 ఉంది. దాంతో డాక్టర్‌గారు కనీసం నాలుగైదు బీపీ సార్లు చూసుకొని, రీడింగ్స్ నోట్ చేసుకొని వారం తర్వాత రమన్నారు. అంతకుముందు ఎలాంటి ఆలోచనా లేదు కానీ... ఆ మాట చెప్పినప్పటి నుంచి నాకెందుకో ఆందోళనగా ఉంది. బీపీ పెరిగితే వచ్చే సమస్యలపై అవగాహన కలిగేలా నాకు సమగ్రంగా వివరించండి.

– డి. రాజేశ్వరరావు, నిజామాబాద్

ఇటీవల ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న రక్తపోటు కండిషన్ విపరీతంగా పెరుగుతోంది. రక్తపోటు పెరగడానికి కారణాలు చాలావరకు నిర్దిష్టంగా తెలియవు. ఇలా కారణం తెలియని బీపీని 'ఇడియోపథిక్ హైపర్‌టెన్షన్' అంటారు. కుటుంబ ఆరోగ్య చరిత్ర, శారీరక శ్రమ తక్కువగా ఉండే కూర్చుని చేసే వృత్తుల్లో ఉండటం, రోజురోజుకూ పెరుగుతున్న ఒత్తిడి, ఊబకాయం వంటి అంశాలు దీనికి కారణమని ఊహిస్తున్నారు. రక్తపోటు వచ్చినవారిలోలో దాదాపు 90 శాతం ఇడియోపథిక్ హైపర్‌టెన్షన్ కేసులే ఉంటాయి. అయితే మిగతా 10 శాతం మందిలో రక్తపోటు పెరగడానికి నిర్దిష్టంగా కారణం ఉంటుంది. ఇలా కారణం తెలిసిన రక్తపోటును సెకండరీ హైపర్‌టెన్షన్ అంటారు.

కారణం తెలియకుండా వచ్చే ఇడియోపథిక్ హైపర్‌టెన్షన్స్ కంటే నిర్దిష్ట కారణంతో వచ్చే సెకండరీ హైపర్‌టెన్షన్లతో చాలా ప్రమాదం. ఇలాంటి సెకండరీ హైపర్‌టెన్షన్‌లతో వచ్చే రక్తపోటును అదుపులో పెట్టేందుకు చాలాసార్లు మూడు నుంచి నాలుగు రకాల మందులు వాడాల్సి ఉంటుంది. ఒక్కోసారి ఏడు నుంచి ఎనిమిది రకాలు కూడా వాడాల్సి రావచ్చు.

సాధారణ ఇడియోపథిక్ రక్తపోటుతో మూత్రపిండాలు దెబ్బతినే పరిస్థితి కాస్తంత అరుదుగా వస్తుంది. కానీ సెకండరీ హైపర్‌టెన్షన్ ఉన్నవారిలో మూత్రపిండాలు దెబ్బతినే అవకాశాలు ఎక్కువ.



### రక్తపోటును నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఒత్తిడిని తగ్గించుకోవాలి.
- తగినంత నిద్ర ఉండేలా చూసుకోవాలి.
- ఆహారంలో ఉప్పు పాళ్లను తగ్గించాలి.
- ఉప్పు ఎక్కువగా ఉండే ఆహారం... పచ్చళ్లు, అప్పడాల వంటి వాటికి దూరంగా ఉండాలి.
- డాక్టర్ సలహా లేకుండా ఎలాంటి మాత్రలనూ (ఓవర్ ద కౌంటర్ తీసుకుని) ఉపయోగించకూడదు.
- రక్తపోటు ఉన్నప్పుడు దాన్ని ఎప్పుడూ 130 / 80 ఉండేలా క్రమం తప్పకుండా జాగ్రత్త తీసుకోవాలి.

### రక్తపోటు ఉన్నట్లు అనుమానించేవారు చేయించుకోవాల్సిన సాధారణ పరీక్షలు

- పూర్తిస్థాయి మూత్ర పరీక్ష ( కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్)
- హీమోగ్లోబిన్ పాళ్లు
- రక్తంలో పొటాషియమ్ స్థాయి
- బ్లడ్ యూరియా అండ్ క్రియాటినిన్ లెవెల్స్
- ఈసీజీ
- కిడ్నీ సైజ్‌ను తెలుసుకునేందుకు అల్ట్రాసౌండ్ స్కాన్ ఆఫ్ అబ్డామిన్ పరీక్ష
- రక్తంలో చక్కెర పాళ్లు తెలుసుకునే రాండమ్ బ్లడ్ షుగర్ లెవెల్స్ పరీక్ష

### మరికొన్ని ప్రత్యేక పరీక్షలు

అత్యధిక రక్తపోటు వల్ల మూత్రపిండాలకు ఏదైనా ప్రమాదం జరిగిందేమో తెలుసుకోడానికి మరికొన్ని ప్రత్యేక పరీక్షలు అవసరం. అవి...

- 24 గంటలలో మూత్రంలో పోయే ప్రోటీన్లు, క్రియాటినిన్ పాళ్లు తెలుసుకునే పరీక్ష.

  (మూత్రంలో పోయే ప్రోటీన్ల సంఖ్యను ఇటీవల కేవలం ఒక శాంపుల్‌తోనే తెలుసుకునే పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి)
- కిడ్నీ బయాప్సీ
- మూత్రపిండాల్లోని రక్తనాళాల పరిస్థితిని తెలుసుకునేందుకు డాప్లర్ అల్ట్రాసౌండ్ స్కాన్
- బ్లడ్ గ్యాస్ అనాలిసిస్
- రీనల్ యాంజియోగ్రామ్

### కొన్ని ప్రత్యేక పరీక్షలు ఎవరికి అవసరం

- కుటుంబ చరిత్రలో రక్తపోటు వల్ల మూత్రపిండాలు దెబ్బతిన్న వారికి..
- డయాబెటిస్ పేషెంట్లు అందరిలో..
- కాళ్లలో, పాదాల్లో వాపు వస్తున్నవారిలో ..
- రక్తపోటు అదుపు చేయడానికి రోజూ రెండు కంటే ఎక్కువ మందులు ఉపయోగిస్తున్నవారు
- ముప్ఫయి ఏళ్ల వయసు రాకముందే రక్తపోటు వచ్చిన వారికి, రక్తపోటు కనుగొని ఐదేళ్లు దాటిన వారికి..
- తీవ్రమైన తలనొప్పి వస్తున్నవారు, రక్తపోటు పెరగడం వల్ల గుండెదడ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిపడే వారికి..

### రక్తపోటు వల్ల వచ్చే అనర్థాలు:

- గుండెపోటు రావడం, గుండె ఫెయిల్యూర్
- కిడ్నీ దెబ్బతినడం
- పక్షవాతం
- జీవన వ్యవధి (లైఫ్ స్పాన్) తగ్గడం
- కిడ్నీ దెబ్బతింటే డయాలసిస్ వంటివి చాలా ఖర్చుతో కూడిన ప్రక్రియలు కావడం

పై అంశాలను అన్నింటినీ దృష్టిలో ఉంచుకుని రక్తపోటు ఉన్నవారు తమ హైబీపీని అదుపులో ఉంచుకుని ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం ఎంతో మేలు.



డా. నవోదయ
కన్సల్టెంట్ జనరల్ మెడిసిన్,
కేర్ హాస్పిటల్స్, బంజారాహిల్స్,
హైదరాబాద్

## నాకు హైబీపీ ఉన్నట్లా లేనట్లా?

నా వయసు 45 ఏళ్లు. నాకు తరచూ తలనొప్పిగా ఉండటంతో పాటు ఇటీవల బాగా తలతిరుగుతున్నట్లుగా ఉంది. ఒక్కోసారి ముందుకు పడిపోతానేమో అన్నంత ఆందోళనగా ఉంటోంది. నా లక్షణాలు చూసిన కొంతమంది మిత్రులు నీకు 'హైబీపీ ఉందేమో, ఒకసారి డాక్టర్‌కు చూపించుకో' అంటున్నారు. వారు చెబుతున్నదాన్ని బట్టి నాకు మరింత ఆందోళన పెరుగుతోంది. దాంతో బీపీ లేకపోయినా హైబీపీ ఉన్నట్లుగా చూపిస్తుందేమో అని భయంగానూ ఉంది. ఇంతకూ నాకు హైబీపీ ఉన్నట్లా లేనట్లా?

– బి. ఆంజనేయులు, జనగామ

హైబీపీని కేవలం మీరు చెప్పిన లక్షణాలతోనే నిర్ధారణ చేయడం సాధ్యం కాదు. మనలో రక్తపోటు పెరగడం వల్ల ఎండ్ ఆర్గాన్స్‌లో ముఖ్యమైనదైన మెదడులోని రక్తనాళాల చివరల్లో రక్తం ఒత్తిడి పెరగడం వల్ల తలనొప్పి రావచ్చు. అలాగే మన భంగిమ (పోష్చర్)ను అకస్మాత్తుగా మార్చడం వల్ల ఒకేసారి మనలో రక్తపోటు తగ్గవచ్చు. దీన్ని ఆర్థోస్టాటిక్ హైపోటెన్షన్ అంటారు. అలాంటి సమయాల్లోనూ మీరు చెప్పినట్లుగా ముందుకు పడిపోతారేమో లాంటి ఫీలింగ్, గిడ్డీనెస్ కలగవచ్చు. బీపీలో మార్పులు చోటు చేసుకోవడం వల్ల మీరు చెప్పిన లక్షణాలు కనిపించినప్పటికీ, అవి బీపీ వల్లనే అని కూడా నిర్దిష్టంగా చెప్పలేం. సాధారణంగా బీపీ వల్ల ఉదయం వేళల్లో తలనొప్పి కనిపించనప్పటికీ, మరెన్నో ఆరోగ్య సమస్యలలోనూ తలనొప్పి ఒక లక్షణంగా ఉంటుంది. అలాగే మీరు చెప్పిన గిడ్డినెస్ సమస్యకూ వర్టిగో, సింకోప్ లాంటి మరెన్నో సమస్యలు కారణం కావచ్చు. అందుకని కేవలం లక్షణాల ఆధారంగానే బీపీ నిర్ధారణ చేయడం సరికాదు. అందుకే మీరు నిర్భయంగా ఒకసారి డాక్టర్‌ను కలవండి. వారు కూడా కేవలం ఒక్క పరీక్షలోనే హైబీపీ నిర్ధారణ చేయరు. అనేక మార్లు, అనేక సందర్భాల్లో బీపీని కొలిచి, ఒకవేళ నిజంగానే సమస్య ఉంటే అప్పుడు మాత్రమే దాన్ని కచ్చితంగా నిర్ధారణ చేసి, దానికి తగిన చికిత్స సూచిస్తారు. మీరు ఆందోళన పడకుండా వెంటనే డాక్టర్‌ను కలవండి.

హైట్ & ఎక్సర్‌సైజ్

# టీనేజ్ పిల్లల్లో వ్యాయామం ఎత్తు పెరగడానికి అడ్డంకా?

**చాలా మంది పిల్లలు తమకు ఇష్టమైన సినీ హీరోల అవయవ సౌష్టవాన్ని చూసి ఎక్సర్‌సైజ్ చేయడానికి ఉపక్రమిస్తారు. టీనేజ్ దాటకముందే ఎక్సర్‌సైజ్‌లు మొదలుపెడితే అది వారిని ఎత్తుపెరగకుండా చేస్తుందనేది చాలా మందిలో ఉండే అపోహ. ఇది పూర్తిగా అవాస్తవం.**

### పిల్లల్లో ఎత్తు పెరిగే ప్రక్రియ ఎలా జరుగుతుందంటే...

సాధారణంగా పిల్లలు ఎంత ఎత్తుకు పెరగాలన్నది వాళ్ల జన్యువులపై ఆధారపడి ఉంటుంది. అంటే... ఎవరిలోనైనా ఎత్తు పెరగడం అన్న ప్రక్రియ సాధారణంగా 21 ఏళ్లు వచ్చేసరికి ఎముక చివర ఫ్యూజ్ అయిపోయి పెరుగుదల ఆగిపోతుంది. అందుకే సాధారణ ఆటపాటల్లో భాగంగా జరిగే వ్యాయామం వారిలోని అడ్డుపెంచే ప్రక్రియను అడ్డుకోలేదు. పైగా సాగినట్లుగా, వేలాడబడుతూ చేసే స్ట్రెచింగ్ వ్యాయామాలు వాళ్ల లాగ్ ల్యాగ్ ఫేజ్‌లను కొంత ప్రభావితం చేస్తూ ఒకింత ఎత్తు పెంచవచ్చు కూడా. అయితే మన ఎముకల్లో పెరిగే భాగాలు ఎముక చివరన ఉంటాయి. వీటిని గ్రోత్ ప్లేట్స్ అంటారు.



ముందుగానే నిర్ణయమవుతుంది. అందుకే తల్లిదండ్రులు ఎత్తుగా ఉంటే వాళ్ల పిల్లలు కూడా కాస్తంత ఎత్తుగానే ఉంటారు.

పిల్లలు ఎత్తు పెరగడంలో రెండు దశలుంటాయి. వాటిని లాగ్ ఫేజ్ అనీ, ల్యాగ్ ఫేజ్ అంటారు. ఇందులో లాగ్ ఫేజ్‌లో పిల్లలు ఒక దశలో అంటే పన్నెండు నుంచి పద్నాలుగు, పదహారేళ్ల వయసు మధ్య చటాలున అకస్మాత్తుగా ఎత్తుగా అవుతారు. ఆ తర్వాతి దశ ల్యాగ్ ఫేజ్. ఈ దశలో పెరుగుదల మందగించి... అది మందకొడిగా సాగుతూ... ఒకటి లేదా రెండు అంగుళాలు మాత్రం పెరిగి ఆ తర్వాత ఆగిపోతుంది. అది సాధారణంగా 18–21 ఏళ్ల మధ్య జరుగుతుంది. అంటే కొందరిలో అది 18 ఏళ్లకే ముగిస్తే... మరికొందరిలో చాలా స్వల్పంగా గరిష్టపరిమితంగా 21 ఏళ్ల వరకు సాగుతుంది.

మనం ఎదిగే వయసులో ఎక్కువ బరువుతో చాలా తీవ్రమైన వ్యాయామాలు చేస్తే అది గ్రోత్ ప్లేట్స్‌ను దెబ్బతీవయచ్చు. అలా గ్రోత్ ప్లేట్స్ దెబ్బతింటే మాత్రం ఎత్తుపెరగడం ఆగిపోవచ్చు. అందుకే ఈ దశలో వ్యాయామం ఆటల్లో భాగంగా ఉండటం లేదా స్ట్రెచింగ్‌కు పరిమితం కావడం లేదా తక్కువ బరువులతో ఎక్కువ రిపిటేషన్స్‌తో చేస్తుండటం వల్ల అది ఎత్తు ఎదగడానికి ప్రతిబంధకం కాబోదు. అందుకే పిల్లలు ఎక్సర్‌సైజ్ మొదలుపెడితే ఆందోళన పడకుండా వారిని ప్రోత్సహించాలి. అయితే... మరీ ఎక్కువ బరువులు ఎత్తకుండా తక్కువ బరువులు మాత్రమే ఎత్తుతూ ఎక్కువ రిపిటీషన్స్ చేయమనీ, స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయాలనీ, ఆటలకు ఎక్కువగా ఆడాలని చెప్పాలి.

సాక్షి భవిత
స్పర్ధయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com
సోమవారం 21-10-2019

## జేఈఈ అడ్వాన్స్‌డ్ 2020

# మరో పది వేల మంది




ఇంజనీరింగ్ స్పెషల్

**జేఈఈ మెయిన్ స్కోర్ ఆధారంగా హాజరుకు అనుమతి లభించే జేఈఈ-అడ్వాన్స్‌డ్ 2020లోనూ మార్పులు జరగనున్నాయి. కొత్త మార్పులపై అడ్వాన్స్‌డ్ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న ఐఐటీ-ఢిల్లీ ఇటీవల ప్రకటన కూడా చేసింది. మార్పుల వివరాలు..**

» 2.5 లక్షల మందికి అడ్వాన్స్‌డ్ హాజరుకు అవకాశం
» పరీక్ష రెండు పేపర్ల మధ్య విరామ సమయం పెంపు
» మే 17, 2020న జరుగనున్న జేఈఈ అడ్వాన్స్‌డ్

### అర్హుల సంఖ్య 2.5 లక్షలకు పెంపు

జేఈఈ మెయిన్ స్కోర్ ఆధారంగా అడ్వాన్స్‌డ్‌కు 2020 నుంచి 2.5 లక్షల మంది విద్యార్థులకు అవకాశం లభించనుంది. గతేడాది వరకు ఈ సంఖ్య 2.4 లక్షలే. తాజా నిర్ణయంతో అదనంగా మరో పది వేల మందికి ప్రయోజనం చేకూరనుంది.

### విరామ సమయం పెంపు

జేఈఈ-అడ్వాన్స్‌డ్‌ను ఒకే రోజు పేపర్-1, పేపర్-2.. ఇలా రెండు పేపర్లుగా నిర్వహిస్తున్నారు. రెండు పేపర్ల మధ్య విరామ సమయంలో మార్పు చేశారు. పేపర్ 1 ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు; పేపర్ 2 మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 5:30 గంటల వరకు జరుగనుంది. గతేడాది వరకు రెండో పేపర్ మధ్యాహ్నం రెండు గంటల నుంచి అయిదు గంటల వరకు జరిగేది. రెండు పేపర్ల మధ్య విరామ సమయం తక్కువగా ఉందంటూ విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తమైంది. దాంతోపాటు పరీక్ష హాల్లోకి అనుమతి పరంగా బయోమెట్రిక్ తనిఖీల కారణంగా జరుగుతున్న జాప్యాన్ని సైతం దృష్టిలో పెట్టుకొని విరామ సమయాన్ని పెంచినట్లు జేఈఈ అడ్వాన్స్‌డ్-2020 నిర్వాహక వర్గాలు పేర్కొన్నాయి.

### అమెరికాలోనూ పరీక్ష కేంద్రం

జేఈఈ-అడ్వాన్స్‌డ్ పరంగా పరీక్ష కేంద్రాల విషయంలోనూ మార్పు జరిగింది. జేఈఈ అడ్వాన్స్‌డ్-2020ను అమెరికాలోనూ నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకోసం శాన్ ఫ్రాన్సిస్కో ప్రాంతంలో ఏదో ఒక సెంటర్‌ను నిర్ణయించనున్నట్లు తెలిపారు. అదే సమయంలో అడీస్ అబాబా(ఇథియోపియా),కొలంబో(శ్రీలంక) సెంటర్లను రద్దు చేయనున్నారు. ఈ రెండు కేంద్రాల్లో అడ్వాన్స్‌డ్ పరీక్షకు హాజరయ్యే వారి సంఖ్య ఆశించనంతగా లేకపోవడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. మరోవైపు అమెరికాలోని ప్రవాస భారతీయుల పిల్లలు అడ్వాన్స్‌డ్ పరీక్షకు దరఖాస్తు చేసుకుంటుండటంతో ఆ దేశంలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఐఐటీ-ఢిల్లీ వర్గాలు పేర్కొన్నాయి.

### ఇన్‌స్టిట్యూట్‌లు.. సీట్ల వివరాలు..

జోసా (జాయింట్ సీట్ అలోకేషన్ అథారిటీ)-2019 కౌన్సెలింగ్ గణాంకాల ప్రకారం- దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో నాలుగేళ్ల బీటెక్, అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్+ఎంటెక్ కోర్సుల సీట్ల వివరాలు..

- ఐఐటీల సంఖ్య: 23
- నాలుగేళ్ల ఇంజనీరింగ్, అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్+ఎంటెక్ సీట్ల సంఖ్య: 12,463
- ఎన్ఐటీలు: 31
- నాలుగేళ్ల ఇంజనీరింగ్, అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్+ఎంటెక్ సీట్ల సంఖ్య: 20,428
- ట్రిపుల్ ఐటీలు: 26
- నాలుగేళ్ల ఇంజనీరింగ్, అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్+ఎంటెక్ సీట్ల సంఖ్య: 4617
- ఇతర కేంద్ర ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్‌లు: 30
- నాలుగేళ్ల ఇంజనీరింగ్, అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్+ఎంటెక్ సీట్ల సంఖ్య: 5769

**జేఈఈ-మెయిన్... ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర ఇన్‌స్టిట్యూట్‌లలో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష! అంతేకాకుండా ప్రతిష్టాత్మక ఐఐటీల్లో అడ్మిషన్స్ కోసం జరిపే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించాలన్నా.. జేఈఈ మెయిన్‌లో ప్రతిభ చూపాల్సిందే!! అందుకే జేఈఈ-మెయిన్‌కు ఏటా దాదాపు 12 లక్షల మంది పోటీ పడుతున్న పరిస్థితి! తాజాగా జేఈఈ మెయిన్-2020 పరీక్ష విధానంలో పలు కీలక మార్పులను ఎన్‌టీఏ ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. జేఈఈ మెయిన్‌లో ముఖ్య మార్పులు.. విద్యార్థులు అనుసరించాల్సిన ప్రిపరేషన్ వ్యూహాలపై విశ్లేషణ....**

## జేఈఈ మెయిన్-2020

# కీలక మార్పులు..!



» పరీక్ష విధానంతోపాటు ప్రశ్నల సంఖ్యలోనూ మార్పులు
» ప్రాధాన్యం సంతరించుకోనున్న న్యూమరికల్ ప్రశ్నలు
» కాన్సెప్ట్‌ల నుంచి కంప్యూటర్ టైపింగ్ వరకు.. పూర్తి పట్టు అవసరం అంటున్న నిపుణులు

**జే**ఈఈ మెయిన్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఏటా రెండుసార్లు నిర్వహిస్తోంది! జేఈఈ-మెయిన్ 2020 నుంచి అమలు చేయనున్న మార్పులను పరిశీలిస్తే.. అభ్యర్థుల్లో ఆయా సబ్జెక్ట్‌ల పట్ల అప్లికేషన్ అప్రోచ్, కాన్సెప్ట్‌లపై అవగాహనను పరీక్షించడమే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. తాజా మార్పులు విద్యార్థులను కొంత ఆందోళనకు గురి చేస్తున్నప్పటికీ.. కాన్సెప్ట్‌లపై పూర్తి అవగాహనతోపాటు, సమస్య సాధనలో అప్లికేషన్ అప్రోచ్‌ను అలవరచుకుంటే.. సులువుగానే రాణించొచ్చని సబ్జెక్ట్ నిపుణులు పేర్కొంటున్నారు.

### మార్పులు ఏంటి?

ఈ ఏడాది(2019) నుంచి ఏటా రెండుసార్లు జనవరి, ఏప్రిల్ నెలల్లో జేఈఈ-మెయిన్‌ను నిర్వహిస్తున్నారు. గతంలోనే పరీక్ష నిర్వహణ బాధ్యతలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి అప్పగించారు. జేఈఈ-మెయిన్ 2020కి సంబంధించి జనవరి సెషన్ నోటిఫికేషన్‌ను, అదే విధంగా ఏప్రిల్ సెషన్‌కు సంబంధించిన తేదీలను ఎన్‌టీఏ ఇటీవల ప్రకటించింది. ఈ నోటిఫికేషన్‌లోనే మార్పులకు శ్రీకారం చుట్టింది.

### ప్రశ్నల సంఖ్య తగ్గింపు

జేఈఈ-మెయిన్ 2020కి సంబంధించి ప్రధాన మార్పు.. ప్రశ్నల సంఖ్యను తగ్గించడం. గతేడాది వరకు జేఈఈ-మెయిన్‌లో మూడు విభాగాలు.. మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి 30 ప్రశ్నల చొప్పున మొత్తం 90 ప్రశ్నలతో 360 మార్కులకు పరీక్ష నిర్వహిస్తూ వచ్చారు. తాజామార్పు ప్రకారం- ఈ మూడు విభాగాల్లోనూ ప్రశ్నల సంఖ్య తగ్గింది. 90 ప్రశ్నలకు బదులు ప్రతి సబ్జెక్ట్ నుంచి 25 ప్రశ్నల చొప్పున మొత్తం 75 ప్రశ్నలు-మూడు వందల మార్కులకు పరీక్ష జరగనుంది.

### న్యూమరికల్ ప్రశ్నలు

జేఈఈ-మెయిన్ మార్పుల పరంగా అభ్యర్థులను ఆందోళనకు గురి చేస్తున్న అంశం.. కొత్తగా న్యూమరికల్ ప్రశ్నలు ఉంటాయని పేర్కొనడం. ప్రతి విభాగంలోని 25 ప్రశ్నల్లో.. 5 ప్రశ్నలు న్యూమరికల్ తరహావి. మిగతా 20 ప్రశ్నలు బహుళైచ్ఛిక విధానంలో ఉంటాయి. అంటే.. ఇక నుంచి ఎంసీక్యూలతోపాటు న్యూమరికల్ ప్రశ్నలకు విద్యార్థులు సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. న్యూమరికల్ ప్రశ్నలకు సమాధానాలు గుర్తించడం కొంత కష్టమని విద్యార్థులు భావిస్తుండటమే ఆందోళనకు కారణం. అయితే సబ్జెక్టుపై పట్టుతోపాటు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా న్యూమరికల్ ప్రశ్నలను సమర్థంగా ఎదుర్కోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

### ఆర్కిటెక్చర్, ప్లానింగ్ వేర్వేరు

- జేఈఈ-మెయిన్‌లో బీటెక్‌తోపాటు బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(బీఆర్క్), బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్(బీప్లానింగ్) కోర్సులకు ప్రత్యేకంగా పరీక్ష నిర్వహిస్తున్నారు. వీటిల్లోనూ 2020 నుంచి మార్పులు చేశారు.
- గతేడాది వరకు బీఆర్క్, బీప్లానింగ్ కోర్సుల ఔత్సాహికులకు పేపర్-2 ఒకటే ఉండేది. కానీ 2020 నుంచి బీఆర్క్‌కు, బీప్లానింగ్‌కు కూడా వేర్వేరు పేపర్లు ఉంటాయి.
- బీఆర్క్ పేపర్‌లో మ్యాథమెటిక్స్‌కు సంబంధించి గతేడాది వరకు 30 ప్రశ్నలు ఉంటే.. 2020 నుంచి 25 ప్రశ్నలే అడగనున్నారు. ఇందులో 5 ప్రశ్నలు న్యూమరికల్ తరహావి ఉంటాయి.
- బీఆర్క్ పేపర్‌లోని డ్రాయింగ్ టెస్ట్‌లో ప్రశ్నల సంఖ్యను రెండుకు పెంచారు. వీటికి వంద మార్కులు కేటాయించారు. ఇప్పటి వరకు డ్రాయింగ్ టెస్ట్‌లో ఒక ప్రశ్న(70 మార్కులు) మాత్రమే ఉండేది. బీఆర్క్ పేపర్.. ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదు. ఆప్టిట్యూడ్ టెస్ట్ గతంలో మాదిరిగానే 50 ప్రశ్నలు-200 మార్కులకు బహుళైచ్ఛిక విధానంలో జరుగనుంది.

### బీప్లానింగ్ పేపర్ కొత్తగా

కొత్తగా చేర్చిన బీప్లానింగ్ పేపర్ మూడు విభాగాల్లో జరగనుంది. ఇందులో మ్యాథమెటిక్స్(25 ప్రశ్నలు-100 మార్కులు); ఆప్టిట్యూడ్ టెస్ట్ (50 ప్రశ్నలు-200 మార్కులు); ప్లానింగ్ ఆధారిత ప్రశ్నలు (25 ప్రశ్నలు-100 మార్కులు) ఉంటాయి. మ్యాథమెటిక్స్‌లో 5 ప్రశ్నలు న్యూమరికల్ తరహావి అడుగుతారు. ప్లానింగ్‌కు సంబంధించి జనరల్ అవేర్‌నెస్ ప్రశ్నలతోపాటు, విశ్లేషణ నైపుణ్యాలను పరీక్షించే ప్రశ్నలు, గ్రాఫ్‌లు, చార్ట్‌లు, మ్యాప్ రీడింగ్ ఆధారిత ప్రశ్నలు ఎదురవుతాయి.

### జేఈఈ-మెయిన్ - 2020 (జనవరి, ఏప్రిల్) విధానం

**బీటెక్/బీఈ పరీక్ష విధానం**

| సబ్జెక్ట్ | ప్రశ్నలు | మార్కులు |
|---|---|---|
| మ్యాథమెటిక్స్ | 25 | 100 |
| ఫిజిక్స్ | 25 | 100 |
| కెమిస్ట్రీ | 25 | 100 |
| మొత్తం | 75 | 300 |

- ప్రతి విభాగంలో అయిదు న్యూమరికల్ వాల్యూ ఆధారిత ప్రశ్నలు ఉంటాయి.

**బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ పరీక్ష విధానం**

| సబ్జెక్ట్ | ప్రశ్నలు | మార్కులు |
|---|---|---|
| మ్యాథమెటిక్స్ | 25 | 100 |
| ఆప్టిట్యూడ్ టెస్ట్ | 50 | 200 |
| డ్రాయింగ్ టెస్ట్ | 02 | 100 |
| మొత్తం | 77 | 400 |

- మ్యాథమెటిక్స్ విభాగంలో అయిదు న్యూమరికల్ తరహా ప్రశ్నలు ఉంటాయి.

**బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ పరీక్ష విధానం**

| సబ్జెక్ట్ | ప్రశ్నలు | మార్కులు |
|---|---|---|
| మ్యాథమెటిక్స్ | 25 | 100 |
| ఆప్టిట్యూడ్ టెస్ట్ | 50 | 200 |
| ప్లానింగ్ బేస్డ్ ఆబ్జెక్టివ్ కొశ్చన్స్ | 25 | 100 |
| మొత్తం | 100 | 400 |

- మ్యాథమెటిక్స్ విభాగంలో అయిదు న్యూమరికల్ తరహా ప్రశ్నలు అడుగుతారు.

### సబ్జెక్ట్ వారీగా.. ముఖ్య టాపిక్స్..

#### ఫిజిక్స్

- ఫిజిక్స్.. వాస్తవానికి న్యూమరికల్, అప్లికేషన్ అప్రోచ్ ఎక్కువగా ఉండే సబ్జెక్ట్. ఇందులో మంచి మార్కుల సాధనకు ఎలక్ట్రో డైనమిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్,మెకానిక్స్,మోడ్రన్ ఫిజిక్స్, ఆప్టిక్స్, ఎస్‌హెచ్ఎం అండ్ వేవ్స్‌కు ప్రాధాన్యమివ్వాలి. వీటితోపాటు సెంటర్ ఆఫ్ మాస్, మూమెంటమ్ అండ్ కొలిజన్; సింపుల్ హార్మోనిక్ మోషన్, వేవ్ మోషన్ అండ్ స్ట్రింగ్ వేవ్స్‌పై లోతైన అవగాహన పెంచుకోవాలి. ప్రాథమిక భావనలను వాస్తవ పరిస్థితులతో అన్వయించుకుంటూ.. ప్రాక్టీస్ చేయాలి. తద్వారా న్యూమరికల్ వాల్యూ ఆధారిత ప్రశ్నలకు సులువుగా సమాధానం ఇచ్చే నైపుణ్యం లభిస్తుంది.

#### మ్యాథమెటిక్స్

ఇందులో 3-డి జామెట్రీ; కో ఆర్డినేట్ జామెట్రీ; వెక్టార్ అల్జీబ్రా; ఇంటిగ్రేషన్; కాంప్లెక్స్ నెంబర్స్; పారాబోలా; ట్రిగ్నోమెట్రిక్ రేషియోస్; క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్; థియరీ ఆఫ్ ఈక్వేషన్స్;పెర్ముటేషన్ అండ్ కాంబినేషన్; బైనామియల్ థీరమ్; లోకస్ అంశాలపై పూర్తిస్థాయి అవగాహన ఏర్పరచుకోవాలి.

#### కెమిస్ట్రీ

మిగతా రెండు విభాగాలతో పోల్చితే కాస్త సులభంగా ఉండే సబ్జెక్ట్.. కెమిస్ట్రీ. కెమిస్ట్రీ నుంచీ న్యూమరికల్ వాల్యూ ఆధారిత ప్రశ్నలు అడగనున్నారు. ముఖ్యంగా గత ప్రశ్న పత్రాలను పరిశీలిస్తే.. కెమికల్ బాండింగ్, పిరియాడిక్ టేబుల్, బ్రేకింగ్ మూలాలపై అవగాహనను పరీక్షించేలా ప్రశ్నలు ఉంటాయి. కాబట్టి మోల్ కాన్సెప్ట్, కోఆర్డినేషన్ కెమిస్ట్రీ, ఆల్కహాల్, ఫినాల్స్, ఈథర్స్, పి-బ్లాక్ ఎలిమెంట్స్, అటామిక్ స్ట్రక్చర్, గ్యాసియస్ స్టేట్, ఆల్డిహైడ్స్ అండ్ కీటోన్స్, జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, డి అండ్ ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్‌పై పట్టు సాధించాలి.

### జేఈఈ-మెయిన్-2020 సమాచారం

» **జేఈఈ-మెయిన్ జనవరి, 2020 సెషన్ పరీక్ష తేదీలు:** జనవరి 6-జనవరి 11, 2020 (మొత్తం ఎనిమిది స్లాట్లలో రోజుకు రెండు షిఫ్టులలో పరీక్ష జరుగుతుంది).
» **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం:** డిసెంబర్ 6, 2019 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
» **ఫలితాల వెల్లడి:** జనవరి 31, 2020
» **జేఈఈ-మెయిన్ ఏప్రిల్, 2020 సెషన్ పరీక్ష తేదీలు:** ఏప్రిల్ 3-ఏప్రిల్ 9, 2020. దీనికి సంబంధించి ఫిబ్రవరి నెలలో నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది.
» విద్యార్థులు దరఖాస్తు సమయంలో నిర్దేశిత తేదీల్లో అందుబాటులో ఉన్న స్లాట్లలో తమకు నచ్చిన స్లాట్‌ను బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.
» **వివరాలకు వెబ్‌సైట్:** https://jeemain.nta.nic.in

### టైమ్ మేనేజ్‌మెంట్, ప్రాక్టీస్

**జే**ఈఈ-మెయిన్‌లో ఉత్తమ స్కోర్ సాధించేందుకు.. విద్యార్థులు సొంత టైమ్ టేబుల్ రూపొందించుకోవాలి. ఒక్కో సబ్జెక్ట్‌కు నిర్దిష్టంగా సమయం కేటాయించాలి. చదివే ప్రతి అంశాన్ని వాస్తవ పరిస్థితులతో అన్వయం చేసుకుంటూ అభ్యసనం సాగించాలి. అన్ని సబ్జెక్ట్‌లకు సంబంధించి ప్రాక్టీస్ చాలా కీలకం. చివరి రెండు నెలల సమయంలో పూర్తి స్థాయి రివిజన్ చేసుకోవాలి. ఒక వేళ జనవరిలో సరిగా రాయలేని విద్యార్థులు.. ఆ ఫలితాలను విశ్లేషించుకొని.. పొరపాట్లు సరిదిద్దుకొని.. ఏప్రిల్ సెషన్ పరీక్షకు సన్నద్ధం కావాలి. అంతేకాకుండా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌లో రాణించేందుకు ఇప్పటి నుంచే కంప్యూటర్ టైపింగ్ పరిజ్ఞానం పెంచుకోవాలి. ఇందుకోసం మాక్ టెస్ట్‌లకు హాజరు కావడం, ఎన్‌టీఏ అందుబాటులో ఉంచిన ప్రాక్టీస్ టెస్ట్ సెంటర్లను వినియోగించుకోవడం మేలు చేస్తుంది.

– ఆర్.కేదారేశ్వర్, డైరెక్టర్, విజన్-40 అకాడమీ

---

# ఇంటర్‌తోనే.. సైన్యంలో కొలువు

**భారత రక్షణ దళాల్లో ఒకటైన ఇండియన్ ఆర్మీలో చేరాలనుకునే అభ్యర్థులకు 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ సువర్ణావకాశం. ఇంటర్‌తోనే చిన్న వయసులోనే ఆర్మీలో చేరి ఉజ్వల కెరీర్‌ను సొంతం చేసుకోవచ్చు. ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ, మెడికల్ టెస్టు ద్వారా ఎంపిక జరుగుతుంది. ఎంపికైన అభ్యర్థులకు ఐదేళ్ల శిక్షణ అనంతరం ఇంజనీరింగ్ డిగ్రీతోపాటు పర్మనెంట్ కమిషన్‌లో ఆఫీసర్లుగా ఉన్నత కొలువు ఖాయమవుతుంది. 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ ద్వారా 90 ఖాళీల భర్తీకి ఇండియన్ ఆర్మీ నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో.. అర్హతలు.. ఎంపిక విధానం... ఆర్మీ కెరీర్‌పై ప్రత్యేక కథనం...**

» 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ నోటిఫికేషన్ విడుదల
» ఎంపికైతే ఉచిత శిక్షణ, కోర్సుతోపాటు ఉన్నత కొలువు
» దరఖాస్తులకు చివరి తేది: 13.11.2019



ఆర్మీ కెరీర్

ప్రస్తుత పరిస్థితుల్లో పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను అభ్యసించడం, ఉన్నత స్థాయి ఉద్యోగం సంపాదించడం అంత సులువైన విషయం కాదు. ఎలాంటి ఖర్చు లేకుండానే.. ఉన్నత విద్య, ఉద్యోగంతోపాటు దేశానికి సేవ చేసే అవకాశం కల్పిస్తోంది.. ఇండియన్ ఆర్మీ! ఉచిత భోజన, వసతి సౌకర్యం, నాణ్యమైన శిక్షణ, ఇంజనీరింగ్ డిగ్రీ, ఉన్నతస్థాయి కొలువు..ప్రతిభకు తగ్గ ప్రమోషన్లు, మంచి వేతనాలు, సుస్థిరమైన, గౌరవప్రదమైన జీవితం... ఇవన్నీ ఇంటర్‌తోనే!!

### అర్హతలు

- భారత పౌరసత్వం కలిగిన అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.
- గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్మీడియట్(10+2) ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ సబ్జెక్టుల్లో 70 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.
- జనవరి 2, 2001 నుంచి జనవరి 1, 2004 మధ్య జన్మించిన వారై ఉండాలి.
- అభ్యర్థి 16 1/2 ఏళ్ల నుంచి 19 1/2 మధ్య వయసు కలిగి ఉండాలి.
- పదోతరగతి లేదా ఇంటర్(10+2) మెమోలో ఉన్న పుట్టిన తేదీని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు.
- ఎత్తు: కనీసం 157.5 సెంటీ మీటర్లు ఉండాలి.

### ఎంపిక ప్రక్రియ

- ఇంటర్‌లో సాధించిన మెరిట్ మార్కుల ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. జాబితాలో చోటు సంపాదించిన వారికి ఐదు రోజులపాటు అలహాబాద్, భోపాల్, బెంగళూర్, కపుర్తలా.. ఇలా ఏదో ఒక ప్రాంతంలో సైకలాజికల్ టెస్ట్, గ్రూప్ టెస్ట్‌లను సర్వీస్ సెలక్షన్ బోర్డ్(ఎస్ఎస్‌బీ) నిర్వహిస్తుంది. ఇది రెండు దశల్లో జరుగుతుంది. మొదటి దశలో ఉత్తీర్ణత సాధించిన వారిని మాత్రమే... రెండో దశకు ఎంపిక చేస్తారు. రెండు దశల్లోనూ ప్రతిభ చూపిన అభ్యర్థులకు చివరిగా మెడికల్ టెస్ట్ ఉంటుంది.
- అన్ని దశల్లో అర్హత సాధించిన అభ్యర్థులను ఉన్న ఖాళీలకు అనుగుణంగా ఫైనల్‌గా ట్రెయినింగ్‌కు ఎంపిక చేస్తారు.

### ఉజ్వల కెరీర్

ఆర్మీలో కెరీర్‌కు ఎటువంటి ఢోకా లేదు. అది హోదా విషయంలో కానీ వేతనాల విషయంలో కానీ ఉజ్వల కెరీర్ సొంతమవుతుంది. శిక్షణ అనంతర మంచి వేతనాలు, డీఏ, హెచ్ఆర్ఏతో పాటు ఇతర ప్రోత్సాహకాలు అందుతాయి. లెఫ్టినెంట్ హోదాతో కెరీర్ ప్రారంభించిన రెండేళ్లకు కెప్టెన్, ఆరేళ్లకు మేజర్, పదమూడేళ్లకు లెఫ్టినెంట్ కల్నల్, ఇరవై ఆరేళ్లకు కల్నల్.. ఇలా వివిధ హోదాల్లో ప్రమోషన్లు పొందుతారు. భవిష్యత్తులో పనితీరు ఆధారంగా విభాగానికి అధిపతి అయ్యే అవకాశం కూడా ఉంటుంది.

### వేతనాలు

- ఆర్మీలో హోదాను బట్టి వేతనాలు కూడా పెరుగుతూ ఉంటాయి.

| ర్యాంకు | లెవల్ | వేతనం |
|---|---|---|
| లెఫ్టినెంట్ | 10 | 56,100-1,77,500 |
| కెప్టెన్ | 10బి | 61,300-1,93,900 |
| మేజర్ | 11 | 69,400-2,07,200 |
| లెఫ్టినెంట్ కల్నల్ | 12 ఏ | 1,21,200-2,12,400 |
| కల్నల్ | 13 | 1,30,600-2,15,900 |

- హోదా పెరిగేకొద్దీ వేతనాలు.. అందుకు అనుగుణంగా అలవెన్సులు, ఇతర ప్రోత్సాహకాలు కూడా అందుతాయి. ఒక్క లెఫ్టినెంట్‌కే మిలటరీ సర్వీస్ పే(ఎమ్ఎస్‌పీ) కింద నెలకు రూ15,500 కూడా అందుతాయి. అలాగే అర్హులైన ఉద్యోగులకు హయ్యర్ క్వాలిఫికేషన్ ఇన్సెంటివ్స్, ఫ్లైయింగ్ అలవెన్సు కింద నెలకు రూ. 25,000, కిట్ మెయింటనెన్స్ కింద ఏడాది రూ.20,000, పిల్లలకు నర్సరీ నుంచి 12వ తరగతి వరకు చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అలవెన్స్, ఫ్రీ రేషన్.. ఇలా ఒక్కటేమిటి చాలా రకాల ప్రోత్సాహకాలు ఆర్మీ ఉద్యోగులకు లభిస్తాయి.

### శిక్షణ ఇలా

- ఆర్మీ 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ కోర్సుల్లో చేరిన వాళ్లకి ఐదేళ్లపాటు శిక్షణ ఉంటుంది.

#### బేసిక్ ట్రైనింగ్

మొదటి ఏడాది బీహార్‌లోని గయలో ఉన్న ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడెమీలో బేసిక్ మిలిటరీ ట్రైనింగ్ ఇస్తారు.

#### టెక్నికల్ ట్రైనింగ్

- బేసిక్ ట్రెయినింగ్ పూర్తి చేసిన అనంతరం నాలుగేళ్లపాటు టెక్నికల్ ట్రెయినింగ్ ఉంటుంది. ఈ టెక్నికల్ ట్రెయినింగ్ రెండు ఫేజ్‌ల్లో జరుగుతుంది. ఫేజ్-1 కింద మూడేళ్ల పాటు ప్రీ కమిషన్ ట్రెయినింగ్ ఇస్తారు. అనంతరం ఫేజ్-2 కింద ఏడాదిపాటు పోస్ట్ కమిషన్ ట్రెయినింగ్ అందిస్తారు. రెండు ఫేజ్‌ల్లో ట్రెయినింగ్ సీఎంఈ పూణే, ఎంసీటీఈ, మావ్, ఎంసీఈఎంఈ సికింద్రాబాద్‌ల్లో నిర్వహిస్తారు.

#### ట్రైనింగ్ తర్వాత

- ట్రెయినింగ్‌లో ఎంపికైన అభ్యర్థులు ఎలక్ట్రికల్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్ ,ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సు చదువుతారు. మూడేళ్ల ట్రైనింగ్ అనంతరం అభ్యర్థులకు నెలకు రూ.56,100 చొప్పున స్టైపెండ్ లభిస్తుంది. నాలుగేళ్ల ట్రైనింగ్ పూర్తిచేసిన అభ్యర్థులకు పూర్తి వేతనం అందుతుంది.
- విజయవంతంగా కోర్సు పూర్తిచేసిన వారికి జేఎన్‌యూ డిగ్రీ పట్టాను ప్రధానం చేస్తారు.
- డిగ్రీ పట్టాను పొందిన అభ్యర్థులను లెఫ్టినెంట్ హోదాతో విధుల్లోకి తీసుకొని పర్మినెంట్ ఉద్యోగులుగా పరిగణిస్తారు.

### తెలుగు వాళ్లు తక్కువ

ప్రతి ఏడాది ఆర్మీ టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ కోర్సుకు నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. అయితే ఇందులో అర్హత సాధించే వాళ్లలో తెలుగు వారి సంఖ్య తక్కువనే చెప్పాలి. ఐఐటీ, జేఈఈ లాంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో సత్తా చాటగలిగే మన విద్యార్థులు.. ఇటువంటి ఉన్నతమైన ఉద్యోగాలపై దృష్టి సారించడంలేదని నిపుణులు పేర్కొంటున్నారు. వాస్తవానికి దక్షిణాది నుంచి ఆర్మీలో చేరే వారి సంఖ్య తక్కువగానే ఉంటుంది. అందులో మన తెలుగు ప్రాంతాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి మరీ తక్కువ. దీనికి ప్రధాన కారణం రక్షణ రంగ కొలువులపై ఇంటర్ స్థాయి విద్యార్థులకు అవగాహన లేకపోవడమే కారణమని చెబుతున్నారు.

### దరఖాస్తు విధానం

- ఇండియన్ ఆర్మీ 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ కోర్సుకు దరఖాస్తు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో చేయాల్సి ఉంటుంది.
- దరఖాస్తులో ఏమైనా తప్పులు ఉంటే ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ముగిసే వరకు ఎడిట్ ఆప్షన్ ఉంటుంది. దరఖాస్తు తేదీలు ముగిసిన తర్వాత ఎటువంటి మార్పులకు అవకాశం ఉండదు.
- దరఖాస్తు ప్రక్రియ పూర్తైన తర్వాత దాని రెండు కాపీల ప్రింట్ తీసుకోవాలి. రెండు దశల్లో జరిగే ఎంపిక ప్రక్రియలో దరఖాస్తు కాపీలను కూడా తీసుకెళ్లాల్సి ఉంటుంది.

### పరీక్ష ఫీజు

ఆర్మీ టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ కోర్సుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఎటువంటి దరఖాస్తు ఫీజు లేదు.

### ముఖ్యమైన తేదీలు

» **దరఖాస్తు ప్రారంభ తేదీ:** అక్టోబర్ 10, 2019
» **దరఖాస్తు ముగింపు తేదీ:** నవంబర్ 13, 2019
» **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

## 'లేదంటే ఏదో జరిగిపోయేది'

ఓపెనర్‌గా ఆడటం నాకు దక్కిన మంచి అవకాశం. దానిని సమర్థంగా వాడుకోవడం నాకు ఎంతో అవసరం. లేదంటే ఏదో జరిగిపోయేదే. ఆ విషయం నాకు తెలుసు. నా గురించి మీడియా మొత్తం ఎంతో రాసి పడేసేది. ఇప్పుడు నాలుగు మంచి మాటలే రాయగలరు. బ్యాటింగ్ చేసేటప్పుడు మనకు రికార్డుల గురించి తెలియదు. అయితే భవిష్యత్తులో నేను ఆడటం ఆపేసిన తర్వాత ఈ రికార్డుల గురించి తెలుసుకుంటా. ఓపెనర్‌గా మూడు టెస్టులే ఆడాను. నేను ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది. ఈ మూడు మ్యాచ్‌ల గురించి అతిగా ఆలోచించడం లేదు. విదేశాల్లో ఓపెనింగ్ చేసినా ఆట మూలసూత్రాలు ఒక్కటే. ఏ బంతిని ఆడాలి, దేనిని వదిలేయాలో అర్థం చేసుకోవాలి. విదేశీ సిరీస్‌లు నాకు పెద్ద సవాల్‌లాంటివని తెలుసు. దాని కోసం సిద్ధంగా ఉన్నా. –రోహిత్ శర్మ

# రోహిత్ డబుల్ సఫారీ ట్రబుల్

### రోహిత్ శర్మ ద్విశతకం • రహానే సెంచరీ
### భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 497/9 డిక్లేర్డ్ • దక్షిణాఫ్రికా 9/2
### రాంచీలో రెండో రోజూ వెలుతురులేమితో అంతరాయం


రోహిత్ శర్మ

**స్కోరు వివరాలు**

**భారత్ తొలి ఇన్నింగ్స్:** మయాంక్ (సి) ఎల్గర్ (బి) రబడ 10; రోహిత్ (సి) ఇన్‌గిడి (బి) రబడ 212; పుజారా (ఎల్బీ) (బి) రబడ 0; కోహ్లి (ఎల్బీ) (బి) నోర్జే 12; రహానే (సి) క్లాసెన్ (బి) లిండే 115; జడేజా (సి) క్లాసెన్ (బి) లిండే 51; సాహా (బి) లిండే 24; అశ్విన్ (స్టంప్డ్) క్లాసెన్ (బి) పీట్ 14; ఉమేశ్ (సి) క్లాసెన్ (బి) లిండే 31; నదీమ్ (నాటౌట్) 1; షమీ (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (116.3 ఓవర్లలో 9 వికెట్లకు డిక్లేర్డ్) 497.**
**వికెట్ల పతనం:** 1–12, 2–16, 3–39, 4–306, 5–370, 6–417, 7–450, 8–464, 9–482.
**బౌలింగ్:** రబడ 23–7–85–3, ఇన్‌గిడి 20–5–83–0, నోర్జే 24.3–5–79–1, లిండే 31–2–133–4, పీట్ 18–3–101–1.

**దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** ఎల్గర్ (సి) సాహా (బి) షమీ 0; డి కాక్ (సి) సాహా (బి) ఉమేశ్ 4; హమ్జా (బ్యాటింగ్) 0; డు ప్లెసిస్ (బ్యాటింగ్) 1; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (5 ఓవర్లలో 2 వికెట్లకు) 9.**
**వికెట్ల పతనం:** 1–4, 2–8. **బౌలింగ్:** షమీ 1–1–0–1, ఉమేశ్ 1–0–4–1, నదీమ్ 2–2–0–0, జడేజా 1–0–1–0.

**రాంచీ టెస్టులో భారత్‌కు రెండో రోజే పట్టు లభించింది. తొలి రోజు సెంచరీని డబుల్ సెంచరీగా మలచి రోహిత్ పలు రికార్డులను కొల్లగొట్టగా, రహానే ఖాతాలో కూడా శతకం చేరింది. జడేజా, ఉమేశ్ కూడా తలా ఓ చేయి వేయడంతో భారీ స్కోరుతో భారత్ చెలరేగింది. ఆదివారం ఏకంగా 4.67 రన్‌రేట్‌తో భారత్ పరుగులు సాధించడం విశేషం. అనంతరం వేసిన ఐదు ఓవర్లలోనే దక్షిణాఫ్రికాను టీమిండియా ఒక ఆటాడుకుంది. 9 పరుగులకే ఓపెనర్లను వెనక్కి పంపి రాబోయే ప్రమాదానికి సంకేతాలు పంపింది. అప్పడే పొడిబారిన పిచ్‌పై బంతి అష్టవంకర్లు తిరుగుతుండటంతో తడబడుతున్న సఫారీలు ఎంత వరకు నిలబడగలరో చూడాలి. మొదటి రోజులాగే ఆదివారం కూడా వెలుతురులేమి సమస్యగా మారడంతో 63.3 ఓవర్ల ఆట మాత్రమే జరిగింది.**

**రాంచీ:** దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టులో భారత్ జోరు కొనసాగుతోంది. మ్యాచ్ రెండో రోజు ఆదివారం ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తమ తొలి ఇన్నింగ్స్‌లో 9 పరుగులకే 2 వికెట్లు కోల్పోయింది. ప్రస్తుతం జుబేర్ హమ్జా (0 బ్యాటింగ్), డు ప్లెసిస్ (1 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు. అంతకు ముందు భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌ను 9 వికెట్లకు 497 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఓపెనర్ రోహిత్ శర్మ (255 బంతుల్లో 212; 28 ఫోర్లు, 6 సిక్సర్లు) టెస్టు కెరీర్‌లో తొలి డబుల్ సెంచరీ నమోదు చేయగా.... అజింక్య రహానే (192 బంతుల్లో 115; 17 ఫోర్లు, 1 సిక్స్) శతకం పూర్తి చేసుకున్నాడు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 267 పరుగులు జోడించారు. రవీంద్ర జడేజా (119 బంతుల్లో 51; 4 ఫోర్లు) కూడా అర్ధ సెంచరీ సాధించాడు. సఫారీ బౌలర్లలో లిండేకు 4 వికెట్లు దక్కాయి.

**రోహిత్ అదే జోరు...**

ఓవర్‌నైట్ వ్యక్తిగత స్కోరు 117తో బ్యాటింగ్ కొనసాగించిన రోహిత్ శర్మ రెండో రోజు కూడా చక్కటి షాట్లతో అలరించాడు. సఫారీ పేసర్లు అతనిపై ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. ఇన్‌గిడి వేసిన ఒకే ఓవర్లో మూడు ఫోర్లు కొట్టిన అతను 199 బంతుల్లో 150 పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. ఆ తర్వాత అతను మరింత వేగంగా ద్విశతకం దిశగా దూసుకుపోయాడు. 179 పరుగుల వద్ద పీట్ బౌలింగ్‌లో దక్షిణాఫ్రికా చేసిన ఎల్బీ అప్పీల్‌ను అంపైర్ తిరస్కరించాడు. డు ప్లెసిస్ రివ్యూ చేసినా ఫలితం ప్రతికూలంగా రావడంతో రోహిత్‌కు మరో అవకాశం దక్కింది. నోర్జే ఓవర్లో వరుసగా రెండు ఫోర్లతో 190ల్లోకి చేరుకున్న 'ముంబైకర్' లంచ్ సమయానికి 199 వద్ద నిలిచాడు. విరామం తర్వాత పీట్ వేసిన మూడో ఓవర్ తొలి బంతికి భారీ సిక్సర్ బాదడంతో రోహిత్ డబుల్ సెంచరీ పూర్తయింది. అదే ఓవర్లో అతను మరో సిక్స్ కొట్టాడు. అయితే మరో నాలుగు బంతుల తర్వాత ఈ అద్భుత ఇన్నింగ్స్ ముగిసింది. రబడ బంతిని హుక్ షాట్ ఆడబోయిన రోహిత్ ఫైన్ లెగ్ బౌండరీ వద్ద క్యాచ్ ఇచ్చాడు.


రహానే

**రాణించిన జడేజా...**

తొలి రోజు 83 పరుగులతో అజేయంగా నిలిచిన రహానేకు ఆదివారం సెంచరీ చేరుకోవడానికి ఎక్కువసేపు పట్టలేదు. ముగ్గురు పేసర్ల ఓవర్లలో ఒక్కో ఫోర్ కొట్టిన అతను ఆ తర్వాత నోర్జే బౌలింగ్‌లో కవర్ పాయింట్ దిశగా సింగిల్ తీసి 169 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 2016 తర్వాత స్వదేశంలో రహానే సెంచరీ చేయడం ఇదే తొలిసారి. శతకం సాధించిన కొద్ది సేపటికే లిండే బౌలింగ్‌లో కీపర్ క్లాసెన్‌కు క్యాచ్ ఇచ్చి రహానే పెవిలియన్ చేరాడు. లిండేకు ఇది తొలి టెస్టు వికెట్ కాగా, క్లాసెన్‌కు తొలి క్యాచ్. మరోసారి ఆరో స్థానానికి ప్రమోట్ అయిన జడేజా తనదైన శైలిలో చకచకా పరుగులు సాధించాడు. సాహా (24)తో కలిసి ఆరో వికెట్‌కు 47 పరుగులు, అశ్విన్ (14)తో ఏడో వికెట్‌కు అతను 33 పరుగులు జోడించాడు. 118 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న జడేజా ఎప్పటిలాగే 'కత్తి సాము' సంబరాలు చేసుకున్నాడు. అయితే తర్వాతి బంతికే అతను వెనుదిరిగాడు.


జడేజా

**దక్షిణాఫ్రికాకు సంకటం...**

ప్రత్యర్థి భారీ స్కోరు ఎదురుగా కనిపిస్తుండగా ఈసారైనా కొంత మెరుగైన ప్రదర్శన కనబర్చాలని బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా రాత ఏమీ మారలేదు. వెలుతురులేమితో ఆట ఆగిపోవడానికి ముందు సాగిన ఐదు ఓవర్లలోనే జట్టు బ్యాట్స్‌మెన్ చేతులెత్తేశారు. ఇన్నింగ్స్ రెండో బంతికే ఎల్గర్ (0)ను షమీ అవుట్ చేయగా, ఉమేశ్ వేసిన తర్వాతి ఓవర్లో డి కాక్ (4) వెనుదిరిగాడు. తొలి టెస్టు ఆడుతున్న నదీమ్ రెండు ఓవర్లు కూడా మెయిడిన్‌గా వేయగా... హమ్జా, డు ప్లెసిస్ కలిసి తడబడుతూ 22 బంతుల్లో ఒక పరుగు చేసి ఎలాగో ఆట ముగించగలిగారు.

### రికార్డుల వరద...



ఆదివారం వీరేంద్ర సెహ్వాగ్ పుట్టిన రోజు... తాజా సిరీస్‌లో రోహిత్ శర్మ తొలిసారి ఓపెనర్‌గా బరిలోకి దిగినప్పుడు బ్యాటింగ్ శైలి, దూకుడులో వీరూతో పోలికలు మొదలయ్యాయి. భవిష్యత్ సంగతేమో కానీ ప్రస్తుతానికి మాత్రం రోహిత్ తన సీనియర్‌ను మరపించాడు. రాంచీ టెస్టులో సిక్సర్‌తో డబుల్ సెంచరీ పూర్తి చేసుకున్నప్పుడైతే సరిగ్గా అందరికీ సెహ్వాగే గుర్తుకొచ్చాడు. ఈ ఇన్నింగ్స్‌లో సెంచరీ మార్క్‌ను కూడా సిక్సర్‌తోనే అందుకున్నాడు. తాజా డబుల్‌తో రోహిత్ అనేక చెప్పుకోదగ్గ ఘనతలు నమోదు చేశాడు.

**4** సచిన్, సెహ్వాగ్, క్రిస్ గేల్ తర్వాత టెస్టులు, వన్డేల్లోనూ డబుల్ సెంచరీ సాధించిన నాలుగో బ్యాట్స్‌మన్ రోహిత్.

**1** ఒకే సిరీస్‌లో ముగ్గురు భారత బ్యాట్స్‌మెన్ డబుల్ సెంచరీలు చేయడం ఇదే తొలిసారి. వైజాగ్‌లో మయాంక్, పుణేలో కోహ్లి ద్విశతకాలు సాధించారు. అయితే 1955–56లో న్యూజిలాండ్‌తో సిరీస్‌లో మూడు డబుల్ సెంచరీలు నమోదైనా...వీటిలో రెండు వినూ మన్కడ్ చేయగా, మరొకటి పాలీ ఉమ్రిగర్ సాధించాడు.

**99.84** స్వదేశంలో రోహిత్ బ్యాటింగ్ సగటు. 18 ఇన్నింగ్స్‌లలో అతను 6 సెంచరీలు, 5 అర్ధసెంచరీలతో 1298 పరుగులు చేశాడు. సొంతగడ్డపై కనీసం 10 ఇన్నింగ్స్‌లు ఆడిన బ్యాట్స్‌మెన్ సగటుల జాబితా తీసుకుంటే ఆస్ట్రేలియా దిగ్గజం డాన్ బ్రాడ్‌మన్ (98.22)కంటే ఇది ఎక్కువ కావడం విశేషం.

**529** ఈ సిరీస్‌లో రోహిత్ చేసిన పరుగులు. గావస్కర్ (3 సార్లు), సెహ్వాగ్, వినూ మన్కడ్, బుద్ధి కుందేరన్ తర్వాత ఒకే సిరీస్‌లో 500కు పైగా పరుగులు చేసిన ఐదో భారత ఓపెనర్ రోహిత్. అయితే 3 టెస్టుల సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాళ్ల జాబితాలో కోహ్లి (610), సెహ్వాగ్ (544), గంగూలీ (534) తర్వాత రోహిత్ నాలుగో స్థానంలో నిలవగా, వీవీఎస్ లక్ష్మణ్ (503) ఐదో స్థానంలో ఉన్నాడు.

**ఉమేశ్ మెరుపులు...**

6, 6, 0, 1, 6, 0, 6, 0, 6, అవుట్... ఉమేశ్ యాదవ్ బ్యాటింగ్ జోరు ఇది. 10 బంతులు ఆడిన అతను ఏకంగా 31 పరుగులు సాధించాడు. ఇందులో 5 సిక్సర్లు ఉన్నాయి. లిండే వేసిన తొలి రెండు బంతుల్లో సిక్సర్లు బాదిన అతను పీట్ ఓవర్లో సింగిల్ తీశాడు. లిండే తర్వాతి ఓవర్లోనే మిగతా మూడు సిక్స్‌లు కొట్టిన ఉమేశ్... అదే ఓవర్ చివరి బంతికి మరో భారీ షాట్‌కు ప్రయత్నించి అవుటయ్యాడు. ఇది ఉమేశ్‌కు టెస్టుల్లో అత్యధిక స్కోరు.

# కేరళ బ్లాస్టర్స్ శుభారంభం

### 2–1తో కోల్‌కతాపై విజయం • ఐఎస్‌ఎల్ ఆరో సీజన్ షురూ

**కొచ్చి:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఆరో సీజన్‌లో కేరళ బ్లాస్టర్స్ శుభారంభం చేసింది. ఆదివారం ఇక్కడి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన సీజన్ ఆరంభ మ్యాచ్‌లో కేరళ 2–1తో అట్లెటికో డి కోల్‌కతాపై గెలిచింది. కేరళ ఆటగాడు బార్తలోమెవ్ ఒగ్బెచ్ రెండు గోల్స్ సాధించగా... కోల్‌కతా తరఫున కార్ల్ మెక్‌హ్యూ గోల్ చేశాడు. ఆట 6వ నిమిషంలో కార్ల్ మెక్‌హ్యూ గోల్ చేసి కోల్‌కతాకు ఆధిక్యాన్నిచ్చాడు. అయితే 30వ నిమిషంలో లభించిన పెనాల్టీ కిక్‌ను గోల్‌గా మలిచిన ఒగ్బెచె స్కోర్‌ను సమం చేశాడు. మొదటి అర్ధ భాగం చివరి నిమిషంలో మరో గోల్ చేసిన ఒగ్బెచె కేరళకు 2–1తో ఆధిక్యాన్నిచ్చాడు. చివరిదాకా కేరళ ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని తమ ఖాతాలో మూడు పాయింట్లు వేసుకుంది. మ్యాచ్‌కు ముందు ప్రారంభోత్సవంలో బాలీవుడ్ స్టార్స్ టైగర్ ష్రాఫ్, దిశా పటానీల నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. నేడు జరిగే మ్యాచ్‌లో బెంగళూరుతో నార్త్ ఈస్ట్ యునైటెడ్ జట్టు ఆడుతుంది.



మ్యాచ్‌కు ముందు కేరళ బ్లాస్టర్స్ సహ యజమాని చిరంజీవి, కోల్‌కతా జట్టు సహ యజమాని సౌరవ్ గంగూలీ


## ఆంధ్రప్రదేశ్ వెయిట్‌లిఫ్టర్లకు నాలుగు పతకాలు

**బోధ్ గయా (బిహార్):** జాతీయ జూనియర్, యూత్ బాలుర వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఆదివారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర వెయిట్‌లిఫ్టర్లు ఆకట్టుకున్నారు. పురుషుల యూత్ 89 కేజీల విభాగంలో స్వర్ణం నెగ్గిన ఎ.ఎస్.ఆర్.కె. యాదవ్ (ఆంధ్రప్రదేశ్)... జూనియర్ పురుషుల విభాగంలో రజతం సాధించాడు. యూత్ కేటగిరీలో యాదవ్ మొత్తం 268 కేజీల బరువెత్తాడు. జూనియర్ పురుషుల 89 కేజీల విభాగంలోనే తెలంగాణకు చెందిన హెచ్.కార్తీక్ 267 కేజీల బరువెత్తి కాంస్యం సాధించాడు. యూత్ బాలికల 71 కేజీల విభాగంలో పి.ధాత్రి (ఆంధ్రప్రదేశ్) రజతం సొంతం చేసుకుంది. ఆమె మొత్తం 170 కేజీల బరువెత్తింది. జూనియర్ పురుషుల 81 కేజీల విభాగంలో తెలంగాణకు చెందిన నిహాల్ రాజ్ పసిడి పతకాన్ని గెల్చుకున్నాడు. అతను మొత్తం 280 కేజీల బరువెత్తి టాప్ ర్యాంక్‌లో నిలిచాడు. పురుషుల యూత్ 81 కేజీల విభాగంలో ఆంధ్రప్రదేశ్ లిఫ్టర్ జి.రవి శంకర్ మొత్తం 237 కేజీల బరువెత్తి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు.

# రెండున్నరేళ్ల తర్వాత...

### ముర్రే ఖాతాలో తొలి టైటిల్

**యాంట్‌వర్ప్ (బెల్జియం):** ప్రపంచ మాజీ నంబర్ వన్, బ్రిటన్ టెన్నిస్ స్టార్ ఆండీ ముర్రే రెండున్నరేళ్ల తర్వాత తొలి టైటిల్‌ను సాధించాడు. ఆదివారం ముగిసిన యూరోపియన్ ఓపెన్ టోర్నీ ఫైనల్లో ప్రపంచ 243వ ర్యాంకర్ ముర్రే 3–6, 6–4, 6–4తో ప్రపంచ 18వ ర్యాంకర్, మూడు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ విజేత వావ్రింకా (స్విట్జర్లాండ్)పై గెలుపొందాడు. విజేత ముర్రేకు 1,09,590 యూరోలు (రూ. 87 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 250 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. వావ్రింకాతో ఫైనల్లో తొలి సెట్ కోల్పోయి, రెండో సెట్‌లో 1–3తో వెనుకబడిన ముర్రే ఆ తర్వాత అద్భుత ఆటతీరుతో పుంజుకున్నాడు. 2017 మార్చిలో దుబాయ్ ఓపెన్ టైటిల్ సాధించాక ముర్రే ఖాతాలో చేరిన తొలి టైటిల్ ఇదే కావడం గమనార్హం. ఈ ఏడాది జనవరిలో తుంటికి శస్త్ర చికిత్స చేయించుకున్న ముర్రే ఆరు నెలలు ఆటకు దూరంగా ఉన్నాడు. ఆగస్టులో సిన్సినాటి మాస్టర్స్ టోర్నీతో పునరాగమనం చేశాక మరో ఐదు టోర్నీల్లో పాల్గొన్న అతను ఏ టోర్నీలోనూ క్వార్టర్ ఫైనల్ దాటి ముందుకెళ్లలేకపోయాడు. అయితే యూరోపియన్ ఓపెన్‌లో అతను ఫైనల్ చేరడంతో పాటు విజేతగా నిలిచాడు.



# 13 ఏళ్ల 9 నెలల 28 రోజుల్లో...

### భారత 65వ గ్రాండ్‌మాస్టర్‌గా రౌనక్ సిధ్వాని



**న్యూఢిల్లీ:** భారత్ నుంచి చెస్‌లో మరో గ్రాండ్‌మాస్టర్ (జీఎం) అవతరించాడు. నాగ్‌పూర్‌కు చెందిన రౌనక్ సిధ్వాని భారత 65వ గ్రాండ్‌మాస్టర్‌గా గుర్తింపు పొందాడు. ఐల్ ఆఫ్ మ్యాన్ అంతర్జాతీయ చెస్ టోర్నీ తొమ్మిదో రౌండ్‌లో రష్యా గ్రాండ్‌మాస్టర్ అలెగ్జాండర్ మోతిలెవ్‌పై రౌనక్ 37 ఎత్తుల్లో గెలిచి జీఎం హోదాకు అవసరమైన మూడో జీఎం నార్మ్‌ను ఖాయం చేసుకున్నాడు. రౌనక్ ఖాతాలో ఇప్పటికే రెండు జీఎం నార్మ్‌లు ఉండటం... తాజా ప్రదర్శనతో అతని రేటింగ్ పాయింట్లు 2500 దాటనుండటంతో అతనికి జీఎం హోదా ఖాయమైంది. ఈ క్రమంలో రౌనక్ చెస్ చరిత్రలో పిన్న వయస్సులో (13 ఏళ్ల 9 నెలల 28 రోజులు) జీఎం హోదా పొందిన ఏడో ప్లేయర్‌గా, భారత్ నుంచి ఈ ఘనత సాధించిన మూడో ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు. ప్రపంచ చెస్‌లో పిన్న వయస్సులో జీఎం హోదా పొందిన ప్లేయర్ రికార్డు సెర్గీ కర్జాకిన్ (రష్యా–12 ఏళ్ల 7 నెలలు) పేరిట ఉంది. ఈ జాబితాలో భారత్ నుంచి డి.గుకేశ్ (12 ఏళ్ల 7 నెలల 17 రోజులు), ప్రజ్ఞానంద (12 ఏళ్ల 10 నెలల 13 రోజులు) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

## సెమీస్‌లో కర్ణాటక, గుజరాత్

**బెంగళూరు:** విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే టోర్నీలో కర్ణాటక, గుజరాత్ జట్లు సెమీఫైనల్ బెర్తులను సొంతం చేసుకున్నాయి. ఆదివారం జరిగిన క్వార్టర్ ఫైనల్‌లో కర్ణాటక జట్టు 8 వికెట్ల తేడాతో పుదుచ్చేరిపై విజయం సాధించింది. ఓపెనర్ కేఎల్ రాహుల్ (90; 8 ఫోర్లు, సిక్స్) రాణించడంతో ఆ జట్టు సునాయాస విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పుదుచ్చేరి 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 207 పరుగులు చేసింది. అనంతరం కర్ణాటక 41 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 213 పరుగులు చేసి గెలిచింది. మరో క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో గుజరాత్ జట్టు 6 వికెట్లతో ఢిల్లీపై గెలిచింది. వర్షం కారణంగా 49 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో తొలుత ఢిల్లీ 223 పరుగులకు ఆలౌటైంది. శిఖర్ ధావన్ (0) నిరాశపరిచాడు. అయితే కెప్టెన్ ధ్రువ్ షోరే (91; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆకట్టుకున్నాడు. గుజరాత్ 37.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 225 పరుగులు చేసి గెలిచింది. ప్రియాంక్ పాంచల్ (80; 8 ఫోర్లు, సిక్స్), పార్థివ్ పటేల్ (76; 10 ఫోర్లు, సిక్స్) రాణించారు.

## ఇంటివాడైన నాదల్



**మలోర్కా (స్పెయిన్):** స్పెయిన్ టెన్నిస్ స్టార్ రాఫెల్ నాదల్ ఓ ఇంటివాడయ్యాడు. 14 ఏళ్లుగా సహజీవనం చేస్తున్న ప్రేయసి జిస్కా పరెల్లోను నాదల్ పెళ్లి చేసుకున్నాడు. 300 మందికి పైగా అతిథులు ఈ వివాహానికి హాజరైనట్లు సమాచారం. నాదల్ సోదరి మరిబెల్‌కు జిస్కా చిన్ననాటి స్నేహితురాలు కావడం విశేషం. ప్రస్తుతం టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉన్న 33 ఏళ్ల నాదల్... 19 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌తో పురుషుల విభాగంలో అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌తో అగ్రస్థానంలో ఉన్న స్విట్జర్లాండ్ స్టార్ రోజర్ ఫెడరర్ (20)తో పోటీ పడుతున్నాడు.

## శ్రీకృష్ణప్రియకు కాంస్యం



**కైరో:** ఈజిప్ట్ ఇంటర్నేషనల్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి కుదరవల్లి శ్రీకృష్ణప్రియ కాంస్య పతకాన్ని సాధించింది. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో మహిళల సింగిల్స్ విభాగంలో శ్రీకృష్ణప్రియ సెమీఫైనల్లో నిష్క్రమించింది. రెండో సీడ్ జోర్డాన్ హర్ట్ (వేల్స్)తో జరిగిన సెమీఫైనల్లో శ్రీకృష్ణప్రియ 16–21, 11–21తో పరాజయం పాలైంది. అంతకుముందు శ్రీకృష్ణప్రియ తొలి రౌండ్‌లో 21–6, 21–6తో సొహైలా (ఈజిప్ట్)పై, ప్రిక్వార్టర్ ఫైనల్లో 21–10, 21–13తో యాస్మినా (అల్జీరియా)పై, క్వార్టర్ ఫైనల్లో 21–10, 21–19తో డొర్కాస్ (నైజీరియా)పై విజయం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్–కుహూ గార్గ్ (భారత్) జంట; మహిళల డబుల్స్‌లో సిమ్రన్ సింగ్–రితిక (భారత్) జోడీ విజేతగా నిలిచాయి.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
21-10-2019

## స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 246 ▲ | 76 ▲ |
| 39,298 | 11,662 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు**

| సూచీ | ముగింపు | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,090 | ▼ 67 |
| డోజోన్స్ | 26,770 | ▼ 256 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,151 | ▼ 32 |
| డాక్స్ | 12,633 | ▼ 21 |
| షాంఘై | 2,938 | ▼ 39 |
| నికాయ్ | 22,492 | ▲ 41 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.40 | 72.04 |
| బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 89.94 | 93.15 |
| యూరో | ఎస్‌బీఐ | 77.79 | 80.68 |
| జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 64.39 | 66.83 |
| ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.63 | 49.78 |
| సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.29 | 53.07 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.18 | 19.79 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.91 | 19.91 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.42 | 10.83 |

ఆదాయపన్ను రిటర్నులు దాఖలు చేసే వారు... స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ ఆదాయాన్ని చూపించడం, పన్ను చెల్లించడం తప్పనిసరి. అయితే, ఈ విషయమై స్పష్టమైన అవగాహన తక్కువ మందిలోనే ఉంటుందని చెప్పుకోవాలి. నేటి తరం యువతలో చాలా మంది ట్రేడింగ్ వైపు ఆకర్షితులవుతున్నారు. అత్యాధునిక ఆల్గో ట్రేడింగ్ సాఫ్ట్‌వేర్‌లు అందుబాటు, మొబైల్ నుంచే అన్ని రకాల సేవలు, విస్తృతమైన సమాచారం ఇవన్నీ ఇందుకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. మరి ట్రేడింగ్‌ను ఓ ప్రొఫెషన్‌గా ఎంచుకున్న వారు ఇందుకు సంబంధించిన పన్ను బాధ్యతలను తెలుసుకోవడం ఎంతో అవసరం. ఆ వివరాలే ఈ వారం 'ప్రాఫిట్ ప్లస్' కథనం.

# ట్రేడింగ్ ఆదాయంపై పన్ను చెల్లించాలా..?




- ఇంట్రాడే ట్రేడింగ్ లాభ, నష్టాలు వ్యాపారాదాయమే
- ఈక్విటీ అయితే స్పెక్యులేటివ్; ఎఫ్అండ్‌వో.. నాన్ స్పెక్యులేటివ్
- ఈ ఆదాయాలు వ్యక్తిగత ఆదాయానికి కలుస్తాయి
- ఆదాయ శ్లాబు ప్రకారం పన్ను చెల్లించాల్సిందే
- నష్టాలు వస్తే ఇతర ఆదాయంలో సర్దుబాటు
- రూ.కోటి దాటితే ట్యాక్స్ ఆడిట్ తప్పనిసరి...

ఇంట్రాడే ట్రేడింగ్ (ఒకే రోజు కొని, విక్రయించడం) ద్వారా వచ్చే లాభ/నష్టాలను వ్యాపార ఆదాయంగా చట్టం పరిగణిస్తుంది. బిజినెస్ లేదా ప్రొఫెషన్ ద్వారా వచ్చిన లాభాలుగా (పీజీబీపీ) వీటిని చూపించాల్సి ఉంటుంది. ఇక ట్రేడింగ్ ద్వారా వచ్చే ఆదాయాన్ని స్పెక్యులేటివ్, నాన్ స్పెక్యులేటివ్‌గా వేరు చేయాల్సి ఉంటుంది. ఈక్విటీలో ఇంట్రాడే ట్రేడింగ్‌పై వచ్చే లాభ, నష్టాలను స్పెక్యులేటివ్‌గా పరిగణించాలి. అదే ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్అండ్‌వో) ద్వారా వచ్చే లాభ, నష్టాలు నాన్ స్పెక్యులేటివ్ అవుతాయి. పీజీబీపీ కింద స్పెక్యులేటివ్, నాన్ స్పెక్యులేటివ్ లాభాలన్నవి మీ పన్ను వర్తించే ఆదాయానికే కలుస్తాయి. మీ ఆదాయం ఏ శ్లాబు పరిధిలో ఉంటే ఆ మేరకు పన్ను చెల్లించడం తప్పనిసరి.

### మినహాయింపులు

అయితే, వ్యాపార ఆదాయం కింద చూపించే స్పెక్యులేటివ్, నాన్ స్పెక్యులేటివ్ లాభాల నుంచి, మీకు అయిన ఖర్చులను మినహాయించుకునే అవకాశం ఉంటుంది. అంటే బ్రోకర్ల కమీషన్, డీమ్యాట్ చార్జీలు, ఇంటర్నెట్ ఖర్చులు ఇవన్నీ కూడా ట్రేడింగ్ కోసం చేసిన ఖర్చులే అవుతాయి. కనుక మొత్తం లాభాల్లో ఈ ఖర్చులను మినహాయించుకున్న తర్వాతే మిగిలిన ట్రేడింగ్ ఆదాయాన్ని పేర్కొంటే సరిపోతుంది. అయితే, నష్టాలు వస్తే మాత్రం స్పెక్యులేటివ్, నాన్ స్పెక్యులేటివ్ ఆదాయంపై పన్ను వేర్వేరుగా ఉంటుంది. ఎఫ్అండ్‌వో నుంచి నాన్ స్పెక్యులేటివ్ రూపంలో నష్టం వచ్చిందనుకుంటే... ఈ నష్టాన్ని సంబంధిత వ్యక్తి వేతనం మినహా ఇతర ప్రధాన ఆదాయం నుంచి సర్దుబాటు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఒకవేళ అప్పటికీ నష్టం మిగిలిపోతే దాన్ని తదుపరి ఎనిమిది ఆర్థిక సంవత్సరాల కోసం బదలాయించుకోవచ్చు. తద్వారా తర్వాతి ఎనిమిది ఆర్థిక సంవత్సరాల్లో ఎప్పుడైనా చూపించుకుని పన్ను భారం తగ్గించుకోవచ్చు.

ఉదాహరణకు వార్షికాదాయం రూ.6 లక్షలు అనుకోండి, అలాగే, అద్దె రూపంలో మరో రూ.2 లక్షలు వచ్చిందనుకోండి.. వీటికి అదనంగా ఎఫ్అండ్‌వోలోనూ వేలుపెట్టి రూ.3 లక్షలు నష్టపోయారనుకుందాం. అప్పుడు మీ ఆదాయం రూ.6 లక్షలే. వాస్తవంగా వేతనం రూపంలో రూ.6 లక్షలు, అద్దె రూపంలో రూ.2 లక్షలు కలిపితే ఆదాయం రూ.8 లక్షలు. కానీ అద్దె ఆదాయం రూ.2 లక్షల్లో, నష్టం రూ.2 లక్షలను సర్దుబాటు చేసుకోవచ్చు. ఇక్కడ ఇతర ఆదాయం రూ.2 లక్షలే ఉండడంతో రూ.3 లక్షల నష్టం వచ్చినా కానీ, కేవలం రూ.2 లక్షలు మినహాయించుకోవడం జరిగింది. మిగిలిన రూ.లక్ష నష్టాన్ని తదుపరి ఏడాదికి బదిలీ చేసుకోవచ్చు. ఇక ఈక్విటీ ఇంట్రాడే ట్రేడింగ్ స్పెక్యులేటివ్ కిందకు వస్తుంది కనుక..

ఇంట్రాడే ట్రేడింగ్‌లో నష్టం వస్తే దాన్ని కేవలం స్పెక్యులేటివ్ ఆదాయం నుంచే మినహాయించుకునేందుకు వీలుంటుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో వచ్చిన స్పెక్యులేటివ్ నష్టాన్ని, అదే సంవత్సరం స్పెక్యులేటివ్ ఆదాయం కింద సర్దుబాటుకు వీలు పడకపోతే, తదుపరి 4 ఆర్థిక సంవత్సరాల్లో ఎప్పుడైనా దాన్ని సెట్ ఆఫ్ చేసుకోవచ్చు. అంటే స్పెక్యులేటివ్ నష్టాలను, స్పెక్యులేటివ్ ఆదాయం నుంచే సర్దుబాటు చేసుకోవడానికి ఉంటుంది. నాన్ స్పెక్యులేటివ్(ఎఫ్అండ్‌వో) ఆదాయం నుంచి స్పెక్యులేటివ్ నష్టాలను మినహాయించుకోవడానికి కుదరదు.


### ఆడిటింగ్ అవసరమే...

స్టాక్ ట్రేడింగ్ ఆదాయం వ్యాపార ఆదాయం అవుతుంది కనుక ఆదాయపన్ను చట్టం ప్రకారం ఆడిట్ తప్పనిసరి. ఆదాయపన్ను చట్టం ప్రకారం వ్యాపార ఆదాయం రూ.కోటి దాటితే ఆడిట్ తప్పనిసరి అవుతుంది. ట్రేడింగ్ రూపంలో వచ్చిన నష్టాలను క్యారీ ఫార్వార్డ్ చేసుకోవాలంటే, ట్యాక్స్ ఆడిట్ రిపోర్ట్ తీసుకోవాలా? అని చాలా మంది పన్ను రిటర్నులు దాఖలు చేసే వారు ఎదుర్కొనే సందేహం. ఈ విషయమై క్లియర్‌ట్యాక్స్ సీఈవో అర్చిత్ గుప్తా స్పందిస్తూ... ఒక వ్యక్తి వార్షిక టర్నోవర్ రూ.కోటి దాటకపోతే కనుక నష్టాలను మినహాయించి చూపించుకునేందుకు, తదుపరి సంవత్సరాలకు క్యారీ ఫార్వార్డ్ చేసుకునేందుకు ట్యాక్స్ ఆడిట్ రిపోర్ట్ అవసరం లేదని తెలిపారు.

అయితే, తమకు ఇంత ఆదాయం వస్తుందంటూ స్వచ్ఛందంగా పన్ను చెల్లించే 'ప్రిజంప్టివ్ ట్యాక్స్ స్కీమ్' కింద రిటర్నులు దాఖలు చేసే వారికి ట్యాక్స్ ఆడిట్ నిబంధనలు వేరుగా ఉన్నాయి. ఈ స్కీమ్ కింద టర్నోవర్‌లో 6/8 శాతం కంటే తక్కువ లాభం (ట్రేడింగ్ రూపంలో) ఉందని చూపిస్తే మాత్రం ట్యాక్స్ ఆడిట్ తప్పనిసరి అవుతుంది. అదే సమయంలో ఇతర మార్గాలు అయిన.. వేతనం, అద్దె ఆదాయం, వ్యాపార రూపంలో ఆదాయం కనీస పన్ను మినహాయింపు పరిమితి రూ.2.5 లక్షలు మించి ఉన్నా కానీ ఆడిటింగ్ అవసరం అవుతుంది. ఉదాహరణకు.. ఓ వ్యక్తి ప్రిజంప్టివ్ ట్యాక్సేషన్ పథకం కింద తనకు ట్రేడింగ్‌పై నష్టం వచ్చినట్టు చూపించారనుకోండి... అదే సమయంలో ఆ వ్యక్తి మొత్తం ఆదాయం (వేతనం సహా) రూ.2.5 లక్షలు మించి ఉంటే ట్యాక్స్ ఆడిట్ అవసరం అవుతుంది.

### టర్నోవర్ అంటే...

టర్నోవర్ అంటే ఏమిటీ..? అన్న సందేహం వస్తే... ఉదాహరణకు ఈక్విటీ ఇంట్రాడే ట్రేడింగ్ సెటిల్‌మెంట్‌లో పేయింగ్ అవుట్/పేయింగ్ ఇన్ తేడాయే టర్నోవర్ అవుతుంది. అంటే రూ.5 లక్షలు కొనుగోలు చేసి, రూ.4 లక్షలకు అమ్మితే, మిగిలిన రూ.లక్ష టర్నోవర్ అవుతుంది. అదే ఎఫ్అండ్‌వోలో ట్రేడింగ్ అయితే, నికర లాభం, నష్టం, ఆప్షన్లపై ప్రీమియం టర్నోవర్ కిందకు వస్తాయి. ఉదాహరణకు ఓ కాంట్రాక్టును రూ.5,00,000కు కొనుగోలు చేసి, దాన్ని రూ.5,50,000కు విక్రయించారని అనుకుంటే... అప్పుడు లాభం రూ.50,000 వచ్చినట్టు అవుతుంది. ఇదే టర్నోవర్ అవుతుంది. అదే ఆప్షన్ కాంట్రాక్టులో ఫలానా కంపెనీ లాట్ (1,000 షేర్లు)ను రూ.200కు కొనుగోలు చేసి రూ.180కు అమ్మారనుకోండి. ఈ కేసులో రూ.20,000 నష్టంతోపాటు, ట్రేడర్‌కు నికరంగా లభించే ప్రీమియం రూ.1,80,000 కూడా టర్నోవర్ కిందకు వస్తుంది. ఈ రెండు కేసులను కలిపి చూస్తే, ఫ్యూచర్ కాంట్రాక్టులో నికర లాభం రూ.50,000తోపాటు, ఆప్షన్ కాంట్రాక్టులో మొత్తం రూ.2 లక్షలు కలిపి టర్నోవర్ రూ.2,50,000 అవుతుంది.



# రాబడుల్లో మేటి పనితీరు

## యాక్సిస్ బ్లూచిప్ ఫండ్



డి.జయంత్‌కుమార్
థర్డ్‌పార్టీ ప్రొడక్ట్స్ హెడ్, కార్వీ స్టాక్ బ్రోకింగ్

ఈక్విటీ ఇన్వెస్టర్లకు గడిచిన ఏడాది, రెండేళ్లు పరీక్షా కాలం వంటిది. ఎన్నో అనిశ్చితులు, ఆందోళనలు మార్కెట్లపై ప్రభావం చూపించాయి. సూచీల్లో పెరుగుదల ఉన్నా కానీ, రిటైల్ ఇన్వెస్టర్లు రాబడులు పొందిందీ లేదు. కొందరు నష్టాలు కూడా చవిచూశారు. మార్కెట్ అంతటా పెరుగుదల లేకపోవడమే దీనికి కారణం. కేవలం కొన్ని కంపెనీలే మార్కెట్ పెరుగుదలకు దోహదపడ్డాయి. అందుకే అనిశ్చిత పరిస్థితుల్లో మార్కెట్ లీడర్లుగా ఉన్న కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడం తెలివైన వ్యూహం అవుతుంది. కనుక భిన్న మార్కెట్ పరిస్థితుల్లో అద్భుత పనితీరు చూపించిన లార్జ్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలనేది మా సూచన. యాక్సిస్ బ్లూచిప్ ఫండ్ దీర్ఘకాల ఇన్వెస్ట్‌మెంట్‌కు అనుకూలంగా ఉంటుంది.

### పెట్టుబడుల విధానం

యాక్సిస్ బ్లూచిప్ అన్నది లార్జ్‌క్యాప్ ఫండ్. మంచి వ్యాపార నాణ్యత కలిగిన లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఈ పథకం ఇన్వెస్ట్ చేస్తుంది. పోర్ట్‌ఫోలియో పరంగా వైవిధ్యాన్ని కూడా గమనించొచ్చు. 2016 నవంబర్ నుంచి ఈ పథకాన్ని శ్రేయాష్ దేవల్కర్ నిర్వహిస్తున్నారు. బోటమ్ అప్ విధానంలో స్టాక్స్‌ను, ఫండమెంటల్స్(వ్యాపార మూలాలు), వృద్ధి అవకాశాలు, ఆయా కంపెనీలకు పోటీ పరంగా ఉన్న అనుకూలతలు వంటి అంశాల ఆధారంగా ఈ పథకం పెట్టుబడుల కోసం ఎంపిక చేసుకుంటుంది. పథకం నిర్వహణలోని మొత్తం పెట్టుబడుల్లో 80–100% వరకు అధిక నాణ్యత కలిగిన పెద్ద కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేస్తుంది. లార్జ్‌క్యాప్ కంపెనీలు ఇన్వెస్టర్ పోర్ట్‌ఫోలియోకు స్థిరత్వాన్ని స్తాయి. వ్యాపార కార్యకలాపాలు భారీ స్థాయిలో ఉండడం, నిధుల వ్యయాలు తక్కువగా ఉండడం వల్ల ఆర్థిక మందగమన ప్రభావం వీటిపై తక్కువగా ఉంటుంది. ప్రస్తుతానికి ఈ పథకం ఫైనాన్షియల్, టెక్నాలజీ స్టాక్స్‌లో ఎక్కువ వెయిటేజీ కలిగి ఉంది. ఈ రెండు రంగాల స్టాక్స్‌లో వరుసగా 45%, 14% చొప్పున ఇన్వెస్ట్ చేసి ఉంది.



### రాబడుల పనితీరు

ఈ పథకం నిర్వహణలో సెప్టెంబర్ నాటికి రూ.8,050 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. రాబడులకు సంబంధించి మంచి చరిత్ర ఉంది. గడిచిన మూడేళ్ల కాలంలో వార్షికంగా 15.95 శాతం రాబడులిచ్చింది. ఐదేళ్లలో.. వార్షిక పనితీరు 12.30%. కానీ, ఇదే కాలంలో పోటీ పథకాలు ఇచ్చిన రాబడులు మూడేళ్లలో 10.57%, ఐదేళ్లలో 9.26%గానే ఉన్నాయి. ఈ పథకం ప్రారంభం నాటి నుంచి ప్రతీ నెలా రూ.5,000 చొప్పున ఇన్వెస్ట్ చేస్తూ వచ్చి ఉంటే 2019 సెప్టెంబర్30 నాటికి రూ.11.9 లక్షల సంపద సమకూరేది. ఇందులో అసలు పెట్టుబడి రూ.5.8 లక్షలు. ఈ పథకంలో ఒకేసారి ఇన్వెస్ట్ చేయాలనుకుంటే కనీసం రూ.5,000 నుంచి..; సిప్ రూపంలో అయితే ప్రతీ నెలా కనీసం రూ.500 మొత్తంతో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. సిప్ రూపంలో కనీసం ఆరు నెలల పాటు ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. దీర్ఘకాల ఆర్థిక లక్ష్యాల కోసం, దీర్ఘకాలంలో సంపద సమకూర్చుకోవాలనుకునే వారు కనీసం ఐదేళ్లు, అంతకంటే ఎక్కువ కాలానికి ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

### టాప్ హోల్డింగ్స్

| కంపెనీ | పెట్టుబడుల శాతం |
|---|---|
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు | 9.17 |
| కోటక్ మహీంద్రా బ్యాంకు | 8.99 |
| ఇన్ఫోసిస్ | 8.71 |
| బజాజ్ ఫైనాన్స్ | 8.42 |
| ఐసీఐసీఐ బ్యాంకు | 8.01 |
| రిలయన్స్ ఇండస్ట్రీస్ | 6.62 |
| అవెన్యూ సూపర్‌మార్ట్స్ | 5.41 |
| హెచ్‌డీఎఫ్‌సీ | 4.3 |
| ఏషియన్ పెయింట్స్ | 4.13 |
| టీసీఎస్ | 3.76 |
| టాప్ 10లో పెట్టుబడులు | 67.52 |

## ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, (అక్టోబర్-15-2019 అంకెలు శాతాల్లో)

| బ్యాంకులు | 6 నెలలు- ఏడాది | 1–2 ఏళ్లు | 3–5 ఏళ్లు |
|---|---|---|---|
| ఆంధ్రా బ్యాంక్ | 6 | 6.6 | 6.5 |
| యాక్సిస్ బ్యాంక్ | 6.7 | 7 | 6.75 |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 6.45 | 6.6 | 6.25 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6 | 6.4 | 6.25 |
| కెనరా బ్యాంక్ | 6.2 | 6.5 | 6.25 |
| సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6.1 | 6.45 | 6.25 |
| కార్పొరేషన్ బ్యాంక్ | 6.5 | 6.8 | 6.5 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 6.35 | 6.6 | 6.9 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 6.25 | 7 | 6.9 |
| ఐడీబీఐ బ్యాంక్ | 6.15 | 6.65 | 6.5 |
| ఇండస్‌ఇండ్ బ్యాంక్ | 6.5 | 7.25 | 7.15 |
| కోటక్ మహీంద్రా బ్యాంక్ | 6.75 | 6.8 | 6.25 |
| ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ | 6 | 6.5 | 6.5 |
| పీఎన్‌బీ | 6 | 6.5 | 6.25 |
| ఎస్‌బీఐ | 5.8 | 6.4 | 6.25 |
| సిండికేట్ బ్యాంక్ | 5.75 | 6.6 | 6.25 |
| యస్ బ్యాంక్ | 7.15 | 7.75 | 7.25 |

బ్యాంక్ బజార్.కామ్ అందించిన వివరాల ఆధారంగా...

# ప్రకటనల్లో స్పష్టత, పారదర్శకత ఉండాలి

- సులభంగా అర్థమవ్వాలి...
- తప్పుదోవ పట్టించరాదు...
- బీమా కంపెనీలకు ఐఆర్‌డీఏఐ ఆదేశం



**న్యూఢిల్లీ:** పాలసీలకు సంబంధించిన ప్రకటనల్లో స్పష్టతతోపాటు, పారదర్శకత పాటించాలని బీమా కంపెనీలను బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) ఆదేశించింది. భద్రత కల్పించినట్టు భావం వాటిల్లో చూపించరాదని కోరింది. బీమా ప్రకటనల విషయంలో చేయాల్సినవి, చేయకూడనవి ఏవన్నది ఐఆర్‌డీఏఐ తన ఆదేశాల్లో పేర్కొంది. ''అన్ని రకాల బీమా ప్రకటనల్లో సమాచారం స్పష్టంగా, పారదర్శకంగా ఉండాలి. తప్పుదోవ పట్టించే విధంగా ఉండకూడదు. మెటీరియల్, డిజైన్, రంగు, అక్షరాల సైజు ఇవన్నీ కూడా ఆ సమాచారాన్ని స్పష్టంగా తెలియజేసే రీతిలో వినియోగించాలి. తప్పనిసరిగా పేర్కొనాల్సిన వివరాలు కూడా మొత్తం ప్రకటన ప్రాధాన్యం మాదిరే ఉండాలి. బీమా రంగ ఉత్పత్తుల పేర్లు లేదా ప్రయోజనాలు కానీ భద్రత కల్పిస్తున్న భావనలో వినియోగించకూడదు. ఇంటర్నెట్ ద్వారా అయితే, వీక్షకులు సంబంధిత ఉత్పత్తి పూర్తి ఫీచర్లు, నియమ, నిబంధనలు, షరతులు, ఇతర రిస్క్ సమాచారాన్ని తెలుసుకునే అవకాశం ఇవ్వాలి. ప్రధాన సమాచారంలో కనిపించని విధంగా పేర్కొనరాదు'' అని ఐఆర్‌డీఏఐ పేర్కొంది. ''పలు రకాల బీమా ఉత్పత్తుల వివరాలను విశ్లేషించడం, అర్థం చేసుకోవడం అన్నది ప్రజలకు కష్టంగా ఉండొచ్చు. ప్రచార సమాచారం పారదర్శకంగా, సులభంగా అర్థమయ్యే భాషలో, కొనుగోలు చేయాలా లేక వద్దా అన్న నిర్ణయం తీసుకునేందుకు వీలు కల్పించే విధంగా ఉండడం ఎంతో అవసరం'' అని ఐఆర్‌డీఏఐ బీమా కంపెనీలకు సూచించింది. తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని పేర్కొంది.

## ఏసీసీ | బ్రోకరేజ్ సంస్థ: ఐసీఐసీఐ డైరెక్ట్ | కొనొచ్చు

స్టాక్ వ్యూ

**ప్రస్తుత ధర:** రూ.1,553 **టార్గెట్ ధర:** రూ.1,900

**ఎందుకంటే:** ఈ సిమెంట్ కంపెనీ ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మిశ్రమంగా ఉన్నాయి. నిర్వహణ పనితీరు అంచనాలకు అనుగుణంగానే ఉండగా, వ్యయాలు అంచనాలను మించి పెరగడంతో నికర లాభం అంచనాలను అందుకోలేకపోయింది. ఆదాయం 3 శాతం వృద్ధితో రూ.3,464 కోట్లకు పెరిగింది. వర్షాలు ఎక్కువ కాలం కురియడం, బలహీన ఆర్థిక పరిస్థితుల కారణంగా సిమెంట్ అమ్మకాలు 2 శాతం తగ్గి 6.44 మిలియన్ టన్నులకు చేరాయి. అయితే రెడీమేడ్ కాంక్రీట్(ఆర్ఎమ్‌సీ) విభాగం అమ్మకాలు 11% పెరిగాయి. రియలైజేషన్లు అధికంగా ఉండటం, ముడి పదార్థాల ధరలు తక్కువగా ఉండటంతో లాభదాయకత పెరిగింది. నిర్వహణ లాభం 32% పెరిగి రూ.403 కోట్లకు పెరిగింది. నికర లాభం 45% వృద్ధి రూ.303 కోట్లకు పెరిగింది. (ఈ కంపెనీ రూ.339 కోట్ల నికర లాభం సాధించగలదని అంచనా వేశాం). గత ఆరు నెలల కాలం సిమెంట్ పరిశ్రమకు గడ్డుకాలం. ఆర్థిక మందగమనం, వినియోగం బలహీనపడటం, వర్షాలు ఎక్కువ కాలం కొనసాగడం, కొన్ని రాష్ట్రాల్లో వరదలు రావడం... ఈ విషయాల కారణంగా సిమెంట్ డిమాండ్ తగ్గింది. ఆర్థిక వ్యవస్థలో జోష్‌ను పెంచడానికి ప్రభుత్వం తీసుకుంటున్న పలు చర్యల కారణంగా రానున్న రెండు క్వార్టర్లలో సిమెంట్‌కు డిమాండ్ పుంజుకోగలదని భావిస్తున్నాం. రెండేళ్లలో సిమెంట్ అమ్మకాలు 3%, నిర్వహణ లాభం 15%, నిర్వహణ లాభ మార్జిన్ 2% చొప్పున చక్రగతిన వృద్ధి చెందగలవని భావిస్తున్నాం.




## పీవీఆర్ | బ్రోకరేజ్ సంస్థ: ఎడెల్‌వీజ్ ఫైనాన్షియల్ | కొనొచ్చు

స్టాక్ వ్యూ


**ప్రస్తుత ధర:** రూ.1,828 **టార్గెట్ ధర:** రూ.2,100

**ఎందుకంటే:** ఈ సినిమా మల్టీప్లెక్స్ చెయిన్ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు అంచనాలు మించాయి. కంటెంట్ బలంగా ఉండటం(మంచి సినిమాలు విడుదల కావడం)తో ఆదాయం 37 శాతం, నిర్వహణ లాభం 57 శాతం, నికర లాభం 98 శాతం చొప్పున పెరిగాయి. గడ్డు పరిస్థితుల్లోనూ ప్రకటనల ఆదాయం 16 శాతం పెరగడం విశేషం. ఆహార, పానీయాల(ఎఫ్అండ్‌బీ) విభాగం ఆదాయం 25 శాతం మేర వృద్ధి చెందింది. వ్యయాలు బాగానే పెరిగినా, నిర్వహణ లాభ మార్జిన్ 2.5 శాతం పెరిగి 20 శాతానికి చేరింది. ఇది బహుళ క్వార్టర్ల గరిష్ఠ స్థాయి. స్క్రీన్ల విస్తరణపై ఈ కంపెనీ దృష్టి కొనసాగుతోంది. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి 800కు పైగా స్క్రీన్లతో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. వచ్చే ఏడాది మార్చినాటికి కొత్తగా 60 స్క్రీన్లను ఏర్పాటు చేయనున్నది. ఈ కంపెనీ అనుబంధ సంస్థ, పీవీఆర్ పిక్చర్స్ ఈ క్యూ2లో రూ.65 కోట్ల ఆదాయం ఆర్జించింది. చిన్న నగరాల్లో పీవీఆర్ ఉత్సవ్ పేరుతో చిన్న మల్టీప్లెక్స్‌ల ఏర్పాటు జోరుగా సాగుతోంది. కంటెంట్ వైవిధ్యభరితంగా ఉన్న సినిమాలు విడుదల కానుండటం, స్క్రీన్ల విస్తరణ జోరు కొనసాగుతుండటం సానుకూలాంశాలు. థియేటర్లలో విడుదలైన కొన్ని నెలలకే అమెజాన్ వంటి డిజిటల్ స్ట్రీమింగ్ సర్వీసుల్లో కొత్త సినిమాలు అందుబాటులోకి వస్తుండటం, స్క్రీన్ల విస్తరణలో అడ్డంకులు... ఇవి ప్రతికూలాంశాలు. ఏడాది కాలంలో ఈ షేర్ రూ.2,100 ధరను చేరగలదని అంచనా వేస్తున్నాం.




**గమనిక:** ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.





లక్ష్యసాధనలో వైఫల్యాలకు కుంగిపోనక్కర్లేదు. ఇంకాస్త కొత్తగా, తెలివిగా ప్రయత్నించడానికి వచ్చిన అవకాశాలుగానే వాటిని భావించాలి.
– హెన్రీ ఫోర్డ్, వ్యవస్థాపకుడు, ఫోర్డ్ మోటార్ కంపెనీ

## బొమ్మ-బొరుసు



### ఎల్‌ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లాభం 36 శాతం అప్




**న్యూఢిల్లీ:** ఎల్‌ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ నికర లాభం 36 శాతం పెరిగింది. గత క్యూ2లో రూ.563 కోట్లుగా ఉన్న నికర లాభం(కన్సాలిడేటెడ్) ఈ క్యూ2లో రూ.768 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం రూ.4,205 కోట్ల నుంచి రూ.4,981 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం రూ.1,047 కోట్ల నుంచి 16 శాతం వృద్ధితో రూ.1,213 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ 2.41% నుంచి 2.42%కి పెరిగిందని పేర్కొంది. సీక్వెన్షియల్‌గా చూస్తే, రుణ నాణ్యత తగ్గింది. ఈ క్యూ1లో 1.98 శాతంగా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ2లో 2.38 శాతానికి పెరిగాయి. దీంతో కేటాయింపులు రూ.2,194 కోట్లకు పెరిగాయని ఎల్‌ఐసీ హౌసింగ్ పేర్కొంది.

### బోర్డ్ మీటింగ్స్



యాక్సిస్ బ్యాంక్, భారతీ ఇన్‌ఫ్రాటెల్, ఆల్ట్రాటెక్ సిమెంట్, టాటా ఎలెక్సి, హిందుస్తాన్ జింక్, ఉజ్జీవన్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, జస్ట్ డయల్, మహీంద్రా లైఫ్ స్పేస్ డెవలపర్స్, ఓరియంట్ సిమెంట్, పిరామళ్ ఎంటర్‌ప్రైజెస్, జెన్సర్ టెక్నాలజీస్.

### కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 21-10-2019

| | |
|---|---|
| విశాఖ | 380-00 |
| చిత్తూరు | 393-00 |
| వరంగల్ | 373-00 |
| చెన్నై | 400-00 |
| ముంబై | 425-00 |
| 20-10-2019 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 370-00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 4.30 |
| విజయవాడ | 380-00 |
| నమక్కల్ | 400-00 |
| గోదావరి | 380-00 |
| బెంగళూరు | 385-00 |
| కోల్‌కతా | 410-00 |
| ఢిల్లీ | 400-00 |

# క్యూ2 ఫలితాలే దిక్సూచీ..!

- ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, ఎల్ అండ్ టీ, మారుతీ, బజాజ్ ఆటో, ఆల్ట్రాటెక్ సిమెంట్, ఇండిగో, టాటా మోటార్స్ ఫలితాలు ఈవారంలోనే..
- బ్రెగ్జిట్ పరిణామాలపై మార్కెట్ దృష్టి
- మహారాష్ట్రలో ఎన్నికల సందర్భంగా సోమవారం సెలవు



**న్యూఢిల్లీ:** దేశీ కార్పొరేట్ కంపెనీల క్యూ2 ఫలితాల ప్రకటనలు, బ్రెగ్జిట్ పరిణామాలు, స్థూల ఆర్థిక అంశాలు ఈ వారం స్టాక్ మార్కెట్‌కు దిశానిర్దేశం చేయనున్నాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటివరకు వెల్లడైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసిక (జూలై–సెప్టెంబర్) ఫలితాలు ఆశాజనకంగా ఉండడం, ఇక నుంచి వెల్లడికానున్న ఫలితాలపై మార్కెట్ పాజిటివ్‌గా ఉన్నందున ర్యాలీకి అవకాశం ఉందని సామ్కో సెక్యూరిటీస్ సీఈఓ జిమీత్ మోడీ అన్నారు. 'కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ పన్నుల భారాన్ని తగ్గించిన దగ్గర నుంచి మార్కెట్ ఊర్ధ్వముఖంగా కొనసాగుతూనే ఉంది. అప్పటివరకు ఉన్న భయాలను ఒక్కసారిగా విదుల్చుకుని పరుగులు ప్రారంభించింది. దీంతో దేశీ ఇన్వెస్టర్లతో పాటు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) పెట్టుబడులు కూడా మార్కెట్‌లో జోరుగా కొనసాగుతున్నాయి. గతవారంలోనే దేశీ ప్రధాన సూచీలు 3 శాతం పెరగ్గా, నిఫ్టీ మిడ్‌క్యాప్ 4%, స్మాల్‌క్యాప్ 3 శాతం పెరిగాయి. నిఫ్టీ ఆటో, ఎఫ్‌ఎంసీజీ, బ్యాంక్, ఎనర్జీ, ఇన్‌ఫ్రా, మెటల్, ఫార్మా రంగాలు 3.5 నుంచి 8 శాతం వరకు లాభపడ్డాయి. ఇక ఈవారంలో ఫలితాల ఆధారంగా ఆయా కంపెనీలకు కొనుగోలు మద్దతు ఉంటుందని భావిస్తున్నాం. ముఖ్యంగా స్మాల్, మిడ్‌క్యాప్స్‌లో కొనుగోళ్లు ఉండనున్నాయి' అని విశ్లేషించారు.

**300 కంపెనీల ఫలితాలు..**

ఈవారంలో 300 కంపెనీలు తమ రెండో త్రైమాసిక ఫలితాలను ప్రకటించనుండగా.. నిఫ్టీ 50 జాబితాలోని 16 కంపెనీలు ఈవారంలోనే ఫలితాలను వెల్లడించనున్నాయి. వీటిలో ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ ఉండగా.. ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ఐసిఐసిఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ ఉన్నాయి. భారతి ఇన్‌ఫ్రాటెల్, ఆల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఆటో, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎల్ అండ్ టీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హీరో మోటోకార్ప్, ఐటీసీ, మారుతి సుజుకి, టాటా మోటార్స్ ఫలితాలను ప్రకటించనున్నాయి. ఇతర ప్రధాన కంపెనీల్లో ఆర్‌బీఎల్ బ్యాంక్, ఎం అండ్ ఎం ఫైనాన్షియల్, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్, హావెల్స్, హెచ్‌డీఎఫ్‌సి లైఫ్, బయోకాన్, బంధన్ బ్యాంక్, కోల్‌గేట్, ఇంటర్‌గ్లోబ్, యునైటెడ్ స్పిరిట్స్, మారికో, హెచ్‌డీఎఫ్‌సి ఏఎంసీ క్యూ2 ఫలితాలను ప్రకటించనున్నాయి.

**అంతర్జాతీయ అంశాల ప్రభావం..**

యూరోపియన్ యూనియన్(ఈయూ)తో కుదుర్చుకున్న బ్రెగ్జిట్ ఒప్పందం జాప్యం కానుందని శనివారం వార్తలు వెలువడిగా.. ఈ అంశం మార్కెట్‌పై తాత్కాలిక ప్రభావమే చూపుతుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ అంశానికి తోడు అమెరికా–చైనాల మధ్య కొనసాగుతున్న వాణిజ్య ఒప్పందాలు ప్రభావం చూపనున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

**ఈ వారంలో ట్రేడింగ్ నాలుగు రోజులే..**

మహారాష్ట్రలో ఎన్నికల సందర్భంగా సోమవారం (అక్టోబర్ 21న) దేశీ స్టాక్ ఎక్స్ఛేంజీలు సెలవు ప్రకటించాయి. దీంతో ఈ వారంలో ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితమైంది.

## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభం రూ.6,638 కోట్లు




**న్యూఢిల్లీ:** ప్రైవేట్ రంగ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ క్వార్టర్‌లో రూ.6,638 కోట్ల నికర లాభం సాధించింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ2లో ఆర్జించిన నికర లాభం, రూ. 5,322 కోట్లతో పోల్చితే 25 శాతం వృద్ధి సాధించామని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తెలిపింది. నికర వడ్డీ ఆదాయం 15 శాతం పెరగడం, నికర వడ్డీ మార్జిన్ 4.2 శాతంగా ఉండటంతో ఈ రేంజ్ నికర లాభం సాధించామని వివరించింది. మొత్తం ఆదాయం రూ.30,124 కోట్ల నుంచి రూ.36,131 కోట్లకు ఎగసిందని తెలిపింది. రుణాలు రూ.7,95,563 కోట్ల నుంచి 19 శాతం వృద్ధితో రూ.9,47,440 కోట్లకు పెరిగాయని, నికర వడ్డీ ఆదాయం 15 శాతం వృద్ధితో రూ.13,515 కోట్లకు పెరిగిందని పేర్కొంది. వివరించింది. ఇతర ఆదాయం 39 శాతం పెరిగి రూ.5,589 కోట్లకు పెరిగింది.

మొండి బకాయిలు కాస్త పెరగడంతో రుణ్యత స్వల్పంగా తగ్గింది. గత క్యూ2లో రూ.10,098 కోట్లుగా(1.33%) ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ2లో రూ.12,508 కోట్లకు(1.38%) పెరిగాయని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వెల్లడించింది. నికర మొండి బకాయిలు రూ.3,028 కోట్ల(0.42%) నుంచి రూ.3,791 కోట్లకు(0.43%) చేరాయని పేర్కొంది.

## 39,440 పైన ర్యాలీ కొనసాగింపు

**మార్కెట్ పంచాంగం**


అమెరికా–చైనాల మధ్య ట్రేడ్‌డీల్ కుదరడం, ఇప్పటివరకూ వచ్చిన కార్పొరేట్ ఫలితాలు ఇన్వెస్టర్ల అంచనాలకు తగినట్లే వుండటం, యూరోపియన్ యూనియన్‌తో బ్రెగ్జిట్ డీల్ కుదిరిందంటూ బ్రిటన్ ప్రధాని వెల్లడించడం వంటి సానుకూల అంశాల నడుమ గతవారం భారత్ స్టాక్ సూచీలు 3 శాతం వరకూ ర్యాలీ జరిపాయి. చాలా నెలల తర్వాత అటు విదేశీ ఇన్వెస్టర్లు, ఇటు దేశీయ ఫండ్స్ కొనుగోళ్లు జరపడం విశేషం. ముఖ్యంగా విదేశీ ఇన్వెస్టర్లు గత ఐదు ట్రేడింగ్ సెషన్లలో రూ. 3000 కోట్లకుపైగా నికర పెట్టుబడులు జరిపారు. దేశీయ ఫండ్స్ రూ. 2000 కోట్లకుపైగా పెట్టుబడి చేశాయి. ఈ నేపథ్యంలో వెలువడనున్న మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మార్కెట్ అంచనాలకు తగినట్లు వెలువడితే ర్యాలీ మరింత కొనసాగే అవకాశం వుంటుంది.

**సెన్సెక్స్ సాంకేతికాంశాలు...**




అక్టోబర్ 18తో ముగిసిన వారంలో భారీ ర్యాలీ జరిపిన బీఎస్‌ఈ సెన్సెక్స్ అంతక్రితం వారంతో పోలిస్తే 1,171 పాయింట్ల లాభంతో 39,298 పాయింట్ల వద్ద ముగిసింది. ర్యాలీ కొనసాగాలంటే ఈ వారం 39,440 పాయింట్ల స్థాయిని (సెప్టెంబర్ 23నాటి గరిష్టస్థాయి) సెన్సెక్స్ అధిగమించాల్సివుంటుంది. ఈ స్థాయిపైన వేగంగా 39,650 పాయింట్ల స్థాయికి పెరగవచ్చు. ఈ స్థాయిని సైతం ఛేదిస్తే 39830–40,030 పాయింట్ల శ్రేణిని అందుకోవొచ్చు. ఈ వారం తొలి నిరోధస్థాయిని ఛేదించలేకపోతే 39,100 పాయింట్ల సమీపంలో తొలి మద్దతు లభిస్తున్నది. ఈ దిగువన 38,960 పాయింట్ల వద్దకు తగ్గవచ్చు. ఈ లోపున క్రమేపీ 38,660 పాయింట్ల వరకూ క్షీణత కొనసాగవచ్చు.

**నిఫ్టీ 11,695 దాటితే మరింత ర్యాలీ**




గతవారం ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ క్రమేపీ పెరుగుతూ 11,685 గరిష్టస్థాయి వరకూ ర్యాలీ జరిపింది. చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 357 పాయింట్ల భారీ లాభంతో 11,662 వద్ద ముగిసింది. ఈవారం నిఫ్టీకి 11,695 స్థాయి కీలకం. గత నెల 23నాటి ఈ గరిష్టస్థాయిని అధిగమించడం ద్వారా మరింత పెరిగే అవకాశాలు ఏర్పడతాయి. ఈ స్థాయిని దాటితే వేగంగా 11,790 వద్దకు చేరవచ్చు. అటుపైన స్థిరపడితే 11,870–11980 శ్రేణి వరకూ ర్యాలీ కొనసాగే ఛాన్స్ వుంటుంది. ఈ వారం నిఫ్టీ తొలి నిరోధస్థాయిని దాటలేకపోతే 11,600 వద్ద తక్షణ మద్దతు లభిస్తున్నది. ఈ లోపున 11,550 వద్దకు పడిపోవొచ్చు. ఈ స్థాయిని సైతం వదులుకుంటే క్రమేపీ 11,480 వరకూ తగ్గవచ్చు.

– పి. సత్యప్రసాద్

## టెక్నాలజీని చెడుగా చూపించే ప్రయత్నాలు

**టెక్నాలజీ వారధిలా పనిచేస్తుంది: ప్రధాని మోదీ**



పుస్తకావిష్కరణలో ప్రధాని మోదీ, రూప, చంద్రశేఖరన్, రతన్ టాటా

**న్యూఢిల్లీ:** టెక్నాలజీని చెడుగా చూపించే ప్రయత్నాల పట్ల జాగ్రత్తగా ఉండాలని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. భయానక వాతావరణం సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. తన అధికారిక నివాసంలో ఆదివారం ప్రధాని మోదీ 'బ్రిడ్జిటల్ ఇండియా' పుస్తకాన్ని ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు. ''కృత్రిమ మేథ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) వల్ల ప్రమాదాలు లేదా రోబోలు మానవులను మించిన మేథస్సును చూపిస్తే అన్న వాటిపై చర్చ కాదు కావాల్సింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మానవుల ఉద్దేశ్యాల మధ్య వారధి ఏ విధంగా ఏర్పాటు చేయాలన్న దానిపై చర్చ ఉండాలి. ఆకాంక్షలు, సాధనల మధ్య, డిమాండ్, డెలివరీ మధ్య, ప్రభుత్వం, పాలన మధ్య టెక్నాలజీ వారధిని ఏర్పాటు చేస్తుంది''అని ప్రధాని పేర్కొన్నారు. టెక్నాలజీ అన్నది అనుసంధానిస్తుంది కానీ, వేరు చేయదన్న విషయాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. టెక్నాలజీ వల్ల ఎదురైన సవాళ్లను అవకాశాలుగా మార్చుకోవాలని సూచిస్తూ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు ఏర్పాటును ఉదాహరణగా పేర్కొన్నారు. టెక్నాలజీ అన్నది మొత్తం పోస్టల్ వ్యవస్థనే దెబ్బతీసిందని, కానీ, అదే పోస్టల్ విభాగం టెక్నాలజీ ఆధారిత బ్యాంకింగ్ వ్యవస్థగా మారిన సందర్భాన్ని గుర్తు చేశారు. తద్వారా లక్షలాది మందికి ప్రయోజనకారిగా మారినట్టు చెప్పారు. బ్రిడ్జిటల్ పుస్తకాన్ని టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్, టాటా సన్స్ ముఖ్య ఆర్థికవేత్త రూప పురుషోత్తం రచించారు. ఈ కార్యక్రమంలో టాటా సన్స్ గౌరవ చైర్మన్ రతన్ టాటా సైతం పాల్గొన్నారు.

## ఎయిరిండియా విక్రయానికి త్వరలో బిడ్లు

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియాలో 100 శాతం వాటాల విక్రయానికి బిడ్లు ఆహ్వానించడంపై కేంద్రం కసరత్తు చేస్తోంది. ఇందుకు సంబంధించిన ఆసక్తి వ్యక్తీకరణ పత్రానికి (ఈవోఐ) తుది మెరుగులు దిద్దుతోంది. ఈ నెలాఖరులో లేదా వచ్చే నెలలో గానీ ప్రాథమికంగా బిడ్లు ఆహ్వానించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇప్పటికే కొన్ని సంస్థలు ఎయిరిండియాపై ఆసక్తి కూడా వ్యక్తీకరించినట్లు వివరించాయి. కొత్తగా అభివృద్ధి చేసిన ఈ–బిడ్డింగ్ వ్యవస్థ ద్వారా బిడ్డింగ్ ప్రక్రియ నిర్వహించవచ్చని పేర్కొన్నాయి. ఎయిరిండియా దాదాపు రూ. 58,000 కోట్ల మేర రుణభారంతో పాటు భారీ నష్టాలతో కుదేలవుతోంది. దీంతో ఎయిరిండియాను విక్రయించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది.




**రాష్ట్రీయం**

# మబ్బులు.. జబ్బులు

**మెట్రోసాక్షి..**

- గ్రేటర్‌లో వినూత్న వాతావరణం
- ఉదయం మంచు, మధ్యాహ్నం మబ్బులు, సాయంత్రానికి వాన
- పెరుగుతోన్న వాయు కాలుష్యం
- వాయు కాలుష్యంలో ఢిల్లీతో పోటీపడుతోన్న వైనం




**సాక్షి, హైదరాబాద్:** ఉదయం మంచు.. మధ్యాహ్నం ఆకాశం దట్టమైన క్యుములోనింబస్ మేఘాలతో ఆవృతమై పట్టపగలే కమ్ముకుంటున్న కారు చీకట్లు.. సాయంత్రం జడివాన.. దీనికితోడు భరించలేని స్థాయిలో పెరిగిన వాయు కాలుష్యం.. గాలిలోని తేమతో సమ్మిళితం.. ఇదీ నగరంలో కొన్ని రోజులుగా నెల కొన్న వినూత్న వాతా వరణ పరిస్థితులు. శీతా కాలం ప్రారంభమవడం తో నగరంలో రాత్రి ఉష్ణోగ్రతలు క్రమంగా 20–18 డిగ్రీల వరకు పడిపోతుండటంతో గ్రేటర్ సిటీజన్లు తాజా వాతావరణ మార్పులకు ఉక్కిరిబిక్కిరవుతు న్నారు. అక్టోబర్ మూడో వారంలోనే నగరంలో వినూత్న వాతావరణ పరిస్థితి కారణంగా ఉబ్బ సం వ్యాధిగ్రస్తులు, చిన్నారులు, వృద్ధులు రోగులు శ్వాస ఆడక ఇబ్బందులు పడుతున్నారు. సిటీలో పలు రకాల శ్వాసకోశ వ్యాధులు, డెంగ్యూ, చికున్ గున్యా తదితర సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. మరోవైపు ప్రస్తుత వాతా వరణ పరిస్థితుల్లో గాలిలో తేమ శాతం 87 శాతానికి చేరుకోవడంతో ధూళికణాలు, వాహనాల నుంచి వెలువడుతోన్న నైట్రోజన్ ఆక్సైడ్లు గాలిలోని తేమతో కలిసి పోతుండ టంతో సిటీ జన్లు స్వేచ్ఛగా శ్వాసించే పరి స్థితి కూడా కనాకష్టమవుతోంది. వాయు కాలుష్య తీవ్రత ఇలాగే ఉంటే త్వరలోనే దేశ రాజధాని ఢిల్లీ తరహాలో భరించలేని స్థాయికి చేరుతుందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఊపిరి ఆడట్లేదు..**

వాహన కాలుష్యంలో గ్రేటర్ నగరం త్వరలో దేశ రాజధాని ఢిల్లీని మించిపోయే ప్రమాదకర సంకేతాలు వెలువడుతున్నాయి. భాగ్యనగరం లో సిటిజన్లు స్వేచ్ఛగా శ్వాసించలేని స్థాయిలో నైట్రోజన్ ఆక్సైడ్ మోతాదు క్రమంగా పెరుగుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో రోజూ సగటున 69.51 టన్నుల మేర నైట్రోజన్ ఆక్సైడ్లు వెలువడుతుండగా.. ఆతర్వాత గ్రేటర్‌లో 63.51 టన్నుల మేర ఉత్పన్నమవుతున్నట్లు పీసీబీ తాజా కాలుష్య గణాంకాలు స్పష్టం చేస్తుండటం గమనార్హం. నైట్రోజన్ ఆక్సైడ తీవ్రత రోజురోజుకూ పెరగడానికి ప్రధాన కారణం గ్రేటర్ పరిధిలో వాహన విస్ఫోటనం జరగడమేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పీసీబీ ప్రమాణాల మేరకు నిత్యం 50 టన్నుల నైట్రోజన్ ఆక్సైడ్ ఉద్గా రాలు దాటితే పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నైట్రోజన్ ఆక్సైడ్‌లకు తోడు ధూళికణాలు గాలిలోని తేమతో కలిసి పోతుండటంతో సిటిజన్ల శ్వాసకోశాలకు పొగబెడుతున్నాయి. స్వేచ్ఛగా శ్వాసించలేని పరిస్థితులు నెలకొన్నాయి.

**ఢిల్లీలో వాయుకాలుష్యం ఇలా..**

- ఢిల్లీలో నైట్రోజన్ ఆక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, ఓజోన్, కార్బన్ మోనాక్సైడ్, క్లోరో ఫ్లోరో కార్బన్లు అధికమై జనం శ్వాస సంబంధ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు.
- మరోవైపు గాలిలో తేమ అధికంగా ఉంటుంది. గాలిలో సూక్ష్మ, స్థూల ధూళికణాల మోతాదు ఘనపు మీటరు గాలిలో 60 మైక్రోగ్రాములు మించరాదు. కానీ పలు చోట్ల 450 నుంచి 500 మైక్రో గ్రాములుగా నమోదవడం గమనార్హం.
- ఘనపు మీటరు గాలిలో సల్ఫర్ డయాక్సైడ్ మోతాదు 120 గ్రాములకు మించరాదు. కానీ 150 మైక్రో గ్రాములుగా నమోదవడం గమనార్హం.
- ఘనపు మీటరు గాలిలో కార్బన్ మోనాక్సైడ్ ఒక మైక్రోగ్రాము మించరాదు. కానీ పలు ప్రాంతాల్లో 3 మైక్రో గ్రాములకు చేరుకుంది.
- ఘనపు మీటరు గాలిలో లెడ్ మోతాదు 0.75కు మించరాదు. కానీ 2 మైక్రో గ్రాములకు మించింది.
- దీనికితోడు దట్టమైన పొగమంచు కారణం గా ఢిల్లీలో ఇటీవల 200 మీటర్ల దూరం ఉన్న వస్తువులను సైతం ఢిల్లీ వాసులు చూడలేకపోతున్నారు.
- దీంతో రోడ్డు ప్రమాదాల సంఖ్య కూడా అనూహ్యంగా పెరుగుతోంది.

**పెరుగుతోన్న శ్వాసకోశ సమస్యలు..**

గ్రేటర్ పరిధిలో సుమారు 2,000కు పైగా ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులున్నాయి. ఇటీవల కాలంలో వినూత్న వాతావరణ పరిస్థితులకుతోడు వాహన కాలుష్యం పెరగడం, వాతావరణ మార్పులు, గాలిలో తేమ శాతం పెరగడంతో ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, సైనస్, బ్రాంకైటిస్ తదితర సమస్యలతో ఆస్పత్రుల్లో చేరుతోన్న వారి సంఖ్య వేలల్లోకి చేరింది. దీనికి ప్రధాన కారణం వాతావరణ మార్పులకు నైట్రోజన్ ఆక్సైడ్ కాలుష్యం తోడవడమేనని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇంటి నుంచి బయటికి వెళ్లే సమయంలో మాస్కులు ధరించాలని సూచిస్తున్నారు.

**గ్రేటర్‌లో గత ఐదు అక్టోబర్ నెలల్లో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలిలా..**

| ఏడాది | తేదీ | కనిష్ట ఉష్ణోగ్రత |
|---|---|---|
| 2018 | 28 | 16.3 |
| 2017 | 28 | 16.6 |
| 2016 | 28 | 16.3 |
| 2015 | 08 | 19.3 |
| 2014 | 30 | 16.8 |


**గ్రేటర్‌లో కాలుష్యం ఇలా..**

- గ్రేటర్‌లో నైట్రోజన్ ఆక్సైడ్లు నిత్యం 63.51 టన్నుల మేర నమోదవుతున్నాయి.
- నగరంలో ప్రతి ఘనపు మీటరు గాలిలో స్థూల, సూక్ష్మ ధూళికణాల మోతాదు 96 మైక్రో గ్రాములుగా నమోదవుతోంది. నిబంధనల ప్రకారం ఈ మోతాదు 60 మైక్రో గ్రాములు మించరాదు.
- ఘనపు మీటరు గాలిలో సల్ఫర్ డయాక్సైడ్ 120 మైక్రో గ్రాములకు మించరాదు. మన నగరంలో 135 మైక్రో గ్రాములుగా నమోదవుతోంది.
- ఘనపు మీటరు గాలిలో కార్బన్ మోనాక్సైడ్ మోతాదు ఒక మైక్రోగ్రాము మించరాదు. కానీ నగరంలో 2 మైక్రో గ్రాములుగా నమోదవుతుంది.
- ఘనపు మీటర్ గాలిలో లెడ్ మోతాదు 0.75 మైక్రో గ్రాములకు మించరాదు. కానీ ఒక మైక్రోగ్రాము మేర నమోదవుతోంది.

**ఊపిరితిత్తులకు అనర్థమే: డాక్టర్ రఫీ, పల్మనాలజిస్ట్, కేర్ ఆస్పత్రి**

నగరంలో వాహన కాలుష్యం భవిష్యత్‌లో ఢిల్లీని మించే ప్రమాదం ఉంది. ప్రపంచంలో అత్యంత కాలుష్య భరితమైన బీజింగ్ నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు స్మోక్ కలెక్టివ్ టవర్స్ (పొగ, కాలుష్యం గ్రహించే స్తంభాలు)ఏర్పాటు చేశారు. ఇటీవలి కాలంలో కాలుష్యం, వాతావరణ మార్పుల కారణంగా శ్వాస సంబంధ సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రులకు వచ్చేవారి సంఖ్య వందల నుంచి వేలకు చేరుకుంది. వాహన కాలుష్యం మానవ రోగనిరోధక శక్తిని దెబ్బతీస్తుండటంతో యాంటీబయాటిక్స్‌కు లొంగని స్థాయిలో జలుబు, దగ్గు, బ్రాంకైటిస్‌తో సిటీజన్లు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

# కొనుగోలు కేంద్రాలెక్కడ?




**సాక్షి, హైదరాబాద్:** మార్కెట్లోకి మొక్కజొన్న తరలివస్తోంది. రైతులు తమ పంటను వ్యాపారులకు విక్రయిస్తున్నారు. కానీ మార్క్‌ఫెడ్ మాత్రం మొక్కజొన్న కొనుగోలు చేసేందుకు ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేకపోయింది. కొనుగోలు కేంద్రాలు, మద్దతు ధరకు సంబంధించి వ్యవసాయ శాఖ ఈ పాటికే ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు ఎటువంటి ఆదేశాలు రాకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. మున్ముందు వ్యాపారులు ధర తగ్గిస్తే పరిస్థితి ఏంటన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. ఈ ఖరీఫ్‌లో మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 12.52 లక్షల ఎకరాలు కాగా, 9.79 లక్షల ఎకరాల్లో సాగైంది. అయితే ఈసారి ఉత్పాదకత పెరగడంతో గణనీయంగా ఉత్పత్తి ఉంటుందని వ్యవసాయశాఖ వర్గాలు అంటున్నాయి. ఇప్పుడిప్పుడే మార్కెట్లోకి మొక్కజొన్న వస్తుండటంతో మద్దతు ధరకంటే ఎక్కువ రేటుకే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. రానురాను డిమాండ్ పెరిగి ధర తగ్గించే పరిస్థితి నెలకొంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు అసలు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, దానికి సంబంధించిన ప్రక్రియ కూడా మొదలు కాలేదు. పైగా అవసరమైన నిధులనూ సమకూర్చుకోవాలి. అందుకోసం రుణం తీసుకోవాలని వ్యవసాయ శాఖ నిర్ణయించి, ప్రభుత్వ గ్యారెంటీ కోసం ప్రతిపాదనలు పంపింది. కానీ సర్కారు నుంచి ఎటువంటి స్పష్టత రాలేదని తెలిసింది. గతేడాది దాదాపు 180 వరకు కొనుగోలు కేంద్రాలు తెరిచారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుంటే వ్యాపారులు రైతులను ఇబ్బంది పెట్టే అవకాశముంది.

## ఆర్టీసీ కార్మికులకు ఎన్నారైల మద్దతు

**సాక్షి, హైదరాబాద్:** గత 16 రోజులుగా సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు దుబాయ్‌లో నివసిస్తున్న ఎన్నారైలు కొందరు మద్దతు ప్రకటించారు. టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ (దుబాయ్) ఎస్వీ రెడ్డి నేతృత్వంలోని ప్రవాసీయులు దుబాయ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం తెచ్చుకుంది రాక్షస పాలన కోసం కాదని అన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకుండా వారి ఉద్యోగాలు తీసేస్తామంటూ కేసీఆర్ వారిని రోడ్డు మీద పడేశారని మండిపడ్డారు. స్వదేశంలో ఉన్న ఆర్టీసీ కార్మికులను ముప్పతిప్పలు పెడుతున్న కేసీఆర్.. గల్ఫ్‌లో ఉన్న కార్మికులను స్వదేశానికి రావాలని ఆహ్వానించడం సమంజసం కాదన్నారు. వెంటనే ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.


## 'కేసీఆర్‌కు ఉద్యోగుల ఉసురు తగులుతుంది'



**సాక్షి, హైదరాబాద్:** సెల్ఫ్ డిస్మిస్ పేరుతో 50 వేల మంది ఉద్యోగులను రోడ్ల మీద పడేసిన సీఎం కేసీఆర్‌కు ఆర్టీసీ ఉద్యోగుల ఉసురు తగులుతుందని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆదివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన.. ఆర్టీసీలో సమ్మె చేసే పరిస్థితి రావడానికి కేసీఆరే కారణమని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక కేసీఆర్ తెలంగాణను విచ్ఛిన్నం చేసి ఆర్థికంగా దారుణమైన స్థితికి తీసుకొచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి దేశంలో ఎక్కడా లేదని, రాష్ట్ర ప్రజలను బిచ్చగాళ్లను చేసేలా ఆయన పాలన ఉందని మండిపడ్డారు.

## గాయపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలి

**చాడ వెంకట్‌రెడ్డి**



**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ సమ్మెకు మద్దతుగా నిరసనలో పాల్గొన్న సీపీఐ న్యూడెమోక్రసీ నేత పోటు రంగారావు గాయానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో సమ్మెకు మద్దతుగా నిరసనలో పాల్గొన్న రంగారావు బొటన వేలు తెగడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం చాడ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇలాంటి నిరంకుశత్వంతో తెలంగాణ వచ్చి ఉండేదా? అని ప్రశ్నించారు. కోర్టు ఆదేశించినా సర్కార్ చర్చలకు పిలవకపోవడాన్ని తప్పుబట్టారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు.


# కాసుల గలగల

- జీవో నం.59 కింద 26 లక్షల గజాల స్థలం క్రమబద్ధీకరణ
- ప్రభుత్వ ఖజానాకు రూ.393 కోట్ల ఆదాయం
- ఉచిత కేటగిరీ కింద 71లక్షల గజాలు రెగ్యులరైజ్
- జీవో నం.179 పై ముందుకు కదలని యంత్రాంగం

| | |
|---|---|
| 3.48 లక్షలు | ఉచిత కేటగిరీ కింద దరఖాస్తు చేసుకున్న వారు |
| 1.37 లక్షలు | ఇందులో అర్హత పొందిన దరఖాస్తులు |
| 91659 | ఉచిత కేటగిరీ కింద యాజమాన్య హక్కులు పొందిన వారు |

సాక్షి, హైదరాబాద్

స్థలాల క్రమబద్ధీకరణతో ఖజానాకు కాసుల పంట పండింది. ప్రభుత్వ ఆక్రమిత స్థలాలను క్రమబద్ధీకరించడం ద్వారా భారీగా రాబడి సమకూరింది. ఏకంగా ప్రభుత్వానికి రూ.393.62 కోట్ల మేర ఆదాయం లభించింది. కట్టడాలతో కూడిన ఆక్రమిత స్థలాలను క్రమబద్ధీకరించుకునేందుకు వెసులుబాటు కల్పిస్తూ ఐదేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం జీవో నం. 58, 59ను విడుదల చేసింది. దీనికి స్పందనగా.. ఇబ్బడి ముబ్బడిగా దరఖాస్తులు రాగా వాటిని పరిశీలించిన రెవెన్యూ యంత్రాంగం.. ఇందులో జీవో నం.58 (ఉచిత కేటగిరీ) కింద 91,659 మందికి యాజమాన్య హక్కులు కల్పించింది. అలాగే, జీవో నం. 59 (చెల్లింపు కేటగిరీ) కింద 14,348 మందికి కన్వియెన్స్ డీడ్‌లను జారీ చేసింది. దారిద్ర్యరేఖకు దిగువ నున్న కుటుంబాలకు ఉచితంగా ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించిన సర్కారు..జీవో నం. 59 కింద నిర్దేశిత మొత్తాన్ని చెల్లిస్తే స్థలాలపై హక్కులు కల్పించింది. గతంలో వివిధ పథకాల కింద పేదలకు అసైన్డ్ చేసిన ఇళ్ల స్థలాలపై కూడా సంపూర్ణ హక్కులు జారీ చేసింది. నామమాత్రపు ధరకు వీటిని రెగ్యులరైజ్ చేసింది. ఈ అవకాశాన్ని రాష్ట్రవ్యాప్తంగా 19,102 ఆక్రమణదారులు వినియోగించుకున్నారు. ఉచిత కేటగిరీ కింద 3.48 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా ఇందులో 1.37 లక్షల దరఖాస్తులను మాత్రమే అర్హమైనవిగా ప్రభుత్వం తేల్చింది. చెరువులు, శిఖం, నాలా, రైల్వే స్థలాలు, ఇతరత్రా నిషేధిత స్థలాల్లో వెలిసిన వాటిని తిరస్కరించిన సర్కారు.. అర్హత కలిగిన 91,659 వాటికి మోక్షం కలిగించింది. తద్వారా 71.96 లక్షల చదరపు గజాల విస్తీర్ణం మేర పేదలకు యాజమాన్య హక్కులు కల్పించింది. ఇక జీవో నం.59 విషయానికి వస్తే..48,550 దరఖాస్తులు రాగా.. ఇందులో 14,348 అర్జీలకు ఆమోదముద్ర వేసింది. తద్వారా రూ.393.63 కోట్ల మేర ఆదాయం రాబట్టింది.



## అతీగతీలేని జీవో నం. 179

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రభుత్వ ఖాళీ స్థలాలను క్రమబద్ధీకరించుకునేందుకు వీలుగా 2008లో జీ వో నం.166ను జారీ చే సింది. దీనిపై అభ్యంతరా లు వ్యక్తం చేస్తూ కొందరు పౌర సంఘాల ప్రతినిధులు కోర్టును ఆశ్రయించడంతో 2013లో జీవో అమలుపై స్టే విధించింది. అప్పటివరకు క్రమబద్ధీకరించిన స్థలాలు మినహా.. మిగతావాటిని పరిశీలించకూడదని స్పష్టం చేసింది. ఏడాది క్రితం స్టేను ఎత్తివేసిన న్యాయస్థానం.. స్థలాల క్రమబద్ధీకరణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో కేసీఆర్ సర్కార్ ప్రభుత్వ స్థలాల (కట్టడాలుంటే)ను క్రమబద్ధీకరణకు మరోసారి అవకాశం కల్పిస్తూ జీవో నం. 58, 59ను విడుదల చేసింది. ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తు చేసుకున్న వాటిని ప్రభుత్వం పరిష్కరించింది. గతేడాది జీవో నం.166 కింద పెండింగ్‌లో ఉన్నవాటికి కూడా మోక్షం కలిగించాలని భావించిన ప్రభుత్వం జీవో నం.179 ను జారీ చేసింది. జీవో నం.59 మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్న పెండింగ్‌లో ఉన్న జీవో నం.166 దరఖాస్తుల ను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్న నేపథ్యంలో రెవెన్యూయంత్రాంగం వీటికి జోలికి వెళ్లలేదు. ఈ జీవో కింద రాష్ట్రవ్యాప్తంగా 2,584 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా..ఇందులో ఇప్పటివరకు కేవలం 45 దరఖాస్తులు మాత్రమే అప్‌లోడ్ చేసి చేతులు దులుపుకున్నారు. ఇందులో 40 రంగారెడ్డి జిల్లావే కావడం విశేషం. నిర్దేశిత సాఫ్ట్‌వేర్‌లో లాగిన్‌కు అనుమతి ఇవ్వకపోవడంతోనే ఈ సమస్య ఉత్పన్నమైనట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి.

# హెచ్‌ఎండీఏ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ లేనట్టే..

- రాష్ట్రంలో కేవలం 43 మున్సిపాలిటీలకే పరిమితం చేసిన ప్రభుత్వం
- హెచ్‌ఎండీఏ పరిధిలోని 30 మున్సిపాలిటీలకు వర్తించని కొత్త ఎల్‌ఆర్‌ఎస్




**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అవకాశమిచ్చిన లేఔట్ రెగ్యులేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్)లో హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ పరిధిలోని మున్సిపాలిటీలు, మున్సిపాలిటీ కార్పొరేషన్లలోని అనధికారి లేఅవుట్ ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం లేదు. రాష్ట్ర ప్రభుత్వం తొలుత హెచ్‌ఎండీఏ పరిధిలోని 30 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా 73 సంస్థల పరిధిలో అవకాశమివ్వాలని భావించినా ఆ తర్వాత నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. 2018 మార్చి 30వ తేదీ కటాఫ్‌గా నిర్ణయించడంతో దాదాపు లక్షకుపైగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు వచ్చి కోట్లలో ఆదాయం వస్తుందని లెక్కలు వేస్తున్నారు. 90 రోజుల్లోపు అంటే మూడు నెలల్లోపు ఆయా ప్లాట్ల యజమానులు ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలని చెబుతున్నారు. ప్రారంభ ఫీజుగా రూ.పదివేలు చెల్లించి దరఖాస్తు చేసిన తర్వాత ఆయా డాక్యుమెంట్లు సరిగా ఉంటే సబ్‌రిజిస్టార్ మార్కెట్ వాల్యూ ఆధారంగా ఎల్‌ఆర్‌ఎస్, వ్యవసాయేతర (నాలా) ఫీజును అధికారులు లబ్ధిదారుని సెల్‌ఫోన్‌కు ఎస్‌ఎంఎస్ రూపంలో పంపిస్తారు. అయితే గతంలో లాగే ఈ దరఖాస్తులను డైరెక్టర్ ఆఫ్ టౌన్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) పరిశీలించనుంది. సేల్‌డీడ్, లోకేషన్ ప్లాన్, లేఔట్ ప్లాన్, ఇండిమినిటీ బాండ్, రెవెన్యూ స్కెచ్, మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్‌లతో పాటు అవసరమైన నిరభ్యంతర పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

**అవకాశం వీటికే...**

నర్సాపూర్ మునిసిపాలిటీ, చెన్నూర్, క్యాతనపల్లి, లక్సెట్టిపేట, ఖానాపూర్, చొప్పదండి, కొత్తపల్లి, రాయికల్, ధర్మపురి, మంథని, సుల్తానాబాద్, వైరా, వర్ధన్నపేట, డోర్నకల్, మరిపెడ, తొర్రూరు, నడికొండ, చిత్యల్, హాలియా, చందూర్, నేరేడ్‌చెర్ల, తిరుమలగిరి, మోత్కూరు, ఆలేర్, యాదగిరిగుట్ట, మత్కల్, భూత్పూర్, కోస్గి, కొత్తకోట, పెబ్బేర్, ఆత్మకూర్, అమరచింత, వడ్డేపల్లి, అలంపూర్, రామాయంపేట, చేర్యాల, నారాయణ్‌ఖేడ్, బాన్సువాడ, భీంగల్, ఎల్లారెడ్డి, పరిగి, కొడంగల్, ఆమన్‌గల్ మునిసిపాలిటీలకు ఎల్‌ఆర్‌ఎస్‌కు అవకాశం ఇచ్చారు..

## సెల్ఫీ వీడియో తీసి వ్యక్తి ఆత్మహత్య

**భాగ్యనగర్ కాలనీ:** సెల్ఫీ వీడియో తీసి తన స్నేహితులకు ఫోన్ ద్వారా పంపి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఇక్కడి దయార్ గూడలో స్నేహితులతో కలిసి ఓ గదిలో నివాసముంటున్న మారిసెట్టి రాజా(26) ఏసీ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆదివారం రాజా రూమ్ మేట్స్ అతడి సోదరుడు మారిసెట్టి చంద్రశేఖర్‌కి ఫోన్ చేసి రాజా ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని, వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్ప టికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు వారు పేర్కొన్నారు. దీంతో చంద్రశేఖర్ హైదరాబాద్‌కు చేరుకుని తన సోదరుడు మృతికి కారణం ఏంటని రాజా స్నేహితులను అడగ్గా, తాను సమాజంలో మార్పు రాకపోవటం వల్ల విరక్తి చెంది ఆత్మహత్య కు పాల్పడుతున్నానని రాజా సెల్ఫీ వీడియో తీసి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు చెప్పారు. కాగా, ఊరిలో ఆస్తి తగాదాలు ఉండటం వల్ల కలత చెందిన చనిపోయి ఉంటాడని చంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మృత దే హాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.